# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

25.01.2026 ఆదివారం Sunday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 198 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ.2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


## 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- 27న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు



పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని ప్రభుత్వం ఈనెల 27న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటు బ్జడెట్ సమావేశాలకు ముందు సంప్రదాయం ప్రకారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఒక ప్రకటనలో తెలిపారు. 4

## యూపీలో బాలికపై మతమార్పిడికి ఒత్తిడి

ఐదుగురు ముస్లిం బాలికలపై కేసు నమోదు



4

సింగరేణి పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు రాతలు రాస్తున్నారని, ఈ నినాదాల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి? అంటూ ప్రశ్నలు సంధించారు.



# సింగరేణిపై దుష్ప్రచారం

సైట్ విజిట్ నిబంధన గతంలో ఉన్నదే

ఎవరి ప్రయోజనం కోసం.. ఎవరు చేస్తున్నారు

వీరికి ఉన్న సబంధం ఏమిటో ప్రజలకు తెలియాలి

## ఒకరు కథనం.. మరోకరు లేఖ... ఇంకొకరు విచారణ

- సింగరేణిపై కిషన్ రెడ్డి విచారణను స్వాగతిస్తున్నాం
- అన్ని వ్యవహారాలపై విచారణ జరగాలన్నదే తన అభిప్రాయం
- మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జనవరి 24:** అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థపై నిందలు మోపుతూ, కార్మికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని డిప్యూటీ సీఎం ఆగ్రహించారు. శనివారం నాడు ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణిపై కట్టుకథలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వంపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. 'ఒకరు కథనం రాశారు, మరొకరు లేఖ రాశారు, ఇంకొకరు విచారణకు ఆదేశించారు, ఈ ముగ్గురికీ ఉన్న సంబంధం ఏంటి' అని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. సింగరేణి అటానమస్ సంస్థ అని, అన్ని నిర్ణయాలు వారే తీసుకుంటారని భట్టి తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రావడం, విచారణ జరిపించడాన్న స్వాగతిస్తున్నామని చెప్పారు. సింగరేణిలో తాను వచ్చాకే సైట్ విజిట్ నిబంధన వచ్చిందని ప్రచారం చేస్తున్నారని, నిజాలు బయటకు రావాలని, ప్రజలకు తెలియాలని చెప్పుకొచ్చారు. 2018లోనే సైట్ విజిట్ నిబంధనను కోల్ ఇండియా తీసుకొచ్చిందని, 2021లో ఎన్‌ఎమ్‌డీసీ కూడా అమలు చేసిందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 2023లో సింగరేణిలోనూ సైట్ విజిట్ కండీషన్ అమల్లోకి వచ్చిందని, సీఎమ్‌పీడీఐ

మిగతా 2 లో



## సింగరేణపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- కాంగ్రెస్, బీఆర్ఎస్ దోపిడీ దారులే
- ఉమ్మడి ఏపీని మించి గనుల దోపిడీ
- కేంద్రమంత్రి బండి సంజయ్

3



## దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళా

- 61,000 మందికి నియామక పత్రాలు అందించిన మోడీ

4



## సాయిబాబాపై అనుచిత వ్యాఖ్యలు

- టీ బీజేపీ చీఫ్‌కు శిరిడి సాయి భక్తుల ఐక్య వేదిక ఫిర్యాదు

2



## గణతంత్ర వేడుకల్లో తెలంగాణ ప్రత్యేకత

2

- పరేడ్‌లో ఒగ్గుడోలు ప్రదర్శనకు అనుమతి
- ఢిల్లీ వేదికగా ప్రాక్టీస్ చేస్తున్న కళాకారులు

# నాంపల్లిలో అగ్నిప్రమాదం

- తక్షణమే మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
- భారీగా పొగ, మంటలు చెలరేగడంతో ట్రాఫిక్ జామ్
- నుమాయిష్‌కు రావొద్దని సజ్జనార్ సూచన

2



నాంపల్లిలోని ఫర్నిచర్ షాపులో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా నుమాయిష్ ను ఒకరోజు నాంపల్లి నుమాయిష్‌ను సందర్శకులు వాయిదా వేసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ సూచించారు. అగ్నిప్రమాదం కారణంగా ఘటనా ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించిందని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని, సందర్శకులు తమ ఎగ్జిబిషన్ పర్యటనను ఆదివారానికి వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# అందరి బాగోతాలను బయటపెడతాం

- ఫోరెన్సిక్ ఆడిట్‌తో సిద్దిపేట, సిరిసిల్లల్లో అక్రమాల గుర్తింపు
- త్వరలో 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్
- ధరణి పోర్టల్ లొసుగుల వల్లే రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలు
- జిల్లాల్లోని 35 మండలాల్లో 48 మందిపై క్రిమినల్ కేసులు
- ధరణి పోర్టల్ అక్రమాలపై ఉన్నతస్థాయి కమిటీ నివేదిక
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

**హైదరాబాద్, జనవరి 24:** ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములను కొల్లగొట్టినవారిని, రిజిస్ట్రేషన్‌ల చలానా సొమ్మును కాజేసినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వంలోని పెద్దలు ప్రభుత్వ భూములను కాజేశారని, దీనిపై సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో పైలట్ కింద ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించడం జరిగిందని ఇందులో అనేక అవినీతి అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక నివేదికలో స్పష్టమైందని ఆయన తెలిపారు.

మిగతా 2 లో

## ఫోన్ ట్యాపింగ్ దోషులను వదిలేది లేదు

మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టీకరణ 2



## గంజాయి గ్యాంగ్ హల్‌చల్

2

- మహిళా కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టిన దుండగులు

# టెండర్లు రద్దు చేయడమంటే.. అవినీతి జరిగినట్లే

- అసలు విషయాలు భట్టి ఎందుకు దాస్తున్నారు
- సీఎం రేవంత్ బావమరిది విషయంలోనూ దాపరికాలు
- మండిపడ్డ బీఆర్ఎస్ నేత హరీష్ రావు

3





# ఫోన్ ట్యాపింగ్ దోషులను వదిలేది లేదు

**సూత్రధారులను, పాత్రధారులను బయటకు లాగుతాం : మంత్రి జూపల్లి**

**హైదరాబాద్,జనవరి24:** ఫోన్‌ట్యాపింగ్ కేసులో దోషులను కఠినంగా శిక్షపడేలా చూస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎవ్వరినీ వదిలి పెట్టమని స్పష్టంచేశారు. ఫోన్‌ట్యాపింగ్ అనేది చాలా దుర్మార్గమని.. దానిని రాజకీయ కక్ష్య అని అనడం సరికాదని ఆయన అన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో దర్యాప్తు జరుగుతుందని స్పష్టం చేశారు. ఫోన్‌ట్యాపింగ్ లో పాత్రధారులెవరో, సూత్రధారులెవరో తెలియాల్సి ఉందన్న మంత్రి.. దీనిని దిగజారుడు తనమే అంటారని చెప్పుకొచ్చారు. ప్రజాధనంతో నడిచేది విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ అని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏం చేసినా చూస్తూ ఊరుకోవాలా? దర్యాప్తు జరిపించవద్దా.? అని ప్రశ్నించారు. ఫోన్‌ట్యాపింగ్ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తామని మంత్రి జూపల్లి తెలిపారు. ఫోన్.. ట్యాపింగ్ అవుతుందని వి.ప్రకాశ్ అనే వ్యక్తి ఆరోజే చెప్పారని ప్రస్తావించారు. ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ కూడా ఫోన్‌ట్యాపింగ్ అయిందని గతంలో మాట్లాడారని గుర్తుచేశారు. ఐఏఎస్ అధికారులు ఆకునూరి మురళి సైతం ఈ అంశం గురించి మాట్లాడారని చెప్పుకొచ్చారు. మాజీ గవర్నర్ తమిళసై ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందని చెప్పారని ప్రస్తావించారు. మాజీ మంత్రి కేటీఆర్ సహా మరి కొందరి ఫోన్లు ట్యాపింగ్ అయ్యుండొచ్చని ఒప్పుకున్నారని జూపల్లి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసుకున్నది ప్రజల సమస్యలు పరిష్కారం కోసమేనని స్పష్టం చేశారు. కెటీఆర్‌కు 160 సీఆర్పీసీ కింద మాత్రమే నోటీసులు ఇచ్చారని.. నేరస్థులుగా పరిగణించలేదని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. సాక్షిగా సమాచారం కోసమే పోలీసులు కేటీఆర్‌ను విచారణకు పిలిచారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో పాటు కీలక పాత్ర పోషించిన కోదండరామ్‌నూ గతంలో అక్రమంగా అరెస్ట్ చేశారని వెల్లడించారు. చట్టం ప్రకారం నోటీసులిచ్చి పోలీసులు విచారిస్తారని చెప్పారు. ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు.. అమెరికాకు ఎందుకు వెళ్లిపోయారని నిలదీశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు అమెరికా నుంచి ఇండియాకు వచ్చారని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు రావడానికి చాలా కారణాలున్నాయని చెప్పారు. పార్టీలకు అతీతంగా అందరూ విచారణకు వచ్చారని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

# సాయిబాబాపై మాధవీలత అనుచిత వ్యాఖ్యలు

**బీజేపీ నేత మాధవీలతపై ఫిర్యాదు**



**హైదరాబాద్,జనవరి24:** సినీనటి, ఏపీ బీజేపీ నేత మాధవిలతపై తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావుకు శిరిడి సాయి భక్తుల ఐక్య వేదిక ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై రామ చందర్ రావు మాట్లాడుతూ.. షిరిడి సాయి బాబాపై అనుచిత వాఖ్యలు చేయడం సరైంది కాదని అన్నారు. మనోభావాలు దెబ్బ తీయడం సరికాదు.. బాబాపై వాఖ్యలకు బీజేపీకి సంబంధం లేదని తెలిపారు. సాయి బాబాపై చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని మాధవీ లతకు సూచించారు. ఎవరు ఇలాంటి వాఖ్యలు చేసిన వారికి బీజేపీమద్దతు ఉండదు.. ఏకీభవించదని స్పష్టం చేశారు. ఎవరైనా సరే భక్తుల మనోభావాలు దృష్టిలో పెట్టుకొని మాట్లాడాలని అన్నారు. సాయి బాబాపై దుష్ప్రచారం చేస్తున్న వారికి శిరిడి సాయి బాబా ఐక్య వేదిక హెచ్చరికలు జారీ చేసింది. మంచికంటి ధనుంజయ,శిరిడి సాయి భక్త ఐక్య వేదిక అధ్యక్షుడు మాట్లాడుతూ.. సాయి బాబాపై లేనిపోని మాటలు మాట్లాడితే సహించేది లేదన్నారు. సాయి బాబాపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఆది సరికాదు.. సాయి బాబా ఆలయంలో జరిగేవి హిందూ పూజలే.. ఇంకేదో పూజలు కాదన్నారు. హిందువులను విడదీసే కుట్రలు చేయకండి.. బాబాను, బాబా భక్తులను హేళన చేయకండి అని కోరారు.




# గంజాయి గ్యాంగ్ హల్‌చల్

**ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టిన దుండగులు**

**నిజామాబాద్,జనవరి24 :** నిజామాబాద్ నగర శివారులో గంజాయి గ్యాంగ్ హల్‌చల్ చేసింది. శుక్రవారం అర్ధరాత్రి తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ సిబ్బందిని కారుతో ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ గాజుల సౌమ్య తీవ్రంగా గాయపడ్డారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారు. ఆమె కిడ్నీలు దెబ్బ తిన్నట్లు వైద్యులు తెలిపారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటన అనంతరం పోలీసులు వాహనాన్ని వెంబడించి ఇద్దరు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నిర్మల్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. కానిస్టేబుల్ సౌమ్యను ఆస్పత్రిలో కలెక్టర్ ఇలా త్రిపాఠి పరామర్శించారు. మరోవైపు నిజామాబాద్ ఆబ్కారీశాఖ ఎస్‌హెచ్‌వో కార్యాలయం ముందు కానిస్టేబుళ్లు ధర్నా చేపట్టారు. సౌమ్యకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# సింగరేణిపై దుష్ప్రచారం

మొదటి పేజీ తరువాయి

డాక్యుమెంట్‌లో సైట్ విజిట్ తప్పనిసరని ఉందని చెప్పారు. 2018, 2021లో డిప్యూటీ సీఎం భట్టి లేదని, కాంగ్రెస్ లేదని ఆయన గుర్తు చేశారు. దేశంలోని పలు కేంద్ర, రాష్ట్ర సంస్థలు సైట్ విజిట్ అమలు చేస్తున్నాయన్నారు. రైల్వే, హిందుస్థాన్ కాపర్స్, గుజరాత్ ఇండస్ట్రీస్ పవర్ కంపెనీ, మహారాష్ట్ర ప్రభుత్వ టెండర్లలోనూ ఈ నిబంధన ఉందని భట్టి పేర్కొన్నారు. సైట్ విజిట్ ఎక్కడా లేదన్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దురుద్దేశంతో రాసిన ఓ కథనం ఆధారంగా ఒక నేత లేఖ రాశారని, అపోహలు పెరుగుతాయని వెంటనే టెండర్లు రద్దు చేశామని భట్టి తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లకు బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పిలిచారని, దేశంలో ఏ మైనింగ్ యాక్టివిటీలోనూ డీజిల్ సప్లయ్ చేసే పరిస్థితి లేదని చెప్పారు. 2022లో నైనీ బ్లాక్ టెండర్లలో డీజిల్ విధానం మార్చారని వెల్లడించారు. సింగరేణి 25 టెండర్లలో 20 బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 5 టెండర్లే జరిగాయని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటివరకు కాంగ్రెస్‌కు సంబంధించిన ఎవరికీ టెండర్లు రాలేదని అన్నారు. సృజన్‌రెడ్డితో సీఎంకు సంబంధాలున్నాయన్న వార్తల్లో నిజం లేదన్నారు. సృజన్‌రెడ్డి కంపెనీ శోధ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అని, ఎండీ దీప్తి రెడ్డి కందాల కూతురు అని, సృజన్‌రెడ్డి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అల్లుడని భట్టి వివరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు అసలు ఏం కావాలని, కేంద్రానికి ఎందుకు లేఖలు రాస్తున్నారని ఉపముఖ్యమంత్రి ప్రశ్నించారు. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని టెండర్లపై విచారణ జరపాలని తనకు లేఖ రాయాలన్నారు. తాడిచర్ల నుంచి నైనీ వరకు అన్నింటిపై దర్యాప్తు చేద్దామని అన్నారు. సీఎం రేవంత్ రాగానే చర్చించి విచారణకు ఆదేశిస్తామని చెప్పారు. తాను ఆస్తులు కూడబెట్టుకోవడానికి రాజకీయాల్లో రాలేదని, బొగ్గు బావుల్లో ఏ రాబందులను వాలనివ్వనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణకు ఆత్మగా ఉన్న సింగరేణిపై కొన్ని కట్టుకథలు వస్తున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణి ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో మొత్తం 25 కాంట్రాక్టులు జరిగితే.. 20 టెండర్లు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని మంత్రి వివరించారు. తెలంగాణ కు ఆత్మ సింగరేణి అని అన్నారు. అలాంటి సింగరేణిపై కట్టుకథలు.. కొన్ని లేఖలు.. కొన్ని రివ్యూలు వచ్చాయని మండిపడ్డారు. 42 వేల మంది సింగరేణి ఉద్యోగుల.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 20 వేల మందినీ మానసికంగా దెబ్బతీసేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా పెట్టుబడులు రాకుండా.. కట్టుకథల విషపు రాతలు.. తొలిపలుకు రాతలు.. తప్పుడు ప్రచారం.. రాష్ట్ర ప్రభుత్వం పై కావాలని కథనాలు రాస్తున్నారు. రోజుకో కథ వండి వారిస్తున్నారని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సింగరేణికి సంబంధించిన ఆస్తుల్ని కాపాడాల్సినటువంటి వ్యక్తిగా వీటన్నింటిని చూస్తూ ఉంటే ఏ రాబందులు ఏ గద్దలు ఏ దోపిడి దారుల ప్రయోజనాల కోసమో ఈ కథనాలన్నీ వస్తున్నట్లుగా కనిపిస్తుందన్నారు. ఇటువంటి రాతలతో తెలంగాణకు సంబంధించినటువంటి అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ



పైన నిందలు మోపే క్రమంలో ఈ రాష్ట్రానికి సింగరేణికి నష్టం చేస్తున్నారన్న సంగతి మర్చిపోవద్దని గుర్తు చేశారు. సింగరేణి నిర్ణయం మంత్రుల దగ్గరికి రాదు.. అటానమస్ సంస్థ ఇది. మంత్రి మండలి దగ్గరకు కూడా రాదు.. ఇంగితం ఉన్న.. విజ్ఞానం ఉన్న వారు ఇలా రాయరు అని తెలిపారు. పారదర్శకంగా ఉండాలి అనుకోవడమే కాదు.. పారదర్శకంగా ఉండాలి అని వెంటనే టెండర్ రద్దు చేయాలి అని చెప్పానని అన్నారు. హరీష్ లేఖ రాయడం.. కిషన్ రెడ్డి విచారణ చేపట్టడం.. మంచిది అయ్యిందన్నారు. కిషన్ రెడ్డి చర్యలను స్వాగతిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం.. అడ్డగోలుగా ప్రచారం చేసే వాళ్ల బతుకు బయట పడాలని అనుకున్నానని అన్నారు.గత డాక్యుమెంట్ల ఆధారంగానే సింగరేణి టెండర్లు పిలిచింది.. నిజం ఇలా ఉంటే.. భట్టి విక్రమార్క చేసినట్టుగా కథనాన్ని వండి వార్చారని మండిపడ్డారు.

# అందరి బాగోతాలను బయటపెడతాం

మొదటి పేజీ తరువాయి

ఈ ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని ప్రకటించారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడిన సంఘటనలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో మంత్రి పొంగులేటి సమావేశం నిర్వహించారు. విచారణలో ఎదురైన అంశాలు,ఎవరి పాత్ర ఎంత? తెరవెనుక ఎవరైనా ఉన్నారా? రెవెన్యూ అధికారుల పాత్ర ఏమైనా ఉందా? వంటి అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ ప్రాథమిక నివేదికను పరిశీలించి మరికొన్ని సలహాలు సూచనలు చేస్తూ మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదికను సమర్పించాలని సూచించారు. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటినుంచి 35వేల లావాదేవీలు జరిగాయని, ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు గుర్తించడం జరిగిందని అయితే విచారణ తర్వాత 1109 డాక్యుమెంట్లకు సంబంధించి సుమారు నాలుగు కోట్ల రూపాయిలు ప్రభుత్వానికి చెల్లింపు జరగలేదని కమిటీ సభ్యులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం అనాలోచితంగా ఎలాంటి ముందుచూపు లేకుండా ఒక కుట్రపూరితంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమాలకు పాల్పడితే భూభారతి పోర్టల్ ద్వారా ఆడిట్ నిర్వహించి



అక్రమాలను గుర్తించి తక్షణమే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. ఇందుకు సంబంధించి తొమ్మిది జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ప్రతిపక్షంలో ఉన్న ఓ నాయకుడు వెయ్యి కోట్ల అవినీతి అని, మరో నాయకుడు పదివేల కోట్లు అని ఇంకొక్కరు భూభారతి పోర్టల్ అవినీతిమయమని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇదిలావుంటే ఇప్పటికే మొదటి విడతలో నాలుగు వేల మంది శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌లు జారీ చేయగా ఆదివారం నాడు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లో మరో రెండు వేల మందికి లైసెన్స్‌లు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో రాష్ట్రంలో నక్షా లేని 373 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇంటిలిజెన్స్ అదనపు డిజి విజయ్‌కుమార్ ,ఉన్నతస్థాయి కమిటీ సభ్యులు డిఐజీ ఎమ్. సుభాషిని, సిఎమ్‌ఆర్‌వో మకరంద్, ఎసీబీ ఎస్పీ సింధు శర్మ, సైబర్ క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, ఎన్‌ఐసి ప్రతినిధి శ్రీనివాస్ , హోంశాఖ సలహాదారు పి. శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకల్లో తెలంగాణ ప్రత్యేకత

**పరేడ్‌లో ఒగ్గుడోలు ప్రదర్శనకు అనుమతి**

**ఢిల్లీ వేదికగా ప్రాక్టీస్ చేస్తున్న కళాకారులు**

**న్యూఢిల్లీ, జనవరి 24:** దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఏడాది జరిగే 77వ గణతంత్ర వేడుకుల్లో ఈసారి తెలంగాణ బిడ్డలు ప్రత్యేకంగా నిలవబోతున్నారు. రాష్ట్రపతి, ప్రధాని, ఇతర దేశాధిపతుల ముందు తెలంగాణకే సొంతమైన కళారూపాన్ని ప్రదర్శింనున్నారు. ఇప్పటి వరకు ఎన్నో కళారూపాలు రిపబ్లికే డేలో పాల్గొన్నా, తొలిసారి ఒగ్గుడోలు విన్యాసానికి చోటు దక్కింది. ఈ ప్రదర్శన కోసం సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నుంచి ప్రఖ్యాత ఒగ్గు డోలు కళాకారుడు డాక్టర్ ఒగ్గు రవి బృందానికి ఆహ్వానం అందింది. దీంతో ఒగ్గు రవి నేతృత్వంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది కళాకారులు ఈనెల 8నే ఢిల్లీకి చేరుకున్నారు. ఎముకలు కొరికే చలిలో దాదాపు 15 రోజులుగా కర్తవ్యపథ్ పై ప్రాక్టీస్ చేస్తున్నారు. సుమారు వంద మంది కళాకారులు దేశంలోని వివిధ కళారూపాలతో కలిపి, ఏక్ భారత్ అనే కాన్సెప్ట్ తో కళారూపాన్ని ప్రదర్శించనున్నారు. త్రివిధ దళాలు, పారా మిలటరీ బలగాలు, ఢిల్లీ పోలీస్ కంటింజెట్లకు ఏమాత్రం తీసిపోకుండా, కేవలం తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సిసి విద్యార్థులు ఈసారి కవాతు చేయబోతున్నారు. ఎపి, తెలంగాణ నుంచి మొత్తం 133 మంది పాల్గొంటున్నారు. ఈ టీంను కవాడీ గూడకు చెందిన బీటెక్ మూడో ఏడాది విద్యార్థి భరత్ లీడ్ చేయబోతున్నాడు. డిసెంబర్ 27 న ఢిల్లీ వచ్చిన ఈ టీం దాదాపు నెల రోజులుగా కర్తవ్య పథ్ పై కవాతు చేస్తోంది. భారత గణతంత్ర దినోత్సవాల్లో తొలిసారిగా భారతీయ సినిమా అపూర్వమైన రీతిలో జాతీయ దృష్టిని ఆకర్షించనుంది. ప్రముఖ చలనచిత్ర దర్శకుడు సంజరు లీలా భన్సాలీ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కోసం సినీ శకటాన్ని రూపొందించారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే జాతీయ ఉత్సవాల్లో ప్రముఖ సినీ దర్శకుడు ఈ ప్రత్యేక సినీ శకటానికి ప్రాతినిధ్యం వహించడం విశేషం. 'భారత్ గాథ' అనే భావనతో తీసుకువస్తున్న ఈ శకటానికి కొత్తగా స్వరపరిచిన, ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్ ఆలపించిన పాట తోడవుతుంది. జీవన సాంస్కృతిక కథనంగా సినిమా పట్ల భన్సాలీ దార్శనికతకు ఇదొక తార్కాణంగా నిలుస్తుంది.

# నాంపల్లి ఫర్నీచర్ షాపులో అగ్నిప్రమాదం

**తక్షణమే మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది**

**పొగ, మంటలు చెలరేగడంతో ట్రాఫిక్ జామ్**

**హైదరాబాద్, జనవరి 24:** హైదరాబాద్ నగరంలోని రద్దీ ప్రాంతమైన నాంపల్లిలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక ఫర్నిచర్ షోరూమ్‌లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు నిమిషాల వ్యవధిలోనే భవనం మొత్తానికి వ్యాపించాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నాంపల్లి ప్రధాన రహదారిపై ఉన్న ఒక నాలుగు అంతస్తుల కమర్షియల్ భవనంలో ఈ ప్రమాదం సంభవించింది. భవనం కింద ఉన్న సెల్లార్‌లోని హోల్‌సేల్ ఫర్నిచర్ షాపులో మొదట మంటలు ప్రారంభమయ్యాయి. లోపల ఫర్నిచర్ సామాగ్రి అధికంగా ఉండటంతో మంటలు వేగంగా పై అంతస్తుల వరకు వ్యాపించాయి. దట్టమైన పొగలు పరిసర ప్రాంతాలను కమ్మేయడంతో జనం పరుగులు తీశారు. ప్రమాద సమయంలో భవనంలో ఇద్దరు నుండి నలుగురు పిల్లలు చిక్కుకున్నట్లు వార్తలు రావడంతో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. అయితే, అగ్నిమాపక సిబ్బంది రాకముందే స్థానిక యువకులు సాహసించి భవనంలోకి వెళ్లి పిల్లలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. భవనంలోని మిగిలిన కుటుంబాలను , పక్కనే ఉన్న రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లోని నివాసితులను అధికారులు వెంటనే ఖాళీ చేయించారు. మంటలను అదుపు చేసేందుకు నాలుగు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అయితే, భవనం ఇరుకైన సందులో ఉండటం , చుట్టూ సెట్‌బ్యాక్స్ లేకపోవడంతో అగ్నిమాపక యంత్రాలు లోపలికి వెళ్లడానికి వీలు పడలేదు. దీంతో సిబ్బంది పక్కనే ఉన్న భవనాల గోడలపైకి ఎక్కి ప్రాణాలకు తెగించి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ప్రధాన రహదారిపైనే ఈ ప్రమాదం జరగడంతో నాంపల్లి నుంచి అబిడ్స్ వెళ్లే మార్గంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పరిస్థితిని గమనించిన ట్రాఫిక్ పోలీసులు వెంటనే వాహనాల రాకపోకలను ఇతర మార్గాల్లోకి మళ్లించారు. గంటల తరబడి శ్రమించిన అనంతరం అగ్నిమాపక సిబ్బంది మంటలను ప్రాథమికంగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఆస్తి నష్టం భారీగానే ఉన్నప్పటికీ, ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నగరంలోని ఇరుకైన ప్రాంతాల్లో అగ్నిమాపక నిబంధనలు పాటించకపోవడం వల్ల ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**నుమాయిష్‌కు రాకండి : సజ్జన్నార్ సూచన**

నాంపల్లిలోని ఫర్నిచర్ షాపులో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా నుమాయిష్ ను ఒకరోజు నాంపల్లి నుమాయిష్‌ను సందర్శకులు వాయిదా వేసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ సూచించారు. అగ్నిప్రమాదం కారణంగా ఘటనా ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించిందని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని, సందర్శకులు తమ



ఎగ్జిబిషన్ పర్యటనను ఆదివారానికి వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాంపల్లిలో బచ్చా క్రిస్టల్ ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. నాలుగు అంతస్తుల భవనంలో ఇద్దరు చిన్నారులతో సహా ఆరుగురు చిక్కుకున్నట్లు సమాచారం . ఫైరిరజన్లు రంగంలోకి దిగి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ నుంచి దట్టమైన పొగలు రావడంతో వారు బయటకు రాలేక పై అంతస్తుల్లోనే ఉండిపోయారు. జేసీబీలు, భారీ క్రేన్ల సహాయంతో భవనం పైభాగంలో ఉన్న వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు రెస్క్యూ టీమ్ తీవ్రంగా శ్రమించింది.

# సింగరేణిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- కాంగ్రెస్, బీఆర్ఎస్ దోపిడీ దారులే
- ఉమ్మడి ఏపీని మించి గనుల దోపిడీ
- కేంద్రమంత్రి బండి సంజయ్



**హైదరాబాద్,జనవరి 24:** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ఇప్పుడు నీతులు వల్లిస్తున్నాయని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని ఆరోపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన.. మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. 2014 నుంచి ఇప్పటివరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే.. గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారని ఆరోపించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే.. బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా? అని మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెబుతున్నారని ప్రస్తావించారు. సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోందని ఆరోపించారు. సింగరేణిపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో టైంపాస్ చేయొద్దని బండి అన్నారు. సింగరేణి అవకతవకలకు సంబంధించిన రికార్డులన్నీ వెంటనే సీజ్ చేయాలని కోరారు. లేనిపక్షంలో అవి తారుమారు చేసే ప్రమాదముందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనని బండి సంజయ్ విమర్శించారు. ఆ సొమ్ముతోనే బీఆర్ఎస్‌ను ఇన్నాళ్లూ నడిపించారని ఆరోపించారు. 'రూ.42 వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంది. సింగరేణిని అప్పుల పాల్జేసింది. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామంటారు. అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మునంతా దారి మళ్లించడం పరిపాటైంది. సింగరేణి ప్రజలు, కార్మికులు రెండు పార్టీల తీరును చూసి అసహ్యించుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలే. మా బాగోతం మీరు బయటపెడితే.. మీ బాగోతం మేం బయటపెడతామంటూ మాట్లాడుకుంటున్నారు. మరో వారం రోజుల తర్వాత సింగరేణి బాగోతాన్ని దారి మళ్లించేందుకు మరో అంశాన్ని తెరపైకి తెస్తారు. ఎన్ని అరాచకాలు, అవినీతి చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదనే ధీమా కేసీఆర్ కుటుంబంలో ఉందని విమర్శించారు. కేటీఆర్ పెద్ద నిజాయతీపరుడిలా మాట్లాడుతున్నారు. ఎన్ని కుటుంబాలను, ఎంత మంది జీవితాలను నాశనం చేశారో తెలియదా? నిజామ్ అరాచకాలను మరువలేదు.. నీ అరాచకాలను కూడా మర్చిపోలేం. కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదు. ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్.. నా ఛాలెంజ్‌కు సిద్ధమా? దేవుడి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేసే దమ్ముందా? మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు, వ్యాపారులతో పాటు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నంబర్లను చేర్చింది నిజం కాదా? ఆఖరికి కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ఆ జాబితాలో చేర్చి ఫోన్ ట్యాపింగ్ చేయించలేదా? ఇంకా సిగ్గులేకుండా దేశ భద్రత కోసం ఫోన్ ట్యాపింగ్ చేశామని చెబుతారా? నేను సవాల్ విసిరితే లీగల్ నోటీసులంటూ డ్రామాలాడతారు. పోనీ ఆ లీగల్ నోటీసులకైనా కట్టుబడి ముందుకు సాగుతారా? అంటే.. మధ్యలోనే పారిపోతారు' అని కేంద్ర మంత్రి ఎద్దేవా చేశారు.

# టెండర్లు రద్దు చేయడమంటే..అవినీతి జరిగినట్లే

- అసలు విషయాలు ఎందుకు దాస్తున్నారు
- సీఎం రేవంత్ బావమరిది విషయంలోనూ దాపరికాలు
- మండిపడ్డ బీఆర్ఎస్ నేత హరీష్ రావు



**హైదరాబాద్, జనవరి 24:** బొగ్గు కుంభకోణం విషయంలో అవినీతి ఆరోపణలు రావడంతో నైనీ టెండర్ రద్దు చేశారంటే, స్కాం జరిగినట్లేనని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు.నైనీ వ్యవహారంలో మంత్రి భట్టి మసిబూసి మారేడు కాయ చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో సోలార్ స్కాం చేసిన ఆరోపణలపై మౌనం ఎందుకు వహిస్తున్నారని ఆరోపించారు. శనివారం హరీష్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. రేవంత్ రెడ్డి బావమరిది కోసమే ఈ తతంగమంతానని విమర్శించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని సూటిగా చెప్పలేక, విషయాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నైనీ టెండర్ రద్దు చేయడమే అవినీతికి నిదర్శనమని, అదే తరహాలో పిలిచిన మిగిలిన టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని చెప్పకుండా బీటింగ్ అరౌండ్ ద బుష్ లా ఏదో చెప్పి, మసిబూసి మారేడు కాయ చేసారు. మీరెన్ని సాకులు చెప్పినా మీ కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగింది నిజం. అందులో రేవంత్ రెడ్డి బామ్మర్ది రింగ్ మెన్ గా పాత్ర పోషించింది నిజం. నేను సూటిగా అడుగుతున్నా. ఏ స్కాం జరగకుంటే నైనీ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఎందుకు ప్రకటించారు? నిన్న బయటపెట్టిన మరో కుంభకోణం.. సోలార్ పవర్ స్కాం గురించి ఎందుకు ఒక్క మాట కూడా ప్రెస్ మీట్ లో మాట్లాడలేదని నిలదీశారు. నైనీని రద్దు చేసినట్లే మిగతా అన్ని టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదు? సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను బిఆర్ఎస్ మీద నెట్టే ప్రయత్నం చేయడం వల్ల నిజాలు అబద్దాలు అయిపోవు. జరిగిన స్కాంలు, స్కీంలుగా మారిపోవని స్పష్టం చేశారు. సైట్ విజిట్ నిబంధనను 2018లోనే మొదలైందని చెప్పి, దానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణలుగా చెప్పి ఏం చెప్పదలుచుకున్నారు? అది తప్పు కాకుంటే నైనీ ఎందుకు రద్దు చేసినట్లు? ఇదే సైట్ విజిట్ విధానం సింగరేణిలో కూడా అమలు చేసామని ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు ధన్యవాదాలని అన్నారు. భట్టి గారూ. మీరంటే నాకు చాలా గౌరవం. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జి లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ మాత్రమే చేయగలవు అన్న ఉద్దేశ్యంతోనే లేఖ రాసాను. మీరు నిజంగా రేవంత్ రెడ్డి, అతని బావమరిది కుంభకోణం మీద నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తాను అని హామీ ఇస్తే మీకూ లేఖ రాయడానికి సిద్ధమని హరీష్‌రావు స్పష్టం చేశారు.

# వేధింపులను తప్పుపడితే నోటీసులా?

- ప్రజా సమస్యలు, దౌర్జన్యాలపై గొంతెత్తుతూనే ఉంటా
- సిట్ పోలీసుల నోటీసులపై మాజీ ఐపిఎస్ ప్రవీణ్ కుమార్



**హైదరాబాద్,జనవరి 24:** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేటీఆర్, హరీష్‌రావులను గంటల తరబడి దర్యాప్తు పేరిట వేధించడాన్ని తప్పుబడితే తనకు సిట్ నోటీసులు అందించడంపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఖండించిన 12 గంటల లోపే రాత్రి 12 గంటలకు ఇంటికి వచ్చి సిట్ పోలీసులు నోటీసులు ఇచ్చి రెండు రోజుల్లో ఆధారాలతో సహా రిప్లై ఇవ్వకపోతే సివిల్, క్రిమినల్ చర్యలకు సిద్ధం కావాలని వార్నింగ్ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, దౌర్జన్యాలపై గొంతెత్తడం నా హక్కు అని వెల్లడించారు. పోలీసుల వార్నింగ్‌లకు భయపడేది లేదని స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ కూడా వ్యక్తిగత దూషణలు , చిల్లర భాషను వాడనని, అదేవిధంగా వాస్తవాలు దాచనని తెలిపారు. దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం కూడా ఆపనని వెల్లడించారు.రేవంత్ రెడ్డి ట్యాపింగ్ జరగడం మామూలే అని ఢిల్లీలో చెప్పినట్లుగా కూడా వార్తలున్నాయి. అలాంటప్పుడు సిట్ దర్యాప్తు ఎందుకు? అని ప్రశ్నించారు. సిట్ ఛీఫ్ సజ్జనార్‌పై ఆంధ్ర ప్రదేశ్ లో నమోదైన కేసుల మీద మరో సిట్ వేయాలి అని డిమాండ్ చేసినట్లుగా నోటీసులో ఉందని , ఇది వాస్తవ విరుద్ధమని అన్నారు. ఓటుకు నోటు కేసులో లైవ్ కెమెరాలో నాటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి అడ్డంగా దొరికిన తరువాత, ఆంధ్ర ప్రదేశ్ నాయకుల ఫోన్లు తెలంగాణ ప్రభుత్వం, ఇంటలిజెన్స్ అధికారులు ట్యాప్ చేశారని 2015 జూన్ నెలలో ఆంధ్రలో అనేక పోలీసు స్టేషన్లలో తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పై కేసులు నమోదయ్యాయని పత్రికల్లో చాలా వార్తలొచ్చాయి. ఆ సమయంలో ఆంధ్రలో కూడా ఒక సిట్ కూడా ఏర్పాటు అయ్యింది. నాడు తెలంగాణ ఇంటెలిజెన్స్ విభాగం లో అధికారిగా సీపీ సజ్జనార్ పనిచేశారు అన్న అవగాహన తనకుందని అన్నారు. ప్రస్తుత ట్యాపింగ్ వ్యవహారం పై వేసిన రెండో తెలంగాణ సిట్‌కు ఛీఫ్ గా ఉండడం నైతికంగా కరెక్టు కాదని అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా మరుగున పడిన విషయాలను ప్రజల ముందుకు తీసుకరావాల్సిన కనీస బాధ్యత తనపై ఉందన్నారు. ఈ విషయం మీకు నచ్చకపోతే వివరణ ఇవ్వాలని సూచించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న పలు కుంభకోణాల మీద సిట్ వేయాలని డిమాండ్ చేశానని వివరించారు. తాను సజ్జనార్‌తో సహా ఏ అధికారి, ఏ రాజకీయ నాయకుడి వ్యక్తిత్వ హననానికి పాల్పడలేదని వెల్లడించారు. గత రెండేళ్లుగా కేటీఆర్, హరీష్ రావు, మరెందరో బీఆర్ఎస్ నాయకులపై రేవంత్ రెడ్డి ప్రతీకార పాలనలో తీవ్రమైన వ్యక్తిత్వ హననానికి గురయ్యారని పేర్కొన్నారు. ఆ విషయంలో నిందితులపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం చేస్తున్న ట్యాపింగ్ పై చేసిన ఫిర్యాదు చేస్తే పోలీసులు ఇంతవరకు రేవంత్ రెడ్డికి నోటీసులు ఎందుకు ఇవ్వలేదని అన్నారు. కనీసం తనకు అక్నాలె÷-జడ్మెంటు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. కేవలం బీఆర్ఎస్ నాయకులకు మాత్రమే నోటీసుల మీద నోటీసులు రావడం, మీడియా లీకులు, జర్నలిస్టుల, సోషల్ మీడియా ఆక్టివిస్టుల విచ్చలవిడి అరెస్టులు దేనికి సంకేతమని నిలదీశారు. నాలుగు గోడల మధ్య జరగాల్సిన దర్యాప్తుపై గాంధీభవన్ లో కాంగ్రెస్ నాయకులు ప్రతిరోజూ లైవ్ కామెంటరీ ఇవ్వడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

# బండి, ధర్మపురికి కేటీఆర్ లీగల్ నోటీసులు

## పరువు తీసినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్



**హైదరాబాద్, జనవరి 24 :** కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. తనపై, తన కుటుంబంపై నిరాధారమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసినందుకు సంజయ్, అర్వింద్‌లకు విడివిడిగా లీగల్ నోటీసులు జారీ చేశారు. తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేలా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని సడలించేలా వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్టు కేటీఆర్ తెలిపారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అడ్డగోలుగా మాట్లాడిన వీరు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా కేవలం దురుద్దేశం పూర్వకంగా, రాజకీయాల కోసం దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు బండి సంజయ్, అర్వింద్‌లకు కేటీఆర్ తన న్యాయవాదులతో నోటీసులు పంపించారు. కేటీఆర్ కుటుంబం ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్లు సంపాదించిందని, సెలబ్రిటీల ఫోన్లు ట్యాప్ చేశారంటూ ఈనెల 23న నిర్వహించిన ప్రెస్ మీట్‌లో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే బండి సంజయ్‌పై సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం దావా నడుస్తున్నప్పటికీ, మళ్లీ అదే తరహాలో తప్పుడు ఆరోపణలు చేయడం దురుద్దేశపూర్వకమని మండిపడ్డారు. మరోవైపు ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు పంపిన నోటీసులో ఆయన చేసిన వ్యక్తిగత దూషణలను తప్పుబట్టారు. డ్రగ్స్ సేవించడం, సరఫరా చేస్తున్నారంటూ అర్వింద్ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని పేర్కొన్నారు.



# యధాతథంగా టీహబ్ కార్యాలయం

## ప్రభుత్వ కార్యాలయాల మార్చవద్దన్న సీఎం

## అమెరికా నుంచి సీఎస్‌కు రేవంత్ ఆదేశాలు

**హైదరాబాద్, జనవరి 24:** టీహబ్‌ను స్టార్టప్‌ల కేంద్రంగానే కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ అంశంపై సీఎస్ రామకృష్ణారావుకు అమెరికా నుంచి ఫోన్ చేసి సీఎం మాట్లాడారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను టీహబ్‌కు మారుస్తున్నారనే వార్తలను ఖండించారు. టీహబ్‌లో ఇతర ఆఫీసులు ఉండకూడదని ఆదేశించారు. అలాంటి ఆలోచనలు అధికారులు విరమించుకోవాలన్నారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ ఆఫీసులను ఇతర ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సీఎం సూచించారు. టీహబ్‌ను స్టార్టప్ కేంద్రంగా కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆఫీసులను టీ హబ్‌కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తలపై ముఖ్యమంత్రి స్పందించారు. అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు మార్చాలని సూచించారు.

# మావోయిస్టులకు ఆశ్రయం

## సోదాలు చేపట్టిన పోలీసులు



**నాగర్‌కర్నూల్, జనవరి 24:** అమ్రాబాద్ ప్రాంతంలో శనివారం పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. మావోయిస్టు సభ్యులకు ఆశ్రయం ఇచ్చినట్టు ఆరోపణల నేపథ్యంలో ప్రజా సంఘాల నాయకుల ఇళ్లలో పోలీసులు సోదాలు చేపట్టారు. ఈ క్రమంలో అడ్ల అంబయ్య, జక్క బాలయ్య నివాసాల్లో తనిఖీలు చేశారు. ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఆధ్వర్యంలో మావోయిస్టులకు షెల్టర్ ఇచ్చినట్టు పోలీసులకు నిఘా సమాచారం అందిన నేపథ్యంలో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో సల్మాన్, ఆయన భార్య సుకుమ సహా మొత్తం ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు ఇంకా అధికారిక వివరాలు వెల్లడించాల్సి ఉంది. కాగా, ఈ సోదాల సమయంలో పోలీసులు కొన్ని డాక్యుమెంట్లు, మొబైల్ ఫోన్లు, సామాజిక సంఘాల సంబంధిత మెటీరియల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న వారిని విచారిస్తున్నారు. మావోయిస్టు కనెక్షన్లు, ఆర్థిక సహాయం, లాజిస్టిక్స్ సపోర్ట్ వంటి అంశాలపై పోలీసులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. అమ్రాబాద్ ప్రాంతం తెలంగాణలో మావోయిస్టు ప్రభావం ఉన్న ఏరియాల్లో ఒకటిగా పోలీసులు భావిస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఇక్కడ పోలీసులు, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అప్రమత్తంగా ఉన్నాయి. ఈ దాడులు మావోయిస్టు నెట్‌వర్క్‌ను బలహీనపరచడానికి, సపోర్టర్లను గుర్తించడంలో భాగమేనని పోలీస్ అధికారులు అంటున్నారు. ఇవి సమీప భవిష్యత్ లోనూ కొనసాగుతాయని పోలీసులు చెబుతున్నారు. అయితే, ప్రజా సంఘాల నేతల్ని అదుపులోకి తీసుకున్నా.. వారి బంధువులు, సహచరులు ఇది రాజకీయ హింస, ప్రజా ఉద్యమాలపై దాడి అని ఆరోపిస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ ఇన్‌చార్జిలు

## మున్సిపాలిటీల వారీగా సమన్వయకర్తల నియామకం



**హైదరాబాద్, జనవరి 24:** పురపాలక ఎన్నికల కోసం బిఆర్ఎస్ ఇన్‌ఛార్జిలను నియమించింది. త్వరలో ఎన్నికలు జరగనున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా సమన్వయకర్తల జాబితాను ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విడుదల చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ను ఒక సీనియర్ నాయకుడికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల వ్యూహాలను రూపొందించడం సమన్వయకర్తల ప్రధాన బాధ్యత అని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల పక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు నిరంతరం ఆయా మున్సిపాలిటీల్లో అందుబాటులో ఉంటారని చెప్పారు. ఎన్నికల్లో అత్యంత కీలకమైన అభ్యర్థుల ఎంపిక పక్రియలో ఇన్‌ఛార్జిలు కీలక పాత్ర పోషిస్తారన్న ఆయన... స్థానిక నాయకత్వంతో చర్చించి, గెలుపు గుర్రాలను గుర్తించి, నివేదికలను ఎప్పటికప్పుడు పార్టీ అధిష్ఠానానికి సమర్పిస్తారని పేర్కొన్నారు. పార్టీ రూపొందించిన ప్రచార కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడం, బూత్ లెవల్ ఏజెంట్లను సమన్వయం చేయడం వంటి అంశాలను పర్యవేక్షిస్తారని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల సరళి, క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదించేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

**27న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు**



**న్యూఢిల్లీ, జనవరి 24:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని పరభుత్వం ఈనెల 27న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటు బ్జడెట్ సమావేశాలకు ముందు సంప్రదాయం ప్రకారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 27వ తేదీన పార్లమెంట్‌లోని మెయిన్ కమిటీ రూమ్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో చేపట్టనున్న లెజిస్లేటివ్, ఇతర అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. జనవరి 28న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించడంతో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. జనవరి 28తో ప్రారంభమయ్యే తొలి విడత బ్జడెట్ సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. రెండో విడత బ్జడెట్ సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తాయి. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారంనాడు కేంద్ర బ్జడెట్ 2026-27ను ఉభయసభల్లోనూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. సీతారామన్ వం-సగా ప్రవేశపెడుతున్న తొమ్మిదవ బ్జడెట్ ఇది. ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకూ రాష్ట్రపతి బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఉంటుంది. దీనితో పాటు వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు-2025, ది సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్-2025, రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు-2024పై సభలో చర్చ ఉంటుంది. ఈ బిల్లులను తదుపరి పరిశీలన కోసం పార్లమెంటరీ స్థాయీ సంఘానికి లేదా సెలెక్ట్ కమిటీలకు పంపనున్నారు. కాగా, గత శీతాకాల సమావేశాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్(గ్రామీణ్) చట్టంపైనా పార్లమెంటులో చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం చేసిన ఈ మార్పుపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించడంతో పాటు కొత్త చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ప్రచారం సాగిస్తోంది.



**సంపాదకీయం**

# తల్లిదండ్రులూ.. తస్మాత్ జాగ్రత్త!

భారతీయ విద్యావిధానం మనిషి మేధావిని భాషించేలా..ప్రపంచాన్ని శాసించేలా ఉండేది. అన్నిరంగాల్లో విద్యార్థులను ఆరితేరేలా చేసే మన విద్యావిధానం పాతపడి పోయింది. ఎందుకంటే దానిని పాతరేశారు. బ్రిటిషర్ల హయాంలో మెకాలే విద్యావిధానంతో మన విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిపోయింది. అందుకే సమాజంలో నైపుణ్యత, నాణ్యత లేని విద్యను గడిస్తున్న విద్యార్థులు కోకొల్లలుగా పుట్టుకు వస్తున్నారు. వారికి నైపుణ్యాలు లేక ఎక్కడా రాణించడం లేదు. ఒళ్లు వంచి పనిచేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో మనదేశంలో కోటళల్లో నిరుద్యోగులు పెరిగి పోతున్నారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో అవకాశాలు దండిగా ఉన్నా.. బిటెక్, ఎంటెక్‌లు చదివిన వారంతా ఇలాంటి పనులకు రాలేకపోతున్నారు. చదువు వేరు వృత్తి వేరు అన్న విధంగా ఆలోచించే ధోరణి కానరావడం లేదు. భారతీయుల మేధస్సు అమోఘం, అద్భుత మని ప్రపంచం ఎప్పుడో గుర్తించింది. ఇప్పటికీ విదేశాల్లో రాణిస్తున్నది కూడా మనవారే. ముఖ్యంగా ఇంగ్లీష్, మ్యాథ్, సైన్స్ తదితర రంగాల్లో అద్భుత ప్రదర్శనను కనబరుస్తున్నాం. అయితే ఈ దిశగా మానవనరులను అభివృద్ధి చేసుకునేలా విద్యావిధానం రావడం లేదు. సమాజంలో విలువలు పడిపోవడానికి, యువతలో నైపుణ్యాలు లేకపోవడం కూడా విద్యావిధాన లోపంగానే గుర్తించాలి. అత్యాధునిక ఫోన్లు, ఇంటర్నెట్, సోషల్ మీడియా ప్రభావంతో విద్యార్థుల్లో నైపుణ్యత కొరవడింది. ప్రతిదానికి గూగుల్‌లో వెతికేస్తున్నారు. అలాగే గంటలతరబడి సెల్ ఫోన్లకు అతుక్కుపోతున్నారు. అలవాట్లో భాగంగా యువత పోర్న్ వీడియోలు తిలకిస్తున్నారు. జూదాలకు బానిసలు అవుతున్నారు. అర్థాంతరంగా తనువులు చాలిస్తున్నారు. నిజానికి ఇదో సామాజిక రుగ్మత. దీనిని మార్చాలంటే అక్షరాభ్యాసం నుంచే క్రమశిక్షణ అలవర్చాలి. విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. విలువలతో కూడిన విద్యను నేర్పాలి. లేకుంటే మరింతగా సమాజం దెబ్బతినగలదు. ఎందుకంటే ప్రస్తుతం పిల్లలంతా సెల్ ఫోన్లకు అలవాటు పడ్డారు. చిన్న పిల్లవాడిని బుజ్జగించడానికి, అన్నం పెట్టడానికి కూడా సెల్ ఫోన్ వాడేస్తున్నాం. దీంతో పిల్లల్లో మానసిక పరిపక్వత లోపించి, తరగతి గదిలో పరధ్యానంగా వుండిపోతున్నారు. ఆటస్థలంలోనూ నిశ్శబ్దంగా వుంటున్నారు. చురుకుగా, రాటులేదలే కపోతున్నారు. పాఠాలు ఇప్పుడు చాలా చోట్ల స్క్రీన్ల మీద చెబుతు న్నారు. పిల్లలు వీటిని చూస్తూ టీచర్ల వైపు చూడ్డమే మానేశారు. వారితో సంభాషించడం లేదు. పరస్పర అవగాహన లోపిస్తోంది. దీంతో పిల్లలు టీచర్లు ఒకరికి ఒకరు దూరమైపోతున్నారు. తీరిక సమయాల్లో పిల్లలు వాళ్లలో వాళ్లు కూడా మాట్లాడు కోవడం మానేస్తున్నారు. ఇప్పటి పిల్లలది ఏదో ఒక కొత్త లోకమనిపిస్తోంది. మన కుర్రకారు యవ్వనమంతా అశాంతి, చిరాకు, ఆందోళన, ఒంటరి తనాలతో నిండిపోతోంది. తరగతి గది, బడి వాతావరణమంతా యాంత్రికంగా మారింది. పుస్తకాలూ చదవకుండా, గ్రంధపఠనం లేకుండా, పరిసరాల పై అవగాహన లకుండా, చుట్టూ ఏం జరుగుతుందో తెలియకుండా చదివేసి పట్టాలు పుచ్చుకుంటున్నారు. మన తినే అన్నం ఏ ధాన్యం ద్వారా వస్తుందో కూడా తెలియడం లేదు. పాలు ఎలా వస్తాయో తెలియడం లేదు. సెల్‌ఫోన్ పిచ్చిలో పడి మనిషికి మనిషికీ మధ్య అనుబంధాన్ని కోల్పోతున్నారు. నిజానికీ దేశంలోని పిల్లలందరికీ విజ్ఞానం దక్కాలి. వాళ్ల సామర్థ్యాలన్నీ వెలికి రావాలి. వారి మేధస్సుకు పదును పెట్టాలి. ఇవన్నీ కూడా పాఠశాలలో బోధనా తీరుతో..అదికూడా మన ప్రాచీన పద్ధతుల ద్వారానే సాధ్యం అవుతుంది. దీనికి ప్రభుత్వాలదే ప్రధాన బాధ్యత. పాలకుల ఓటు బ్యాంక్ రాజకీయాలకు విద్యావ్యవస్థ బలయిపోతోంది. చిన్ననాటి నుంచే కులాల కుంపట్లను రాజేస్తున్నాం. ఇక కులరహిత సమాజం ఎక్కడ పోతుందన్న ఆలోచన చేయడం లేదు. మనం మన పిల్లలకు కావలసిందంతా ఇస్తున్నామనుకుంటున్నాం. విస్తృత ప్రపంచాన్ని వారి ముందు తెరిచి పెడుతున్నామనుకుంటున్నాం.కానీ అది ఎలాంటి విపరిణామాలకు దారితీస్తున్నదో గ్రహిచడం లేదు. నగరాల్లో ఉన్న సెంట్రల్ సిలబస్, కేంబ్రిడ్జ్ వంటి స్కూళ్లతో పోల్చుకుంటే ఇప్పటికీ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే కొంత జనరలం నాలెడ్జ్ అబ్బుతోంది. సెల్‌ఫోన్ కారణంగా మన పిల్లలు మానసిక రుగ్మతకు లోనవుతున్నారు. దీనికితోడు పిజ్జాలు, బర్గర్లు, చిప్స్, కూల్ డ్రింక్స్ లాంటి చెత్త తిండి వల్ల ఊబకాయం పెరిగి అనేక రకాల రోగాలు చేరుతున్నాయి. టీనేజర్లలో ఆత్మహత్యా ప్రయత్నాలు పెరిగాయి. ఒక అధ్యయనం ప్రకారం ప్రతి ముగ్గురు బిడ్డల్లో ఒకరికి కంటి సమస్య తలెత్తు తోంది. ఒకరకంగా ఇదంతా మనం తెచ్చిపెట్టుకున్న సమస్య. ఎక్కువ కాలం ఫోన్లపై గడపడం, బ్లూ లైట్లు, నిద్ర లేమి, ఆటల కొరత ఇవన్నీ మనం కోరి తెచ్చుకొన్న ఉపద్రవాలు. కంటి జబ్బులతో ఇది ఆగడం లేదు. ఈ ఫోన్ల పుణ్యమా అని మన పిల్లలు డ్రగ్స్ బారిన పడుతున్నారు. హింసాత్మకంగా మారుతున్నారు. పోర్న్ వీడియోలకు బానిసలవుతున్నారు. వారి ప్రవర్తనలో తీవ్రమైన మార్పులొస్తున్నాయి. బస్సుల్లో, రైళ్లలో ప్రయాణించే మన చంటిపిల్లలు కూడా ఫోన్లకు అతుక్కుపోతున్నారు. కిటికీ లోంచి బయటికి చూడ్డం లేదు. అక్కడ వారికే కొత్త లోకమూ కనపడ్డం లేదు. విచిత్రంగా పసిబిడ్డలకు కూడా ప్రపంచం మూసుకుపోతోంది. ఇంతకంటే విషాదం మరోటి ఉండదు. కోవిడ్ రోజుల్లో మనం చెప్పిన ఆన్‌లైన్ పాఠాలు కూడా వారిని మరింతగా ఫోన్లకు బానిసల్ని చేశాయి. మనకు తెలియకుండానే మన పిల్లలు మానసికంగా బలహీనులై పోయారు. టెక్నాలజీ ఏదో గొప్పదనీ, దీన్ని చిన్నప్పటి నుంచే పిల్లలకందించాలనీ మనమనుకుంటే అది పిల్లల్ని బడికి, కుటుంబానికి, చివరకు స్వతంత్ర ఆలోచనలకు కూడా దూరం చేసింది. ఇప్పుడు కోవిడ్ లేదు. అయినా సెల్ ఫోన్ల జాడ్యం మాత్రం కొనసాగుతోంది. దీనికి దూరం చేయడం కోసం పిల్లల్లో మానసిక పరివర్తనకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. సమతు ఆహారం ఇవ్వాలి. వ్యాయామం, నడకను ప్రోత్సహించాలి. ఇలా మనమంతా మన ప్రాచీన అలవాట్లను ముందుకు తెచ్చుకుంటే తప్ప మనుగడ సాగించడం కష్టం. తల్లిదండ్రులు ఈ బిజీ లైఫ్‌లో పిల్లల మనుగుడ గురించి ఆలోచించడం లేదు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పాఠశాలల్లో వ్యాపారధోరణి పెరిగింది. అందుకే మనమే మారాలి. పిల్లల కోసం సమయం కేటాయించాలి. ఇంటినుంచే మార్పు రావాలి.



# దేశవ్యాప్తంగా 18వ రోజ్‌గార్ మేళా

**61,000 మందికి నియామక పత్రాలు అందించిన మోడీ**

**న్యూఢిల్లీ,జనవరి 24:** దేశవ్యాప్తంగా శనివారం జరిగిన 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కొత్తగా వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వారికి నియామక పత్రాలను మోదీ వర్చువల్‌గా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా 45 కేంద్రాల నుంచి నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. మొత్తం నియామకాల్లో 49,200.. హోంమంత్రిత్వ శాఖ, పారామిలిటరీ దళాలకు సంబంధించినవని తెలిపారు. మహిళా కానిస్టేబుల్స్ భారీగా నియమితులవు తున్నారని, గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం అనేక సౌలభ్య చర్యలు తీసుకున్నందు వల్ల ఇది సాధ్యమైందని వివరించారు. బీఎస్ఎఫ్ మహిళా దళాలు సరిహద్దుల్లో జీరో లైన్ వద్ద ఉద్యోగాలు చేస్తున్నాయని, రిపబ్లిక్ డే పరేడ్‌లో సీఆర్‌పీఎఫ్ పురుష దళానికి మహిళా అసిస్టెంట్ కమాండెంట్ నాయకత్వం వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళా కార్యక్రమం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ నిబద్ధతను చాటి చెబుతోందని మోదీ పేర్కొన్నారు. ఈ మేళాల ద్వారా ఇప్పటివరకూ 11 లక్షలకు పైగా నియామక పత్రాలు విడుదల చేశారు. వివిధ మంత్రిత్వ శాఖలు.. హోం వ్యవహారాలు, ఆరోగ్యం, ఆర్థిక సేవలు, ఉన్నత విద్య విభాగాలతోపాటు ఇతర శాఖల్లో ఈ నియామకాలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగ నియామక పత్రాలు స్వీకరించారు.

# ఎంపీ ఇంజినీర్ రషీద్‌కు కస్టడీ పెరోల్




**న్యూఢిల్లీ:** బారాముల్లా ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజినీర్ రషీద్ కు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కస్టడీ పెరోల్ మంజూరైంది. ఉగ్రనిధుల కేసులో నిందితుడైన రషీద్ ప్రస్తుతం ఢిల్లీలోని తిహాడ్ జైలులో ఉన్నారు. జనవరి 28 నుంచి ప్రారంభమవుతున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యేందుకు ఆయనకు అనుమతిస్తూ ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు కస్టడీ పెరోల్ మంజూరు చేసింది. పార్లమెంటు సమావేశాల్లో హాజరయ్యేందుకు తాత్కాలిక బెయిల్ కానీ, కస్టడీ పెరోల్ కానీ ఇవ్వాలని రషీద్ ఇటీవల కోర్టును కోరారు. దీనిపై సమాధానం ఇవ్వాలని ఎన్ఐఏకు గతవారం ప్రత్యేక ఎన్ఐఏ జడ్జి ప్రశాంత్ శర్మ నోటీసులు జారీచేశారు. కోర్టు తాజా ఆదేశాలపై రషీద్ తరపు న్యాయవాది నిషిత గుప్తా మాట్లాడుతూ, బడ్జెట్ సమావేశాలు జరిగే జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకూ అన్ని రోజులూ హాజరయ్యేందుకు కోర్టు అనుమతించిందని చెప్పారు. పార్లమెంటు సెక్యూరిటీతో పాటు పోలీసు సెక్యూరిటీతో ఈ సమావేశాలకు రషీద్ హాజరవుతారని తెలిపారు.

# ఆపరేషన్ సిందూర్‌పై రాజీ లేదు

**ఈ విషయంలో నా అభిప్రాయాలు నాకున్నాయి**

**కాంగ్రెస్‌తో విభేదాలపై ఎంపి శశిథరూర్**



**న్యూఢిల్లీ, జనవరి 24:** పార్లమెంటులో పార్టీ నియమావళిని తాను ఎప్పుడూ ఉల్లంఘించలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ అన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విషయంలోనే తనకు పార్టీతో అభిప్రాయభేదాలున్నట్టు చెప్పారు. అయితే ఈ విషయంలో తాను క్షమాపణ కోరనని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్‌ను భారత్ చేపట్టింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఎండగట్టేందుకు విదేశాలకు వెళ్లిన కేంద్ర ప్రతినిధి బృందంలో శశిథరూర్ ఉండటం సొంత పార్టీ నుంచి విమర్శలకు దారితీసింది. కేరళ లిటరేచర్ ఫెస్టివల్ సందర్భంగా మీడియా అడిగిన ఒక ప్రశ్నకు శశిథరూర్ స్పందిస్తూ, ఆపరేషన్ సిందూర్ అంశలో తాను ఒక బలమైన నిర్ణయం తీసుకున్నానని, దానికి కట్టుబడి ఉన్నానని, దానిపై తాను క్షమాపణ కోరనని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు తాను రాసిన ఆర్టికల్‌ను థరూర్‌ను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఒక రచయితగా పహల్గాం గురించి తాను ఆర్టికల్ రాశానని, ఉగ్రదాడులకు తగిన సైనిక స్పందన ఉండాలని అందులో చెప్పానని, అభివృద్ధిపై దృష్టిసారించిన భారత్ దీర్ఘకాల ఘర్షణలకు వెళ్లకుండా ఉగ్రవాద శిబిరాలను టా÷-గ్గ్÷ట్ చేయాలని అందులో పేర్కొన్నానని చెప్పారు. తాను ఏదైతే అభిప్రాయపడ్డానో అదేవిధంగా పాక్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేయడం తనకు ఆశ్చర్యం కలిగించిందని అన్నారు. పార్టీ అధినాయకత్వంతో థరూర్‌కు విభేదాలున్నాయని, రాహుల్ గాంధీ ఇటీవల కొచ్చి వెళ్లినప్పుడు ఆయనకు ప్రాధాన్యత ఇవ్వలేదని, రాష్ట్ర నాయకులు సైతం థరూర్‌ను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఇటీవల ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలపై థరూర్ సైతం అసంతృప్తితో ఉన్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికలపై ఆ రాష్ట్ర నాయకులతో ఏఐసీసీ అధిష్ఠానం శుక్రవారంనాడు సమావేశమైంది. దీనికి కూడా శశిథరూర్ గైర్హాజరయ్యారు. పార్టీకి థరూర్ అవసరం ఇంకెంతమాత్రం లేదంటూ సందీప్ దీక్షిత్ సహా పలువురు పార్టీ నేతలు దీనిపై వ్యాఖ్యానించారు. శశిథరూర్ గైర్హాజరు వెనుక పార్టీతో విభేదాలే కారణమని ఊహాగానాలు సైతం వెలువడ్డాయి. దీనిపై తాజాగా శశిథరూర్ స్పందించారు. పార్టీ అంతర్గతం వ్యవహారాలపై బహిరంగంగా మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయ డిక్లరేషన్ చేసేందుకు తాను ఇక్కడికి రాలేదని, ఇది లిటరరీ ఫెస్టివల్ అని అన్నారు. పార్టీ నాయకత్వంతోనే ఈ విషయం ప్రస్తావించగలనని, బహిరంగ వేదికలమీద కాదని చెప్పారు. సమవేశంలో పాల్గొనే విషయంలో తన అసక్తతను తెలియజేస్తూ పార్టీకి ముందస్తు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు.

# యూపీలో బాలికపై మతమార్పిడికి ఒత్తిడి

**ఐదుగురు ముస్లిం బాలికలపై కేసు నమోదు**



**లక్నో, జనవరి 24:** ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ జిల్లా బిలారి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదుగురు మైనర్ ముస్లిం బాలికలపై కేసు నమోదు అయింది. హిందూ బాలికను బురఖా ధరించమని బలవంతం చేసినట్లు, అలాగే ఆమెను మతం మారాలని ఒత్తిడి చేసినట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు. కాగా, ఈ ఘటన గత డిసెంబర్ 12వ తేదీన చోటు చేసుకున్నప్పటికీ, ఇటీవలే వెలుగులోకి వచ్చింది. బాధితురాలి అన్న దక్ష్ చౌదరి (16) బిలారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు వచ్చింది. ఐదుగురు బాలికలు చదువుతున్న పాఠశాలతో పాటు ఒకే ట్యూషన్ క్లాస్‌లో హాజరయ్యేవారు.. దీంతో వారు ఆమెను బురఖా ధరించమని, ఇతర మతం స్వీకరించమని ఒత్తిడి చేసినట్లు ఆరోపించారు. ఈ కేసు ఉత్తరప్రదేశ్ మతమార్పిడి నిరోధక చట్టంలోని సెక్షన్ 3, సెక్షన్ 5(1) కింద నమోదు అయింది. ఈ చట్టం ప్రకారం మోసం, బలవంతం, బెదిరింపు, అనుచిత ప్రభావం లేదా ఆకర్షణ ద్వారా జరిగే మతమార్పిడిని నేరంగా పరిగణిస్తుంది. ఇక, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ మత మార్పిడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది. వీడియోలో ఇరుకైన వీధిలో హిందూ బాలిక బురఖా ధరించగా, మిగతా బాలికలు ఆమె దుస్తులపై బురఖాను సరిచేస్తూ కనిపిస్తున్నారు. వారు రెస్టారెంట్ వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. తన అన్న చూసేస్తాడేమో అన్న భయంతో బాధితురాలు బురఖా ధరించిందని పోలీసులు తెలిపారు. గ్రామీణ ఎస్పీ కున్వర్ ఆకాశ్ సింగ్ మాట్లాడుతూ.. ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. నిందితుల ఉద్దేశం, ఘటన వెనుక ఉన్న కారణాలను లోతుగా పరిశీలిస్తున్నామని చెప్పారు. అయితే, ఈ చట్టం ప్రకారం మైనర్లకు సంబంధించిన మతమార్పిడి కేసుల్లో దోషులుగా తేలితే కనీసం ఐదేళ్ల నుంచి 14 ఏళ్ల వరకు కఠిన శిక్ష విధించవచ్చని హెచ్చరించారు. నిందితులందరూ మైనర్లు కావడంతో వారిని వెంటనే అదుపులోకి తీసుకోలేదని.. ఈ ఘటనపై బలవంతంగా చేశారా అనే అంశంపై విచారణ కొనసాగుతోందని తెలిపారు.

# టీ20 వరల్డ్ కప్ నుంచి బంగ్లా బహిష్కరణ

భర్తీ చేసిన స్కాట్లాండ్!

వేదిక మార్పు పట్టుదలే బంగ్లాదేశ్ క్రికెట్ కొంపముంచిందా?

బంగ్లా క్రికెట్‌కు భారీ నష్టం

## ఐసీసీ సంచలన నిర్ణయం.. ఫిబ్రవరి టోర్నీలో అనూహ్య మార్పులు

**క్రికెట్ ప్రపంచంలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. మరో కొద్ది రోజుల్లో భారత్ వేదికగా ప్రారంభం కానున్న టీ20 వరల్డ్ కప్ నుంచి బంగ్లాదేశ్ జట్టు నిష్క్రమించింది. భద్రతా కారణాల పేరుతో వేదిక మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) చేసిన డిమాండ్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తోసిపుచ్చడమే కాకుండా, టోర్నమెంట్ నుంచే ఆ జట్టును తప్పించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.**




**స్పోర్ట్స్ డెస్క్, జనవరి 25:**

వివాదం ఎక్కడ మొదలైంది? రాబోయే టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లు ఇండియాలో జరగాల్సి ఉంది. అయితే, తమ దేశంలోని రాజకీయ పరిస్థితులు, ఇండియాలో తమ ఆటగాళ్లకు భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. తమ మ్యాచ్‌లను తటస్థ వేదికకు (న్యూట్రల్ వెన్యూ) మార్చాలని బీసీబీ పట్టుబట్టింది. చివరి నిమిషం వరకు చర్చలు జరిగినప్పటికీ, షెడ్యూల్‌లో మార్పులు చేయడం సాధ్యం కాదని ఐసీసీ స్పష్టం చేసింది. "షెడ్యూల్ ప్రకారమే ఇండియాలో ఆడాలి, లేదంటే తప్పుకోవాలి" అని ఐసీసీ అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం.

### ఐసీసీ కఠిన నిర్ణయం

నిబంధనల విషయంలో ఐసీసీ ఎప్పుడూ కఠినంగానే వ్యవహరిస్తుంది. ప్రపంచ కప్ వంటి మెగా టోర్నీ షెడ్యూల్‌ను ఒక జట్టు కోసం మార్చడం అనేది మిగతా జట్ల సన్నాహకాలను, లాజిస్టిక్స్‌ను దెబ్బతీస్తుంది. బంగ్లాదేశ్ తన నిర్ణయానికే కట్టుబడి ఉండటంతో, జనవరి 24న ఐసీసీ తుది నిర్ణయం తీసుకుంది. బంగ్లా స్థానంలో అర్హత పొందేందుకు తర్వాతి స్థానంలో ఉన్న స్కాట్లాండ్ జట్టుకు అవకాశం కల్పించింది.

### బంగ్లా క్రికెట్‌కు భారీ నష్టం

ఈ నిర్ణయం బంగ్లాదేశ్ క్రికెట్ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపనుంది. ప్రపంచ కప్ వంటి టోర్నీల్లో పాల్గొనడం ద్వారా బోర్డుకు వచ్చే ఆదాయం, స్పాన్సర్ల మద్దతు కోల్పోవాల్సి వస్తుంది. ఎంతో కష్టపడి అర్హత సాధించిన ఆటగాళ్లకు ఇది తీరని నిరాశ. రాజకీయ కారణాల వల్ల క్రీడాకారులు నష్టపోవడం విచారకరం. క్రికెట్‌ను అమితంగా ప్రేమించే బంగ్లా అభిమానులకు ఇది మింగుడుపడని విషయం.

### స్కాట్లాండ్‌కు సువర్ణావకాశం

మరోవైపు, స్కాట్లాండ్‌కు ఇది అదృష్టమనే చెప్పాలి. క్వాలిఫయర్స్ లో పోరాడినా, త్రుటిలో అవకాశం కోల్పోయిన ఆ జట్టుకు, ఇప్పుడు ప్రధాన రౌండ్‌లో తలపడే ఛాన్స్ దక్కింది. వారు ఈ అవకాశాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటారో చూడాలి. క్రీడలను, రాజకీయాలను వేరుగా చూడాలనే వాదన ఎప్పటి నుంచో ఉంది. అయితే, తాజా పరిణామాలు రెండు దేశాల సంబంధాలు క్రికెట్ మైదానంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో మరోసారి రుజువు చేశాయి. బంగ్లా బోర్డు అతిజాగ్రత్త, లేదా మొండి వైఖరి.. చివరకు ఆ దేశాన్ని ప్రపంచ కప్‌కు దూరం చేసింది.

PCB
Pakistan Cricket Board

### పాకిస్తాన్ కూడా తప్పుకుంటుందా?

*బంగ్లాదేశ్‌ను టీ20 ప్రపంచ కప్ నుంచి తొలగించడంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఐసీసీ నిర్ణయం పక్షపాతంతో కూడుకున్నదని పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ విమర్శించారు. బంగ్లాకు జరిగిన అన్యాయానికి నిరసనగా టోర్నీని బహిష్కరించే ఆలోచనలో ఉన్నామని, దీనిపై తమ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తుది నిర్ణయం తీసుకుంటారని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం ఆదేశిస్తే టోర్నీ నుంచి తప్పుకుంటామని, ఐసీసీ మరో జట్టును చూసుకోవచ్చని స్పష్టం చేశారు.*

# ఆర్సీబీ జైత్రయాత్రకు బ్రేక్

ఢిల్లీ క్యాపిటల్స్ పంజాతో బెంగళూరు విలవిల!

వడోదర వేదికగా స్మృతి సేనకు **తొలి ఓటమి**




- ఢిల్లీ బౌలర్ల ధాటికి 109 పరుగులకే కుప్పకూలిన ఆర్సీబీ
- వొల్వార్డ్, జెమిమా క్లాస్ ఇన్నింగ్స్‌తో ఢిల్లీ ఘనవిజయం

**స్పోర్ట్స్ డెస్క్ - జనవరి 25:**

మహిళల ప్రీమియర్ లీగ్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అప్రతిహత విజయాలకు ఢిల్లీ క్యాపిటల్స్ అడ్డుకట్ట వేసింది. ఈ సీజన్‌లో వరుసగా ఐదు విజయాలతో దూసుకుపోతున్న స్మృతి మంధాన సేనకు, శనివారం వడోదరలోని బీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఊహించని షాక్ ఇచ్చింది. సమష్టి బౌలింగ్, సమయస్ఫూర్తితో కూడిన బ్యాటింగ్‌తో ఢిల్లీ 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ జెమిమా రోడ్రిగ్స్ మరో ఆలోచన లేకుండా బౌలింగ్ ఎంచుకుంది. ఆరంభంలో ఆర్సీబీ ఇన్నింగ్స్ సాఫీగానే సాగింది. ఓపెనర్‌గా వచ్చిన కెప్టెన్ స్మృతి మంధాన (34 బంతుల్లో 38; 6 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి తన క్లాస్ చూపించింది. ఒక దశలో ఆర్సీబీ 9 ఓవర్లలో 62/1తో పటిష్ట స్థితిలో కనిపించింది.

కానీ, ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. మిన్ను మణి బౌలింగ్‌లో స్మృతి అవుట్ కావడంతో ఆర్సీబీ పతనం మొదలైంది. ఢిల్లీ బౌలర్లు నందని శర్మ (3/26), మారిజాన్ కాప్ (2/17), చినెల్లే హెన్రీ (2/22) కట్టుదిట్టమైన బంతులతో ఆర్సీబీ మిడిలార్డర్‌ను హడలెత్తించారు. రిచా ఘోష్, జార్జియా వోల్ వంటి స్టార్ బ్యాటర్లు విఫలమవడంతో, చివరికి ఆర్సీబీ 20 ఓవర్లలో కేవలం 109 పరుగులకే ఆలౌట్ అయింది.

### ఢిల్లీ బ్యాటింగ్.. తడబడ్డా.. నిలబడ్డారు! 110

పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీకి ఆరంభంలోనే షాక్ తగిలింది. షఫాలీ వర్మ (16), లిజెల్లీ లీ (6) త్వరగానే పెవిలియన్ చేరడంతో 24 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ జెమిమా రోడ్రిగ్స్ (24), లారా వొల్వార్డ్ (38 బంతుల్లో 42 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరూ వికెట్ కాపాడుకుంటూనే స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. చివర్లో మారిజాన్ కాప్ (19 నాటౌట్) మెరుపులు మెరిపించడంతో 15.4 ఓవర్లలోనే ఢిల్లీ లక్ష్యాన్ని ఛేదించింది.

### ఆర్సీబీ ఎక్కడ విఫలమైంది?

స్మృతి మంధాన ఇచ్చిన శుభారంభాన్ని మిగతా బ్యాటర్లు సద్వినియోగం చేసుకోలేకపోయారు. ముఖ్యంగా 62 పరుగుల నుంచి 109 పరుగులకే ఆలౌట్ అవడం ఆ జట్టు బ్యాటింగ్ లోపాలను బయటపెట్టింది. వికెట్లు పడుతున్నప్పుడు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే వారు కరువయ్యారు. స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకోవాలంటే ఆరంభంలోనే వికెట్లు తీయాలి. ఆర్సీబీ బౌలర్లు ప్రయత్నించినప్పటికీ, ఢిల్లీ బ్యాటర్ల సంయమనం ముందు వారి ఎత్తులు పారలేదు. ఈ విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని (రెండో స్థానం) పదిలం చేసుకుంది. మరోవైపు, ఓటమి పాలైనప్పటికీ మెరుగైన రన్‌రేట్, పాయింట్లతో ఆర్సీబీ అగ్రస్థానంలోనే కొనసాగుతోంది. ఈ ఓటమి ఆర్సీబీకి ఒక హెచ్చరిక లాంటిదని, ప్లేఆఫ్స్ ముందు వారి లోపాలను సరిదిద్దుకునే అవకాశం ఇచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు.




# కివీస్ పై భారత కుర్రాళ్ల పంజా

గ్రూప్ టాపర్‌గా సూపర్ సిక్స్‌లోకి!

అండర్-19 ప్రపంచ కప్‌లో అప్రతిహత విజయాలు

### బ్యాటింగ్, బౌలింగ్‌లో సమిష్టి ప్రదర్శనతో న్యూజిలాండ్ పై ఘనవిజయం

## భారత స్పిన్నర్ల ధాటికి కివీస్ విలవిల

**స్పోర్ట్స్ డెస్క్ - జనవరి 25:**

దక్షిణాఫ్రికా గడ్డపై జరుగుతున్న ఐసీసీ అండర్-19 ప్రపంచ కప్‌లో భారత యువజట్టు (టీమ్ ఇండియా) జోరు కొనసాగుతోంది. శనివారం (జనవరి 24) జరిగిన కీలక లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పై భారత్ సాధికారిక విజయం సాధించింది. ఈ విజయంతో గ్రూప్ దశలో అజేయంగా నిలిచిన భారత్, 'గ్రూప్ టాపర్' హోదాతో సూపర్ సిక్స్ దశకు అర్హత సాధించింది. సాంకేతిక లోపాలు లేకుండా సాగిన భారత ఆటతీరు, భవిష్యత్ తారల సత్తాను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది.

టాస్ మొదలుకొని మ్యాచ్ ముగిసే వరకు భారత జట్టు స్పష్టమైన ప్రణాళికతో కనిపించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టుకు ఓపెనర్లు శుభారంభాన్ని అందించారు. క్లిష్టమైన పిచ్‌పై న్యూజిలాండ్ పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును నడిపించారు. మిడిల్ ఓవర్లలో వికెట్లు పడకుండా జాగ్రత్త పడుతూనే, వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలతో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో (చివరి ఓవర్లలో) భారత బ్యాటర్లు సాధించిన పరుగులు మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించడంలో కీలకపాత్ర పోషించాయి. న్యూజిలాండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ, భారత బ్యాటింగ్ లోతు ముందు వారి వ్యూహాలు ఫలించలేదు. ఛేజింగ్‌లో న్యూజిలాండ్ జట్టు ఏ దశలోనూ భారత బౌలర్ల ఆధిపత్యాన్ని తట్టుకోలేకపోయింది. భారత పేసర్లు ఆరంభంలోనే వికెట్లు తీసి ఒత్తిడి పెంచగా, ఆ తర్వాత వచ్చిన స్పిన్నర్లు కివీస్ బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశారు. బంతిని రెండు వైపులా టర్న్ చేస్తూ, వేగంలో వైవిధ్యం చూపిస్తూ భారత స్పిన్నర్లు వికెట్ల పండగ చేసుకున్నారు. క్రీజులో పాతుకుపోయేందుకు ప్రయత్నించిన కివీస్ బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వెంటవెంటనే వికెట్లు తీసి, వారిని తక్కువ స్కోరుకే పరిమితం చేశారు.

**ఈ విజయంతో భారత అండర్-19 జట్టు టైటిల్ ఫేవరెట్‌గా తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. లీగ్ దశలో చూపించిన ఈ దూకుడును సూపర్ సిక్స్, నాకౌట్ దశల్లోనూ కొనసాగిస్తే.. మరోసారి అండర్-19 ప్రపంచ కప్ భారత్ వశం కావడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు, ఈ ఓటమితో న్యూజిలాండ్ తన లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఏర్పడింది.**




నేటి సాక్షి
TGTEL/25/A1737

కరీంనగర్ | ఆదివారం 25 జనవరి 2026



# ఏప్రిల్ 10న స్వయంభు విడుదల

యంగ్ అండ్ డైనమిక్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిపోయే అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'స్వయంభూ' విడుదల తేదీని చింత్రబృందం ప్రకటించింది. ఈ సినిమా విడుదలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ ఏడాది వేసవి కానుకగా, ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ పాన్-ఇండియా చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా కోసం నిఖిల్ పడుతున్న శ్రమ అంతా ఇంతా కాదు. ఒక యోధుడి పాత్రలో పరకాయ ప్రవేశం చేయడానికి ఆయన తన శరీరాకృతిని పూర్తిగా మార్చుకున్నారు. కేవలం ఫిజిక్ మాత్రమే కాకుండా, యుద్ధ సన్నివేశాల్లో సహజత్వం కోసం విదేశాల్లో కత్తిసాము, గుర్రపు స్వారీ ,విలువిద్యలో ప్రత్యేక శిక్షణ పొందారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో విజువల్స్ హాలీవుడ్ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటాయని సమాచారం. అయితే తాజాగా నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన గ్లింప్స్ ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేయగా, ఇప్పుడు రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సినిమాపై అంచనాలను మరో మెట్టు ఎక్కించింది. ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతున్న ఈ చారిత్రక గాథ తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.



# నెట్‌ఫ్లిక్స్‌లో 29న ఛాంపియన్ విడుదల

తెలంగాణ రాజకార్లను ఎదురొడ్డిన బైరాన్‌పల్లి గ్రామ కథ ఆధారంగా రోషన్ హీరోగా తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'ఛాంపియన్' గత డిసెంబరులో బాక్సాఫీసు ముందుకొచ్చి మంచి టాక్ తెచ్చుకుంది. ఇందులోని గిరగిరతో పాటు పాటలు హిట్ అయ్యాయి. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. 'నెట్‌ఫ్లిక్స్' లో ఈనెల 29 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనస్వర రాజన్, అవంతిక, రచ్చరవి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులోని 'గిర గిర గింగిరాగిరే' పాట విశేషంగా అలరించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న రోజులవి. రజాకార్ల దౌర్జన్యాలకు తెలంగాణ పల్లెలన్నీ చిగురుటాకులా వణికిపోతుండగా.. బైరాన్‌పల్లి లాంటి కొన్ని ఊళ్లు మాత్రం వీరోచితంగా పోరాడుతూ అందరిలో స్వాతంత్ర్య కాంక్ష రగిలించే ప్రయత్నం చేస్తుంటాయి. అదే సమయంలో సికింద్రాబాద్‌కు చెందిన ఆంగ్లో ఇండియన్ కుర్రాడు మైఖేల్ సి.విలియమ్స్ (రోషన్) ఫుట్‌బాల్ ఆటగాడిగా ఎంతో పేరు తెచ్చుకుంటాడు. తన ప్రతిభతో ఇంగ్లాండ్ మాంచెస్టర్ ఫుట్‌బాల్ క్లబ్‌లో ఆడే అవకాశాన్ని అందుకుంటాడు. కానీ, మైఖేల్ తండ్రి నేపథ్యం కారణంగా తను లీగల్‌గా ఆ దేశానికి వెళ్లే దారులు మూసుకుపోతాయి. దీంతో ఎలాగైనా 20 రోజుల్లో ఇంగ్లాండ్‌కు వెళ్లేందుకు అక్రమ మార్గం ఎంచుకుంటాడు. కానీ, దారితప్పి బైరాన్‌పల్లికి వెళతాడు? దానికి కారణమేంటి? ఆ ఊరి వాళ్లతో కలిసి రజాకార్లపై పోరుకు ఎందుకు సిద్ధమయ్యాడు? బైరాన్‌పల్లి గ్రామస్థుల పోరాటాన్ని అణగదొక్కి.. వాళ్లను అంతం చేసేందుకు ఖాసిం రజ్వీ రంగంలోకి దింపిన బాబు దేశ్‌ముఖ్ (సంతోష్ ప్రతాప్)తో మైఖేల్‌కు ఉన్న విరోధం ఏంటి? అన్నది మిగతా కథ.

# రాజాసాబ్ నుంచి సహనా సహనా వీడియో సాంగ్ విడుదల

సంక్రాంతి కానుకగా బాక్సాఫీసు ముందుకొచ్చిన చిత్రాల్లో 'ది రాజాసాబ్' ఒకటి. ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కించిన చిత్రమిది. ఇందులోని మెలొడీ 'సహనా సహనా' ఫుల్ వీడియో విడుదలైంది. ప్రభాస్-నిధి అగర్వాల్‌పై రూపొందించిన సాంగ్ ఇది. ఈ చిత్రం మంచి టాక్‌తో ప్రభాస్ మేనరిజాన్ని బాగా ఎలివేట్ చేసింది. మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినమా థియేటర్లలో ఆడుతోంది.



# దురంధర్‌ను మించిన బోర్డర్-2




దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కిన 'బోర్డర్ 2' తొలిరోజు కలెక్షన్ల విషయంలో 'ధురంధర్'ను బీట్ చేసింది. శుక్రవారం విడుదలైన 'బోర్డర్ 2' అదే రోజు.. భారతీయ బాక్సాఫీసు వద్ద రూ.32 కోట్లు (నెట్) కలెక్షన్లు రాబట్టింది. 'ధురంధర్' తొలిరోజు కలెక్షన్లు రూ.28.60 కోట్లు మాత్రమే. సన్నీ దేవోల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి ప్రధాన పాత్రల్లో అనురాగ్ సింగ్ 'బోర్డర్ 2'ను తెరకెక్కించారు. 1971 ఇండో – పాక్ యుద్ధం నేపథ్యంలో జేపీ దత్తా తెరకెక్కించిన 'బోర్డర్'కు కొనసాగింపుగా వచ్చింది. ఈ సీక్వెల్ 28 ఏళ్ల తర్వాత వచ్చినా ప్రేక్షకాదరణ పొందడం విశేషం. ఈ సినిమా 1971 యుద్ధం తర్వాత జరిగిన మరో కీలకమైన సరిహద్దు పోరాటం చుట్టూ తిరుగుతుంది. మొదటి భాగంలో కేవలం ఆర్మీ పోరాటాన్ని మాత్రమే చూపిస్తే.. ఈసారి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సంయుక్తంగా చేసిన త్రిముఖ పోరును కళ్లకు కట్టినట్లు ఉద్వేగభరితంగా చూపించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబరు 5న విడుదలైన ఈ సినిమా రూ.1300? కోట్లు రాబట్టింది. అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ చిత్రాల జాబితాలో రెండో స్థానం, అత్యధిక కలెక్షన్లు రాబట్టిన భారతీయ సినిమా లిస్ట్‌లో నాలుగులో స్థానంలో నిలిచింది. తొలిరోజు కలెక్షన్ల హవాని బట్టి ఈ 'ధురంధర్' రికార్డును 'బోర్డర్ 2' అధిగమించే అవకాశాలున్నాయని సినీ వర్గాల టాక్.

# హీరోలుగా ఎంట్రీ ఇస్తున్న డీఎస్పీ, లోకేశ్ కనగరాజ్

తెర వెనక సత్తా చాటిన ఎందరో సాంకేతిక నిపుణులు, డైరెక్టర్లు తెర పైనా సందడి చేశారు. నటులుగానూ తమదైన ముద్ర వేశారు. ఇదే దారిలో ఇప్పుడు మరికొందరు హీరోలుగా పరిచయం కానున్నారు. రెండు దశాబ్దాలకు పైగా తన సంగీతంతో శ్రోతలను ఉర్రూతలూగిస్తున్న దేవిశ్రీ ప్రసాద్ ఎల్లమ్మ' మూవీతో హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. డప్పు కళాకారుడిగా ఆయన నటిస్తున్నారు. 'బలగం' తర్వాత వేణు యెల్దండి తెరకెక్కిస్తున్న చిత్రమిది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రానికి సంగీతం కూడా డీఎస్పీనే అందిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో ప్రకటించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ



దశలో ఉంది. 'ఖైదీ', 'విక్రమ్' తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులనూ థ్రిల్ చేసిన కోలీవుడ్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డీసీ'. వామికా గబ్బీ హీరోయిన్. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్- యాక్షన్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. 'టూరిస్ట్ ఫ్యామిలీ'తో ప్రేక్షకులతోపాటు సినీ ప్రముఖుల దృష్టిని ఆకర్షించిన మలయాళ దర్శకుడు అభిషన్ జీవింత్ ఈ మూవీలో ఓ పాత్ర పోషించిన



ఆయన.. 'విత్ లవ్' తో హీరోగా మారారు. ఈ రొమాంటిక్ డ్రామాలో అనస్వర రాజన్ హీరోయిన్. మదన్ దర్శకుడు. ఈ సినిమా ఫిబ్రవరి 6న తెలుగులోనూ విడుదల కానుంది. కొరియోగ్రాఫర్ యశ్ హీరోగా 'ఆకాశం దాటి వస్తావా' సినిమాని 'దిల్ రాజు ప్రొడక్షన్స్' సంస్థ గతంలో ప్రకటించింది. ఈ మేరకు ఓ వీడియోనూ విడుదల చేసింది. కానీ, తర్వాత ఎలాంటి అప్‌డేట్ లేదు. ఈ విభిన్న ప్రేమకథా చిత్రానికి శశికుమార్ దర్శకుడు. ÷ట్ మాస్టర్ పీటర్ హెయిన్ మూవీ కూడా అంతే. అనౌన్స్ చేసి చాలాకాలమైనా మరో అప్‌డేట్ లేదు. ఈ చిత్రానికి మా వెట్రి దర్శకుడు. టైటిల్ ఇంకా ఖరారు కాలేదు.

# బాలకృష్ణ, గోపీచంద్ కాంబినేషన్‌లో 111వ సినిమా

## మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు ప్లాన్

నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్ అంటేనే బాక్సాఫీస్ వద్ద మాస్ జాతర మొదలైనట్లే. 'వీరసింహా రెడ్డి' వంటి భారీ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న 111వ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. అయితే, ఈ సినిమా షూటింగ్ విషయంలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న సస్పెన్స్‌కు ఇప్పుడు తెరపడింది. మొదట ఈ ప్రాజెక్ట్‌ను సుమారు రూ.170 కోట్ల భారీ బ్జడెట్‌తో ఒక చారిత్రక నేపథ్యం ఉన్న కథతో చేయాలనుకున్నారు. కానీ, ప్రస్తుతం మారిన మార్కెట్ పరిస్థితులు, బ్జడెట్ లెక్కల దృష్ట్యా ఆ కథను పక్కన పెట్టి, బాలయ్య ఇమేజ్‌కు సరిపోయే పక్కా మాస్ యాక్షన్ కథను గోపీచంద్ సిద్ధం చేశారు. ఇటీవలే దర్శకుడు వినిపించిన ఈ కొత్త కథకు బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, వచ్చే మార్చి నెల నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ 'వృద్ధి సినిమాస్' ధృవీకరించింది. తొలి షెడ్యూల్‌లోనే బాలయ్య మార్క్ అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. ఇక హీరోయిన్ విషయానికి వస్తే, పాత కథ ప్రకారం నయనతారను ఎంపిక చేసినప్పటికీ, ఇప్పుడు కథ మారడంతో ఆమెనే కొనసాగిస్తారా లేక కొత్త హీరోయిన్‌ను తీసుకుంటారా అనే దానిపై సస్పెన్స్ నెలకొంది. ఏదేమైనా, బాలయ్య మార్క్ పవర్‌ఫుల్ డైలాగులు, గోపీచంద్ టేకింగ్ కలిసి మరోసారి బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాయడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# వెంకటేశ్వరునికి 'పుట్ట బంగారం'



**నేటిసాక్షి, కరీంనగర్:** కరీంనగర్ మార్కెట్‌రోడ్డు శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి పుట్ట బంగారం సమర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నేతలు, ఆలయ ధర్మకర్తలు, అధికారులు, భక్తులు ఊరేగింపుగా వెళ్లి పాత బజార్ లోని శివాలయం నుంచి వెంకటేశ్వర స్వామి ఆలయానికి పుట్ట బంగారం తీసుకొచ్చారు. శివాలయంలో రాజేందర్రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుట్ట బంగారం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు రాజేంద్రరావుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు. సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దొంగ సంతకాలతో కాంట్రాక్టులు

**కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ ఆరోపణలు**




**నేటి సాక్షి, కరీంనగర్:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దొంగ సంతకాలు చేసి కాంట్రాక్టులు పొందినట్లు కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ తీవ్ర ఆరోపణలు చేశారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత పదేళ్ల కాలంలో మున్సిపల్ పరిధిలోని అనేక డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భారీ అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. అభివృద్ధి నిధులను పక్కదారి పట్టించిన సునీల్‌రావుకు కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. మజ్లిస్ నాయకుడు అబ్బాస్ షమీ పెద్ద కుమారుడు ఇబ్రహీం అబ్బాస్ 2016 నుంచి అరేబియాలో ఉద్యోగం చేస్తున్నప్పటికీ, ఆయన పేరుపై దొంగ సంతకాలు చేసి కాంట్రాక్టులు తీసుకున్నారని పేర్కొన్నారు. హుస్సేనిపురకు కేటాయించిన అభివృద్ధి నిధులను స్వలాభానికి వినియోగించుకున్నారని, ఈ వ్యవహారాలపై కలెక్టర్‌కు, ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ సమావేశంలో అబ్దుల్ రెహమాన్, మొహమ్మద్ ఖలీముద్దీన్, లయీక్ ఖాద్రి, నిహాల్ అహ్మద్, మొహమ్మద్ అమీర్, షేక్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి



**నేటి సాక్షి, రాయికల్ ( ఇమ్మడి విజయ్ కుమార్ ):** రాయికల్ పట్టణంలో విలేఖరులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని మరియు అట్టి స్థలంలో ఇండ్లు మంజూరు చేయాలని, ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కు స్థలం కేటాయించాలని కోరుతూ శనివారం రాయికల్ ప్రెస్ క్లబ్ (జెఎసి)సభ్యులు కార్యవర్గం సాంఘిక సంక్షేమశాఖ మంత్రి వడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. రాయికల్ పట్టణం లోని డబుల్ బెడ్ రూమ్ దగ్గర రెండు ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఖాళీగా ఉంది. అట్టి భూమిలో అనేక సంవత్సరాల నుండి జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం కోరుతున్నప్పటికీ ఎవరు స్పందించలేదని. అనేక మంది జర్నలిస్టులు స్వంత ఇల్లు లేక అద్దె ఇండ్ల లో కాలం వెల్లదీస్తున్నారని తమరు స్పందించి ఖాళీగా ఉన్న అట్టి స్థలాన్ని కేటాయించ గలరని మరియు ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కొరకు తహసిల్దార్ కార్యాలయం రోడ్‌లో ఉన్న బస్టాండ్‌వద్ద ఖాళీగాఉన్న స్థలాన్ని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చింతకుంట సాయికుమార్,ప్రధాన కార్యదర్శి సింగిడి శంకరయ్య,కోశాధికారి కడకుంట్లజగదీశ్వర్ ,ఉపాధ్యక్షులు సింగని శ్యామ్ సుందర్ యాచమనేని కిరణ్ బాబు సహ కార్యదర్శి తిరుమల శంకర్ గౌరవ అధ్యక్షులు సయ్యద్ రసూల్ మాజీ అధ్యక్షులు వాసరి రవి,మాజీ కోశాధికారి మచ్చ శేఖర్ సభ్యులు అందె రంజిత్ తీగుల్ల గోపి ,గన్నవరం గంగాధర్ ఓరగంటి భీమ్ రాజ్ అనుపురంలింబద్రి ఎండి ఇర్ఫాన్ గట్టుపల్లి నరేష్ ,గంట్యాల ప్రవీణ్ ,తదితరులు పాల్గొన్నారు.

# కౌన్ బనేగా 'కోరుట్ల బల్దియాకా మహారాణీ జీ.!'







- **మున్సిపల్ చైర్మన్ స్థానం 'జనరల్ మహిళ'కు - 10 వార్డుల కౌన్సిలర్లు అర్హులు**

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ ఎన్నికల వేడి ఒక్కసారిగా పట్టణ రాజకీయాలను హీటెక్కిస్తోంది. వార్డు రిజర్వేషన్ జాబితా ఖరారుతో రాజకీయ పార్టీల్లో కదలికలు మొదలయ్యాయి. ముఖ్యంగా మున్సిపల్ చైర్మన్ స్థానం 'జనరల్ మహిళ' కేటగిరీకి కేటాయించడంతో, 'బల్దియా కుర్చీ'పై కన్నేసిన ఆశావాహుల మధ్య పోటీ మొదలైంది. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? గెలిచిన పార్టీలో ఎవరు 'ఛైర్‌పర్సన్' అవుతారు? అనే అంశంపై పట్టణంలో విస్తృత చర్చ సాగుతోంది. పార్టీల ఇన్‌చార్జిలు ఇప్పటికే 'గెలుపు గుర్రాల' కోసం కసరత్తు చేస్తున్నట్టు రాజకీయ వర్గాలు చర్చిస్తున్నాయి.

## చైర్మన్ స్థానం 'జనరల్ మహిళ'కు రిజర్వ్

కోరుట్ల మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పదవి 'జనరల్ మహిళ' కేటగిరీకి రిజర్వ్ చేయబడింది. మున్సిపల్ చట్టాల ప్రకారం, ఈ పదవికి కేవలం జనరల్ కేటగిరీకి చెందిన మహిళ కౌన్సిలర్లు మాత్రమే అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు లేదా జనరల్ పురుషులు ఈ రేసులో పాల్గొనలేరు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలులో భాగంగా మొత్తం 33 వార్డుల్లో 17 వార్డులు మహిళలకు కేటాయించబడ్డాయి. దీంతో పట్టణ రాజకీయాల్లో మహిళల పాత్ర మరింత బలపడనుంది.

## చైర్మన్ రేసులో అర్హులైన మహిళ కౌన్సిలర్లు

రిజర్వేషన్ జాబితా ప్రకారం జనరల్ మహిళ కేటగిరీకి చెందిన ప్రధాన వార్డులు 1, 5, 6, 9, 10, 22, 24, 26, 29 ఉన్నాయి. ఈ వార్డుల్లో గెలిచిన మహిళలు చైర్మన్ పదవికి ప్రత్యక్షంగా అర్హులు అవుతారు. ఇతర జనరల్ వార్డులు 8, 11, 18, 19, 20, 23, 30, 32లలో మహిళలు గెలిచినా చైర్మన్ రేసులో అవకాశం ఉంటుంది. అయితే పూర్తిగా మహిళలకు రిజర్వ్ చేసిన వార్డుల విజేతలకు రాజకీయంగా ఆధిక్యం లభించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ముక్కోణపు రాజకీయ పోటీ

కోరుట్ల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య తీవ్ర ముక్కోణపు పోటీ ఉండనుంది. కాంగ్రెస్: రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో మహిళా అభ్యర్థులను బలంగా ప్రోత్సహిస్తోంది. బీజేపీ: జాతీయ స్థాయి ప్రభావంతో అభివృద్ధి, హిందుత్వ అంశాలపై దృష్టి సారిస్తూ వ్యూహాలు రచిస్తోంది. బీఆర్ఎస్: స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాలతో తిరిగి పట్టణ రాజకీయాల్లో ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తోంది. ఈ రిజర్వేషన్లు పార్టీల అంతర్గత రాజకీయాలను కూడా వేడెక్కిస్తున్నాయి. కొత్త ముఖాలు, యువ నాయకురాళ్లు రాజకీయ రంగప్రవేశం చేసే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## అనుభవమా..? ఆర్థిక బలమా..? సామాజిక ఫేస్ వాల్యూనా..?

చైర్మన్ అభ్యర్థి ఎంపికలో పార్టీల ముందు మూడు ప్రధాన ప్రమాణాలు ఉన్నాయి–

**అనుభవం**
**ఆర్థిక బలం**
**సామాజికంగా గుర్తింపు**

ఈ మూడు అంశాల మధ్య సమతుల్యం సాధించే 'ఫేస్ వాల్యూ' గల అభ్యర్థిని ఎంపిక చేయాలని పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

## భవిష్యత్ ప్రభావం

కోరుట్ల మున్సిపల్ ఎన్నికలు పట్టణ రాజకీయాల్లో కీలక మలుపు తిరగనున్నాయి. 'జనరల్ మహిళ' చైర్మన్ రిజర్వేషన్ మహిళల సాధికారతకు బలమైన ఊతమిచ్చిందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ దగ్గరపడుతున్న కొద్దీ 'బల్దియా మహారాణీ' ఎవరు? ఏ పార్టీ నుంచి? అనే ఉత్కంఠ మరింత పెరిగే అవకాశం ఉంది.

# తుర్తి అటవీ అక్రమాలపై అటవీ శాఖ ఉక్కుపాదం

- **అటవీ సంపద సంరక్షణే లక్ష్యంగా కఠిన చర్యలు**

**నేటి సాక్షి - కథలాపూర్( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల జిల్లా కొడిమ్యాల రేంజ్ పరిధిలోని 'తుర్తి–గోవిందారం' అటవీ ప్రాంతంలో అక్రమ చెట్ల నరికివేత, అనుమతి లేని కలప రవాణాపై అటవీ శాఖ కఠిన చర్యలు చేపట్టింది. అటవీ బీట్ అధికారి మొహమ్మద్ ఫెరోజ్ అలీ పర్యవేక్షణలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ కార్యకలాపాలను అడ్డుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

## నిరంతర గస్తీ, ఆకస్మిక తనిఖీలు

అటవీ వనరుల దోపిడీని అరికట్టేందుకు అటవీ సిబ్బంది నిరంతర గస్తీ నిర్వహించడంతో పాటు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. తుర్తి అటవీ ప్రాంతమంతటా ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ అనుమానాస్పద కదలికలపై దృష్టి సారిస్తున్నారు. ఈ చర్యలకు అటవీ వాచర్లు శేఖర్, గంగాధర్‌లు క్రియాశీలకంగా సహకరిస్తూ అటవీ భద్రతను పటిష్ఠం చేస్తున్నారు.

## చట్టవిరుద్ధ కార్యకలాపాలు సహించేది లేదు

తుర్తి అటవీ ప్రాంతంలో ఎలాంటి అక్రమ కార్యకలాపాలను సహించబోమని అటవీ అధికారులు స్పష్టం చేశారు. అక్రమంగా చెట్లు నరికినా, కలపను రవాణా చేసినా అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటవీ సంపద పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని పేర్కొంటూ, అక్రమాలపై సమాచారం అందించాలని కోరారు.



# భక్తుల కొంగు బంగారం 'సమ్మక్క సారలమ్మ'



**నేటిసాక్షి, కరీంనగర్:** కోరిన కోరికలు తీర్చే భక్తుల కొంగు బంగారం 'సమ్మక్క సారలమ్మ' అని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీలోని సమ్మక్క సారలమ్మ జాతర స్థలాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, జాతర విజయవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. మహిమాన్వితమైన ఈ జాతరకు కరీంనగర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటారని తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు హౌసింగ్ బోర్డ్ కాలనీలో జరగనున్న మహా జాతర సందర్భంగా, భక్తులకు తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమ్మక్క సారలమ్మ జాతరలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. జాతర ప్రశాంతంగా విజయవంతంగా పూర్తి అయ్యేలా నిర్వాహకులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుల ఉదయ్, దుగ్గు మహేందర్, గండి శ్యామ్?తో పాటు సమ్మక్క సారలమ్మ సంక్షేమ సంఘం ప్రతినిధులు పలువురు నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కులమతాలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యం

- **22వ వార్డులో ప్రజల పరామర్శ**

**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో శనివారం డాక్టర్ స్వాతి అనూప్ రావు, అల్లడి ప్రవీణ్ కుమార్, మాడవేణి స్వప్న నరేష్‌లు పర్యటించి పలువురు స్థానికులను పరామర్శించారు. వార్డు ప్రజల క్షేమాన్ని అడిగి తెలుసుకుంటూ, ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు బూత్ కార్యకర్తలు, మహిళా మోర్చా మహిళలు, యువకులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని నేతలకు మద్దతుగా నిలిచారు.

## అభివృద్ధిపై స్పష్టమైన దృష్టి

ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి అనూప్ రావు, అల్లడి ప్రవీణ్ కుమార్‌లు మాట్లాడుతూ 22వ వార్డు కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భూతం భీమయ్య, మచ్చ శ్రీధర్, బొమ్మన విజయ్, గోనెల రాజశేఖర్, మాడవేణి సురేష్‌లు పాల్గొన్నారు. మహిళా కార్యకర్తలు గాలి విజయ, గాలి లత, ముత్యాల లత, గడ్డం సంధ్య, బండారి లావణ్యతో పాటు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# దొంగ సంతకాలతో కాంట్రాక్టులు




- కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ ఆరోపణలు

**నేటి సాక్షి, కరీంనగర్:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దొంగ సంతకాలు చేసి కాంట్రాక్టులు పొందినట్లు కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ తీవ్ర ఆరోపణలు చేశారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత పదేళ్ల కాలంలో మున్సిపల్ పరిధిలోని అనేక డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భారీ అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. అభివృద్ధి నిధులను పక్కదారి పట్టించిన సునీల్‌రావుకు కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. మజ్లిస్ నాయకుడు అబ్బాస్ షమీ పెద్ద కుమారుడు ఇబ్రహీం అబ్బాస్ 2016 నుంచి అరేబియాలో ఉద్యోగం చేస్తున్నప్పటికీ, ఆయన పేరుపై దొంగ సంతకాలు చేసి కాంట్రాక్టులు తీసుకున్నారని పేర్కొన్నారు. హుస్సేనిపురకు కేటాయించిన అభివృద్ధి నిధులను స్వలాభానికి వినియోగించుకున్నారని, ఈ వ్యవహారాలపై కలెక్టర్‌కు, ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ సమావేశంలో అబ్దుల్ రెహమాన్, మొహమ్మద్ ఖలీముద్దీన్, లయాక్ ఖాద్రి, నిహాల్ అహ్మద్, మొహమ్మద్ అమీర్, షేక్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత



**నేటి సాక్షి - జగిత్యాల:** జగిత్యాల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జనవరి 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేదిక నిర్మాణం, పతాకావిష్కరణ స్థలం, పరేడ్ నిర్వహణ ప్రాంగణం, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లు, స్టాల్స్, పార్కింగ్ సౌకర్యాలు, భద్రతా చర్యలను ఆమె ప్రత్యక్షంగా సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా జరిగే కార్యక్రమాలకు తగిన విధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

### భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

రెవెన్యూ, పోలీస్, డీఆర్‌డీఓ, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం పెంచుతూ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ సూచించారు. ఆహ్వానితులు, విద్యార్థులు, ప్రజలకు తాగునీరు, వైద్య సిబ్బంది, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పతాకావిష్కరణ అనంతరం జరిగే అట్టహాసపూరిత పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రభుత్వ గౌరవాన్ని నిలబెట్టేలా నాణ్యతతో ఉండాలన్నారు. విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని సూచిస్తూ, జిల్లా ప్రజలంతా గణతంత్ర దినోత్సవాన్ని దేశభక్తి వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఆర్‌డీఏ రఘువరన్, డీపీఆర్వో నరేష్, మున్సిపల్ కమిషనర్ స్పందన, కలెక్టరేట్ ఏఓ హకీం, ఈపీడీవో, ఎమ్మార్వో రామ్మోహన్‌తో పాటు రెవిన్యూ, మున్సిపల్, డీఆర్‌డీఏ, పోలీస్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర నిధులపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం



- ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు పూర్తిగా కేంద్ర ప్రభుత్వవే
- బీజేపీ నేతలు

**నేటి సాక్షి - కథలాపూర్(రాధారపు నర్సయ్య ):** భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ నిధులు (ఎంజిఎన్ఆర్ఈజిఎస్) ద్వారా మహిళా స్వశక్తి భవనాల నిర్మాణానికి ఒక్కో భవనానికి రూ.10 లక్షల చొప్పున 11 సంఘాలకు మొత్తం రూ.1 కోటి 10 లక్షలు మంజూరు చేయించిన కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కి కృతజ్ఞతగా మండల కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, బండి సంజయ్ ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో నేతలు మాట్లాడుతూ, ఇవన్నీ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులేనని, అయినా కాంగ్రెస్ ఎమ్మెల్యే మేమే నిధులు తీసుకొచ్చామని చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు.

### రాష్ట్ర నిధులపై బిజెపి నేతల సూటిప్రశ్న

కేంద్ర నిధులను కాంగ్రెస్ ఖాతాలో వేసుకుంటూ 'సొమ్ము ఒకరిది, సోకు ఇంకొకరిది' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని బీజేపీ నేతలు మండిపడ్డారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు కూడా నిధులు తామే తీసుకొచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. మీరు మండలానికి రాష్ట్ర నిధుల ద్వారా ఏం తీసుకొచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్యాల మారుతి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కొడిపెల్లి గోపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వరావు, నరెడ్ల రవి, ఆరె శివ, సర్పంచ్ చిందం సుధాకర్, సీనియర్ నాయకులు పిడుగు ఆనంద్, దేశవేణి సునీల్ రెడ్డి, దండిక లింగం, కంటె రాజం, కల్లెడ ప్రసాద్, దయ్య లక్ష్మి నర్సయ్య, చీర్ణం రాజారెడ్డి, కాసోజీ ప్రతాప్‌తో పాటు వినోద్, శ్రీకర్, నవీన్, శ్రీను, కిషోర్, రాజేష్, శ్రీకాంత్, మహేందర్, సాయికిరణ్, నర్సయ్య, శేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేస్తావా?

- తడిబట్టలతో రా సునీల్‌రావుకు డాక్టర్ రాజన్న సవాల్




**నేటి సాక్షి, కరీంనగర్:** అవినీతికి పాల్పడలేదని తడిబట్టలతో వచ్చి హనుమాన్ పాదాల వద్ద ప్రమాణం చేయడానికి తాను సిద్ధమని, మాజీ మేయర్ సునీల్‌రావు కూడా సిద్ధమా అంటూ 42వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రాజన్న సవాల్ విసిరారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అవినీతి సొమ్ముతో రాజకీయంగా ఎదిగింది నువ్వయితే, కష్టార్జితంతో ఉద్యోగం చేసి తాను ఎదిగానన్నారు. ప్రజాసేవ లక్ష్యంగా వచ్చిన వెలిచాల రాజేందర్‌రావుపై నిరాధార వ్యాఖ్యలు చేయడం తగదని, తనపై ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. రాజకీయాల్లో విమర్శలకు కూడా ఒక హద్దు ఉంటుందని, మేయర్‌గా పనిచేసిన వ్యక్తి అసభ్య పదజాలం వాడడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. తాను గొర్రెలు అమ్ముకున్నానని మాట్లాడడం హాస్యాస్పదమని, అలా చేస్తే ఎప్పుడో జైలుకు వెళ్లేవాడినని అన్నారు. సరెండర్, సస్పెన్షన్‌కు తేడా తెలియని వ్యక్తి ఐదేళ్లు మేయర్‌గా ఎలా పనిచేశాడో అర్థం కావడం లేదని విమర్శించారు.

### పదవీ వ్యామోహంతో పార్టీలు మారిన రాజకీయాలు

గతంలో కాంగ్రెస్‌లో ఉన్నపుడు జగపతిరావు, ఎమ్మెస్సార్, పొన్నం ప్రభాకర్ సహకారంతో లబ్ధి పొంది, అధికారం కోల్పోగానే పదవీ వ్యామోహంతో బీఆర్ఎస్‌లో చేరిన విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. మేయర్ పదవి ముగిసిన తర్వాత వినోద్‌కుమార్‌ను మోసం చేసి రాజకీయ స్వలాభం కోసం బీజేపీలో చేరారని ఆరోపించారు. పదవీ, అధికార వ్యామోహంతో పూటకో పార్టీ మారుతున్న సునీల్‌రావు, ఇప్పుడు బండి సంజయ్‌ను ఏగతి పాలు చేస్తాడోనని ఆవేదన వ్యక్తం చేశారు.

### తడిబట్టలతో వచ్చి ప్రమాణం చేయడానికి సిద్ధం

తనపై వచ్చిన ఆరోపణలను తిప్పి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నానని, ఎలాంటి అవినీతికి పాల్పడలేదని తెలిపారు. కలెక్టరేట్ హెలిపాడ్ వద్ద ఉన్న హనుమాన్ ఆలయం వద్ద తడిబట్టలతో వచ్చి ప్రమాణం చేస్తానని, మేయర్‌గా ఉన్న సమయంలో అవినీతికి పాల్పడలేదని సునీల్‌రావు కూడా నిరూపించేందుకు రావాలని డిమాండ్ చేశారు. మేయర్‌గా ఉన్నంత కాలం గడీలోకి ఎవరినీ రానివ్వకుండా బెదిరించి, దొరలాగా వ్యవహరించారని విమర్శించారు.

### బుద్ధి మార్చుకోకపోతే బండారం నడిబజార్లో

ఇకనుంచి బుద్ధి మార్చుకోకపోతే తన వద్ద ఉన్న ఆధారాలతో సునీల్‌రావు అవినీతి బండారం నడిబజారులో బయటపెడతానని హెచ్చరించారు. తాను లోక్‌సత్తా ఎం.శ్రీనివాస్ శిష్యుడినని, బెదిరింపులకు భయపడే తత్వం లేదన్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని, అవినీతి చిట్టాను సందర్భానుసారంగా బయట పెడతానన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు లయాక్, మహమ్మద్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల అభివృద్ధికి ప్రత్యేక కృషి...



**నేటిసాక్షి చందుర్తి (సతీష్):** క్రీడల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని చందుర్తి మాజీ జెడ్పిటిసి సభ్యులు నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండలం సనుగుల గ్రామంలో యువతకు టీ షర్టులు, బ్యాట్ బాల్ లను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగం కుమార్ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా చందుర్తి మండల మినీ క్రీడా స్థలం ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. గ్రామానికి చెందిన వేణు క్రీడాకారులకు క్రీడా దుస్తులు, చిరంజీవి బ్యాటు, బళ్ళు, వార్డు సభ్యులు సాయి షిల్డ్ ల ను అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య అనిల్, ఉపసర్పంచ్ స్వామి నాయకులు ఎగోలపు శ్రీనివాస్, నాగరాజు, ఎగోలపు అంజయ్యలు పాల్గొన్నారు.

# నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**నేటి సాక్షి, రాయికల్ (ఇమ్మడి విజయ్ కుమార్):** రాయికల్ పట్టణ పద్మశాలి యువజన సంఘం క్యాలెండర్ ను శనివారం మంత్రి వడ్లూరి లక్ష్మణ్ మరియు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ లుఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమాన్లు మ్యాకల రమేష్, దాసరి గంగాధర్,సేవా సంఘం అధ్యక్షులు భోగ రాజేశం, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేష్, ఉపాధ్యక్షుడు దాసరి గంగాధర్ కోశాధికారి ఆడేపు నర్సయ్య యువజన సంఘం అధ్యక్షులు సామల్ల సతీష్, ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజీవ్, ఉపాధ్యక్షులు ఎలిగేటి సత్యనారాయణ,సింగని సతీష్, కోశాధికారి బొమ్మకంటి నవీన్, సంయుక్త కార్యదర్శి అనుమల్ల చంద్ర తేజ, గంట్యాల ప్రవీణ్,అష్టమవాడ పెద్దలు, కట్టెకోల భాస్కర్ దాసరి శ్రీను, శ్రీరాముల వెంకటస్వామి,మరియు కార్యవర్గ సభ్యులు, పద్మశాలి రాష్ట్ర కార్యదర్శి జక్కుల చంద్ర శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# సురేష్ బదిలీని నిలిపివేయాలి..

### చందుర్తి వీజూకు సర్పంచ్ భూక్యా మోహన్ వినతి..



**నేటిసాక్షిచందుర్తి (సతీష్):** చందుర్తి మండల పరిధిలోని దేవుని తండా ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు సురేష్ ని బదిలీ చేయవద్దని కోరుతూ, తండా సర్పంచ్ భూక్యా మోహన్ మరియు గ్రామ పాలకవర్గ సభ్యులు శనివారం చందుర్తి మండల విద్యాధికారిని (MEO) కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్యా మోహన్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుడు సురేష్ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన బోధనా పద్ధతుల వల్ల విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయని, ఇలాంటి నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుడిని మధ్యలో బదిలీ చేస్తే విద్యార్థుల చదువు కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పాఠశాలకు సురేష్ సేవలు ఇంకా అవసరమని, గ్రామస్థుల మరియు విద్యార్థుల తల్లిదండ్రుల అభీష్టం మేరకు ఆయన బదిలీని వెంటనే రద్దు చేయాలని యం ఈ ఓ ని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన విద్యాధికారి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నునావత్ బిక్య, బి ఆర్ ఎస్ యూత్ అధ్యక్షులు భూక్యా గబ్బర్ సింగ్,అజ్మీరా రాజు, భూక్యా లక్ష్మన్, బానోత్ తేజ,గుగులోత్ రాములు, గుగులోత్ శేఖర్ పాలకవర్గ సిబ్బంది, పాఠశాల కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మరికల్ లో విద్యార్థుల ర్యాలీ....

### ఓటర్ల దినోత్సవ వేడుకలు.....




**నేటిసాక్షి, న్యూస్ (రిపోర్టర్ ఇమామ్ సాబ్ ):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో ఓటరు దినోత్సవం పురస్కరించుకొని శనివారం నాడు మరికల్ పట్టణంలోని వివిధ వార్డులలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివశంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మరికల్ సీఐకి ఘన సన్మానం



**నేటి సాక్షి,నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణ పేట్ జిల్లాలోని మరికల్ మండలం నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా భగవంత రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారికి కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నంగి మహేశ్వర్ రెడ్డి & యువజన కాంగ్రెస్ నాయకుడు కోయిల్ సాగర్ చందు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# భూమి పూజ చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్





**నేటి సాక్షి, రాయికల్ ( ఇమ్మడి విజయ్ కుమార్ ) :** రాయికల్ పట్టణంలో 7 కోట్ల 20 లక్షల నిధుల అభివృద్ధి పనులకు శనివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్, మరియు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ లు భూమి పూజ చేశారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్రాజెక్ట్,బస్సు లు,వ్యాపారాలు,క్యాంటీన్,ప్రభుత్వ ఏక రూప దుస్తులు,ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని.. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా చీరల పంపిణీ చేశామని. నూతన రేషన్ కార్డులు పంపిణీ తో సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఆహార భద్రత లో భాగంగా సన్న బియ్యం అందజేసిన ఘనత 200 యూనిట్ల ఉచిత కరెంట్.. ఉచిత బస్సు సబ్సిడీ సిలిండర్ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా విడత వారిగా లబ్ధిదారుల ఖాతాలో నిధులు జమ దేశంలో ఎక్కడా లేని విధంగా ఇకస కాలంలో రైతు రుణ మాఫీ సన్న వడ్లకి బోనస్ అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు.. ప్రజలకు చెందాల్సిన సంక్షేమ పథకాలు అమలు అయ్యే విధంగా చొరవ తీసుకుంటానని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను కడుపులో పెట్టుకొని చూసుకుంటూ మొదటి తారీకు జీతాలు చెల్లిస్తున్నామని ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలు నూటికి నూరు శాతం అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వ కాళేశ్వరం ప్రాజెక్ట్ నేటి ప్రభుత్వం పై పెద్ద పిడుగులా ప్రతి నెల వందల కోట్ల వడ్డీ చెల్లిస్తూ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వినతి మేరకు రాయికల్ లో అన్ని కుల సంఘాల అభివృద్ధి కి,స్మశాక వాటిక, చర్చి, మజీద్‌ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తా అన్నారు..

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ

రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రాయికల్ పట్టణంలో గతంలో పని చేసిన కాంట్రాక్టర్లకు 3 కోట్ల బిల్లులు కాంట్రాక్టర్ లకు చెల్లింపు చేయడం జరిగిందని,కాంగ్రెస్ ప్రభుత్వం లో 3 కోట్ల90లక్షల పనులు రాయికల్ పట్టణం లో చేయటం జరిగిందని.. 82 లక్షలతో నూతన పనులకు అనుమతులు రావడం జరిగిందని అన్నారు. నగరాభివృద్ధి స్కీమ్ లో 15 కోట్ల తో రాయికల్ పట్టణ అభివృద్ధి కి ముఖ్యమంత్రి నిధులు మంజూరు అయ్యాయి. 7.20 కోట్ల లో 1 కోటితో మున్సిపల్ పార్కు అభివృద్ధి చేస్తున్నామన్నారు. 20 లక్షల తో డివైడర్ పనులు, 3.15 కోట్ల జజ రోడ్లు డ్రైనేజీలు పనులు పట్టణంలో జంక్షన్‌ల అభివృద్ధికి 1 కోటి కేటాయింపు చేయటం జరిగిందని తెలిపారు. 5 కోట్ల నిధులు స్టార్మ్ వాటర్ డ్రైనేజీకి 4 చోట్ల పెద్ద డ్రైనేజీలకి కేటాయింపు చేయటం జరిగిందని . 15 కోట్ల తో రాయికల్ మున్సిపల్ సమగ్ర అభివృద్ధి చేస్తామన్నారు. స్మశాన వాటిక అభి వృద్ధి కోసం 50 లక్షలు , 1 కోటి రూపాయలు రాయికల్ రామాజీ పెట్ వీధి దీపాలు కు కేటాయించడం జరిగింది. 260కోట్లతో జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని 450పడకల ఆసుపత్రి మనకు రానుందని అన్నారు మహిళా సంఘాల కు 11 లక్షల వడ్డీ లేని రుణాలు మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేయటం జరిగింది అని అన్నారు. రాయికల్ పట్టణ అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తా.. రాయికల్ పట్టణంలో ఎటు చూసినా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అని అన్నారు. పెద్ద చెరువులో చేప పిల్లల పంపిణీ కి మంత్రి గారితో మాట్లాడడం జరిగింది రెండు రోజులో చేప పిల్లలు పంపిణీ ఉంటుంది అని అన్నారు. రాయికల్ మున్సిపల్ అభివృద్ధికి ప్రభుత్వ పక్షాన ఉండాలని కోరారు.

### ఈ కార్యక్రమంలో

కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ రాజా గౌడ్, ఆర్డీవో మధుసూదన్, కమిషనర్ నాగరాజు, ఎమ్మార్వో నాగార్జున,ఎంపీడీవో చిరంజీవి,మెప్మ ఏ ఓ శ్రీనివాస్,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు, మాజీ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, అచ్యుత రావు మాజీ పాక్స్ చైర్మన్, ఏనుగు మల్లారెడ్డి, సీనియర్ నాయకులు రవీందర్ రావు, రవీందర్ రెడ్డి, కోల శ్రీనివాస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభినందన సభ పోస్టర్ ఆవిష్కరణ



**నేటి సాక్షి, తిరుపతి :** ఫిబ్రవరి 25న ఆదివారం ఉదయం 10 గంటలకు తిరుపతి రూరల్ చిగురువాడ వద్ద గల ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సంకల్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్తమ విద్యార్థుల అభినందన సభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్థానిక తిరుపతిలోని గీతం స్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో గేట్ విద్యాసంస్థల అధినేత తమ్మినేని వెంకటేశ్వర్లు, సంకల్ప సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది నారపరెడ్డి రాజారెడ్డి, విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి, రవీంద్ర భారతి స్కూల్ కరెస్పాండెంట్ బి. రవీంద్ర రెడ్డి, ఆర్.ఎస్. హైస్కూల్ అధినేత ఆర్. శ్రీధర్ రెడ్డి, ఆధార్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ మహమ్మద్ రఫీ, కే. పెదరాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ్మినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గత 10 సంవత్సరాలుగా సంకల్ప సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ విద్యా సంస్థల మెరిట్ విద్యార్థులకు డా. ఏపీజే అబ్దుల్ కలాం పేరిట అవార్డులు అందించడం అభినందనీయమన్నారు. సంకల్ప సేవా సమితి అధ్యక్షులు నారపరెడ్డి రాజారెడ్డి మాట్లాడుతూ, ఫిబ్రవరి 25న ఆదివారం ఉదయం 10 గంటలకు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉత్తమ విద్యార్థుల అభినందన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లాలో ఇప్పటికే పేర్లు నమోదు చేసిన మెరిట్ విద్యార్థులకు ప్రముఖ అతిథులచే అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 99857 23962 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

# పార్టీ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు



**నేటి సాక్షి, తిరుపతి:** రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శిగా అవకాశం కల్పించినందుకు వల్లేటి భాను కుమార్ రెడ్డి పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భాను కుమార్ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరిలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం తిరుపతి రూరల్ మండలం పార్టీ అధ్యక్షులు మునీశ్వర్ రెడ్డి, రామచంద్రాపురం మండలం పార్టీ అధ్యక్షుడు ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రాపురం ఎస్సీ సెల్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నెల్లేపల్లి వెంకటేష్‌తో పాటు నాయకులు లోకనాథ రెడ్డి, పుష్పకాంత్ రెడ్డి, పూజారి అశోక్ కుమార్, వెంకటరమణ రెడ్డి, బాబు రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, సదాశివ రెడ్డి, సి. మధుశేఖర్ రెడ్డి, కొట్టే శివశంకర్ రెడ్డి, సిద్ధూ, లోకేష్ రెడ్డి, అశోక్ కుమార్, నరేష్, శంకరయ్య, సుధాకర్, చెంగల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర పార్టీ పదవి పొందిన వల్లేటి భాను కుమార్ రెడ్డికి నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ..



**నేటి సాక్షిరుద్రంగి : (కోక్కుల వంశీ):** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలోని నంది బస్టాండ్ లో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన చేసేందుకు శుక్రవారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని హిందూ సంఘాల సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ... చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన వీలైనంత త్వరలోనే పూర్తిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ అర్చకులు పూర్ణ చందర్ శర్మ పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుమ్ గంగాధర్, అల్లూరి గోవర్ధన్, తుమ్ రమేష్, జక్కు జలంధర్, సేదలు నవీన్, దర్శనపు లింగం,పాల గణేష్, తోట మధు, బన్నీ మరియు గ్రామ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# మున్సిపల్ అభ్యర్థిగా సతీష్ రెడ్డి



**నేటి సాక్షి రంగారెడ్డి(సుధాకర్ గౌడ్) శంకర్పల్లి :** శంకర్పల్లి మండలంలో మున్సిప ల్ బీఆర్ఎస్ 14వ వార్డ్ అభ్యర్థిగా సతీష్ రెడ్డి పోటీలో ఉన్నారు పార్టీలో యువతకు మంచి గుర్తింపు ఇచ్చినందుకు పార్టీ పెద్దలకు నాయకులకు సతీష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు 14 వవార్డులో బిఆర్ఎస్ జండా ఎగరవేయడం ఖాయమని వ్యక్తం చేశారు యువతతోనే పార్టీకి మంచి గుర్తింపు వస్తుందని పొలిటి నాయకులు అన్నారు ప్రజలతో ప్రతిరోజు కలిసిమెలిసి గుండె సతీష్ రెడ్డి ప్రజల సమస్యలు తెలుసుకొని తీర్చే వ్యక్తిగా ప్రజల ఆశీస్సులతో ముందుకు సాగుతానని సతీష్ రెడ్డి అన్నారు

# గన్నేరువరం మండలంగా ప్రకటించాలి



**నేటి సాక్షి, గన్నేరువరం,( బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో మానేరు ప్రక్కన యాస్వాడ గ్రామంలో రామాలయం శివాలయం గన్నేరువరం మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం పారువేల్ల గ్రామంలో శ్రీ లక్ష్మీ గణపతి ప్రక్కనే ఖాసీం పేట మానస దేవి ఆలయం మైలారం గ్రామలో శ్రీ మల్లికార్జున స్వామి గిరి ప్రదక్షణ గుండ్లపల్లి గ్రామంలో శ్రీ రంగనాయకుల స్వామి ఆలయం అన్ని గ్రామాలలో దేవాలయాల ఉండటంతో గన్నేరువరం మండలాన్ని ఆధ్యాత్మిక మండలంగా ప్రకటించాలని కాంగ్రెస్ నాయకులు పాకాల పరశురాం కోరారు.

# మేడిపల్లిలో క్యాలెండర్ ఆవిష్కరణ




**నేటి సాక్షి-మేడిపల్లి:** మేడిపల్లి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అంజుమ, ఎంపీఓ పి. నీరజ, కలిసి మేడిపల్లి మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ,ఎంపీఓ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో కార్యదర్శుల కృషిని అభినందించారు.

# బాలికలు చట్టాలపై అవగాహన




**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సిడిపిఓ సుజాత అన్నారు, జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్ల ఉన్నత పాఠశాలలో బాలికలకు చట్టాలు బాల్యవివాహాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా సుజాత ప్రసంగిస్తూ బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయన్నారు, ముఖ్యంగా మహిళలు అన్ని విధాల నష్టపోతారని ఆమె పేర్కొన్నారు ,చట్టాలపై అవగాహన కలిగి ఉండి సమాజంలో ఎలా నేర్చుకోవాలో అన్నా అంశంపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా గురించి వివరించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లీలా మాధవి .ఎంఈఓ కేశవరెడ్డి. సూపర్వైజర్ సులోచన పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కనపడుటలేదు



**నేటి సాక్షి-మేడిపల్లి**

పేరు: పంచాయతీ రాజం
గ్రామం: వెంకట్రావుపేట్
మండలం: భీమారం
గత 3 రోజులనుండి కనిపించడం లేదు ఎవరికైనా కనిపిస్తే ఈ మొబైల్ నం: 6303655274 కి ఫోన్ చేయగలరు.

# నిద్రపోతున్న నిఘా నేత్రాలు.. భద్రత గాలికే వదిలేశారా..

- పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం స్వచ్ఛ ఆంధ్రా
- స్వర్ణాంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళప్రసాదరావు



**నేటి సాక్షి, తిరుపతి నగరి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఉద్ఘాటించారు. స్వర్ణాంధ్రా – స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమానికి ఆజ్యం పోసింది సీఎం చంద్రబాబేనని ఆయన కొనియాడారు. నగరి నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన స్వర్ణాంధ్రా – స్వచ్ఛాంధ్రా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఎం చంద్రబాబుతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రజాసేవనే పరమావధిగా భావించి ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నవ సమాజానికి స్ఫూర్తి అని కొనియాడారు. నవ్యాంధ్ర సాధనే లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పేర్కొన్న ఆయన, స్వర్ణాంధ్రా – స్వచ్ఛాంధ్ర వంటి బృహత్తర కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తున్న నిజమైన ప్రజాసేవకుడు చంద్రబాబు నాయుడేనని ప్రశంసించారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యక్రమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి విజయవంతం చేయాలని, రాష్ట్ర ప్రగతికి బాటలు వేయాలని నగరి నియోజకవర్గ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

# తుమ్మలగుంటలో రథసప్తమి వేడులకు సర్వం సిద్ధం

**నేటి సాక్షి తిరుపతి.తిరుపతి:** తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆదివారం జరిగే రథ సప్తమి వేడుకలకు సర్వం సిద్ధమైంది. రథసప్తమి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్ని రకాల ఏర్పాట్లు చేయించారు. ఒకే రోజు ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు వాహనాలపై విహరించే స్వామి వారి రథసప్తమి వేడుకలను మినీ బ్రహ్మోత్సవంగా భక్తులు పిలుస్తుంటారు. రథసప్తమి వేడుకలకు ఇప్పటికే సప్తవాహనాలు సిద్ధం కాగా ఆలయం వద్ద జరిగే ఏర్పాట్లను చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

### వాహనసేవలు జరిగేది ఇలా

25వతేదీన ఆదివారం ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు (సూర్యోదయం ఉదయం 6.45 గంటలకు) సూర్యప్రభ వాహనం, ఉదయం 9 నుంచి 10 గంటల వరకు చిన్నశేష వాహనం, ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు గరుడ వాహనం, మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు హనుమంత వాహనం, మధ్యాహ్నం 2 గంటలపైన చక్రస్నానం, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కల్పవృక్ష వాహనం, సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు సర్వ భూపాల వాహనం, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు – చంద్రప్రభ వాహనంపై స్వామి వారు దర్శనమిస్తారు. సూర్య జయంతి పర్వదినాన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వారు సప్త వాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు. ఇప్పటికే ఆలయంతో పాటు పుష్కరణి పరిసరాలను శుభ్రం చేసిన ఆలయ సిబ్బంది ప్రత్యేక పుష్పాలతో గర్భాలయాన్ని ముస్తాబు చేశారు. ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచే వాహన సేవలు ప్రారంభం అవుతుండటంతో అందుకు తగ్గ ఏర్పాట్లు అన్నీ పూర్తి చేశారు.



# కొండగట్టు ఈవో దురుసు ప్రవర్తన పై చర్యలు తీసుకోవాలి



**నేటి సాక్షి - జగిత్యాల (పూరెళ్ల బాపు):** జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో అర్చకులపై దేవస్థానం ఈఓ (ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) దురుసుగా వ్యవహరించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ నెల 24న అర్చకులను పరుష పదజాలంతో దూషిస్తూ అవమానకరంగా మాట్లాడిన తీరును ఖండిస్తూ ధూపదీప నైవేద్య అర్చక సంఘం జగిత్యాల జిల్లా శాఖ శనివారం గట్టి నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కొండగట్టు దేవస్థానం అర్చకులకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. అర్చకుల గౌరవం, సంప్రదాయాలు, దేవాలయ ఆచార వ్యవస్థను కించపరిచే విధంగా అధికారుల ప్రవర్తన ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ధూపదీప నైవేద్య అర్చక సంఘం నాయకులు నాగరాజు మహేంద్ర చార్య, తిరుక్కోవేల గోపాలస్వామి, శ్రీ పెరంబుదుర్ కిరణ్ స్వామి, అలువాల శ్రీధర్ స్వామి, కూర్మచలం లక్ష్మీనారాయణతో పాటు పలువురు అర్చకులు పాల్గొన్నారు.అర్చకులు మాట్లాడుతూ,దేవాలయాల్లో సేవ చేసే అర్చకులపై అధికారుల దురుసు ప్రవర్తన సహించేది కాదు. ఇది కేవలం వ్యక్తిగత అవమానం కాదు.సంప్రదాయ ధర్మ వ్యవస్థపై దాడి అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత ఈఓపై కఠిన చర్యలు తీసుకోవాలని, అర్చకుల గౌరవాన్ని కాపాడేలా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని అర్చక సంఘం డిమాండ్ చేసింది. దేవాలయ పరిపాలనలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అధికారులు భక్తుల విశ్వాసాన్ని, అర్చకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయకుండా సంయమనం పాటించాల్సిన అవసరం ఉందని,సంఘ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# కరపత్రం ఆవిష్కరించిన యూనియన్ నేతలు

- స్విమ్స్ కార్మిక సమస్యలపై 28న జరిగే ధర్నాను జయప్రదం చేయండి సిఐటియు



**నేటి సాక్షి, తిరుపతి:** తిరుపతి స్విమ్స్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం యశోద నగర్‌లోని సిఐటియు కార్యాలయంలో స్విమ్స్ కార్మిక సమస్యలపై ముద్రించిన కరపత్రాలను యూనియన్ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ నెల 28వ తేదీ ఉదయం 8 గంటలకు స్విమ్స్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కరపత్ర ఆవిష్కరణ అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం, స్విమ్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. వేణుగోపాల్ మాట్లాడుతూ గత ఏడాది జూన్‌లో జరిగిన కార్మికుల పోరాటం అనంతరం టీటీడీ యాజమాన్యం – స్విమ్స్ యాజమాన్యం సంయుక్తంగా మూడు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా, నేటికీ ఆ హామీలు అమలు కాలేదని విమర్శించారు. హామీలకు ఏడు నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. స్విమ్స్ అధికారులు టీటీడీ అధికారులపై, టీటీడీ అధికారులు స్విమ్స్ యాజమాన్యంపై బాధ్యత మోపుతూ కాలయాపన చేస్తున్నారే తప్ప, వెయ్యి మందికి పైగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపడం లేదని దుయ్యబట్టారు. శానిటేషన్ పేరును తొలగించి వేతనాలు పెంచుతామని, ఉన్న కార్మికులందరినీ లక్ష్మీ శ్రీనివాస మాన్‌పవర్ కార్పొరేషన్లో విలీనం చేస్తామని, సమ్మె సమయంలో పెట్టిన డిమాండ్లన్నింటినీ పరిష్కరిస్తామని యాజమాన్యం అంగీకరించినప్పటికీ వాటిని అమలు చేయకపోవడమే సమ్మె నోటీసుకు కారణమన్నారు. సమ్మెలోకి వెళ్లేందుకు 22వ తేదీ నుంచే అన్ని రకాల అధికారాలు ఉన్నప్పటికీ, ఆసుపత్రికి రోజూ అనేక మంది రోగులు వచ్చే పరిస్థితుల్లో రోగులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో కార్మికులు మరో వారం రోజుల పాటు సమ్మెను వాయిదా వేసి చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలని ఓపిక పట్టారని తెలిపారు. అయితే ఈ ఓపికను యాజమాన్యం బలహీనతగా భావించడం తగదని హెచ్చరించారు. ఈ సమస్యల పరిష్కారానికై ఈ నెల 28వ తేదీ స్విమ్స్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష–కార్యదర్శులు పి. బుజ్జి, ఎన్. మాధవ్, స్విమ్స్ కార్మికులు రవి, సూరి, మారి ముత్తు, మునికృష్ణ, మునేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అడగగానే స్పందించిన మంత్రి అడ్లూరి

## ఎన్నికలలో ఇచ్చిన హామీని నెరవేర్చిన సర్పంచ్ దాసరి తిరుపతి గౌడ్



**నేటి సాక్షి, జగిత్యాల ( గుండ ప్రశాంత్ గౌడ్ ):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వకోడూరు గ్రామానికి చెందిన ప్రజలకి వరి ధాన్య కొనుగోలు సెంటర్ మరియు సమ్మక్క సారలమ్మ జాతరకు స్థలం లేక గత కొన్ని సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నారు.ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో తనని చిల్వకోడూరు గ్రామ సర్పంచ్ గా గెలిపిస్తే రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో అట్టి భూమిని ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తారని హామీ ఇచ్చిన దాసరి తిరుపతి గౌడ్. గెలిచిన తర్వాత అట్టి విషయమై గ్రామంలోని ప్రభుత్వ భూమిని వరి ధాన్య కొనుగోలు సెంటర్ మరియు సమ్మక్క సారలమ్మ జాతర కొరకు ఆ భూమిని కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విన్నవించగా మంత్రి వెంటనే స్పందించి అధికారులను అట్టి భూమిని వరి ధాన్య కొనుగోలు సెంటర్ మరియు సమ్మక్క సారలమ్మ జాతరకు కేటాయించాలని ఆదేశించగా నేడు దానికి సంబంధించిన ఆర్డర్స్ రావడంతో పాటు అట్టి భూమిని రాబోతున్న సమ్మక్క సారలమ్మ జాతర కొరకు చదును పనులను ప్రారంభించడం జరిగిందని చిల్వకోడూర్ గ్రామ సర్పంచ్ దాసరి తిరుపతి గౌడ్ తెలిపారు. ఇట్టి భూమిని వరిధాన్య కొనుగోలు సెంటర్ మరియు సమ్మక్క సారలమ్మ జాతరకు అందించినటువంటి మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి సర్పంచ్ దాసరి తిరుపతి గౌడ్ మరియు గ్రామ ప్రజలు అందరూ ధన్యవాదాలు తెలిపారు ఇట్టి కార్యక్రమాన్ని కొబ్బరికాయ కొట్టి సర్పంచ్ దాసరి తిరుపతి ఉప సర్పంచ్ దిటీ మహేష్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండి కొమురయ్యా వార్డు సభ్యులు ఓరగంటి మనీషా శ్రీకాంత్ ఓరగంటి లచ్చయ్య తాండ్ర స్వామి మరియు సంపంగి శ్రీను,ముద్దం సాయికుమార్ మెన్గు వినయ్ తదితరులు పాల్గొన్నారు


# విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యం.

## కాగజ్ నగర్ డీఎస్పీ వహీవద్దీన్.



**నేటి సాక్షి కొమురం భీం ఆసిఫాబాద్:** చదువుతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని కాగజ్‌నగర్ డీఎస్పీ వహీవద్దీన్ అన్నారు. శనివారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని స్థానిక అన్వర్ ఉర్దూ పాఠశాలలో అబిద్ అలీఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉర్దూ మీడియం 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా సియాసత్ క్వశ్చన్ బ్యాంక్, ఎగ్జామ్ ప్యాడ్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ వహీవద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొని, అన్వర్ ఉర్దూ పాఠశాల, ఎగ్బాల్ స్కూల్, ప్రభుత్వ పాఠశాల, ఆర్.బి పాఠశాల లకు చెందిన ఉర్దూ మీడియం 10వ తరగతి విద్యార్థులకు క్వశ్చన్ బ్యాంక్ ఎగ్జామ్ ప్యాడ్ లను అందజేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, ఆటపాటలతో పాటు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి, తమ తల్లిదండ్రుల పేరు మాత్రమే కాకుండా సిర్పూర్ నియోజకవర్గానికి రాష్ట్రస్థాయిలో మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు అన్నారు. అలాగే గతంలో 10వ తరగతి ఉర్దూ మీడియం పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు కూడా అబిద్ అలీఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సియాసత్ క్వశ్చన్ బ్యాంక్‌లు అందజేయడం అభినందనీయమని తెలిపారు. విద్యరంగ అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. మండలాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ, మండలంలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కష్టపడి చదివి విజయాలు సాధించడం ద్వారా తమ గురువులకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అందిస్తున్న మార్గదర్శనం, తల్లిదండ్రుల సహకారం వల్ల మంచి ఫలితాలు సాధించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యతోనే భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని, ప్రతి విద్యార్థి లక్ష్యసాధనతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభాకర్,రూరల్ సీఐ కుమారస్వామి,అన్వర్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు ఆరిఫ్ ఉద్దీన్, ట్రస్ట్ జిల్లా ఇంచార్జ్ అబ్దుల్ జమీల్,కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు తాటి రవీందర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విరగ పూసిన మామిడి చెట్లు



**నేటి సాక్షి, ఎండపల్లి:** మామిడి పూత ఈసారి రైతులకు ఆశాజనకంగా కనిపిస్తోంది. పూత పూత మామిండ్లు పూత మామిండ్లు అనే జానపద గేయం గుర్తుకు వచ్చేలా మామిడి తోటలు ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తున్నాయి. సాధారణంగా డిసెంబర్–జనవరి మాసాలలో పూసినట్లే మామిడి చెట్లు విరగపూసాయి. గత ఏడాది ఆశించిన పంట దిగుబడి లేకా రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయం తెలిసిందే. కాగా ఈసారి పూసిన పూతను చూస్తుంటే అదే స్థాయిలో కాత కాస్తుందని తద్వారా అధిక దిగుబడి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే మామిడి పంట పూతతోనే ప్రారంభమైన చివరి కాత కాసేదాక కాపాడుకోవాలని మరోవైపు నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధిక పూత ఉన్న సమయంలో తేనె మంచు, తెగుళ్లు, తామర పురుగు ప్రభావం పూతపై పడి రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండి నివారణకు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇది ఇలా ఉంటే పకృతి వైపరీత్యం దేవుడెరుగు.

# మరోసారి దొంగల బీభత్సం



**నేటి సాక్షి -మెట్ పల్లి (దామ రాజేష్):** జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో దొంగలు మరోసారి బీభత్సం సృష్టించారు. బాధితురాలు కోట లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని 13వ వార్డులో నివసిస్తున్న కోట లక్ష్మి అనే మహిళ ఇంట్లో ఇంటి పనులు చేస్తుండగా దుండగులు ద్విచక్ర వాహనంపై వచ్చి లక్ష్మీపై దాడి చేసి ఆమె మెడలో ఉన్న సుమారు మూడు తులాల పుస్తెలతాడు దొంగిలించారు.. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.. ఏది ఏమైనా వరుస దొంగతనాలతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు..

# డాక్టర్ రఘుని కలిసిన స్వర్ణకార ప్రతినిధులు



**నేటి సాక్షి మెట్‌పల్లి (దామ రాజేష్):** మెట్‌పల్లి : బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు ను శుక్రవారం సాయంత్రం మెట్ పల్లి పట్టణ స్వరకార సంఘ ప్రతినిధులు కలిశారు. పట్టణంలోని కార్యాలయంలో డాక్టర్ రఘును కలిసి పలు సమస్యలను విన్నవించారు. పట్టణంలో స్వర్ణకార సంఘానికి సంబంధించి కమిటీ హాలు నిర్మాణానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సహకారంతో కృషి చేయాలని కోరారు. తమ సంఘానికి 156 గజాల ఖాళీ స్థలం సిద్ధంగా ఉందని భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించడానికి సహకరించాలని కోరారు. కొంతమంది పేద స్వర్ణకారులకు సొంత ఇల్లు లేవని, ఏదైన అశుభం జరిగిన సమయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డాక్టర్ రఘు దృష్టికి తీసుకువచ్చారు. భవన నిర్మాణానికి రూ.15 లక్షలు ఎంపీ ధర్మపురి అరవింద్ నిధుల కోటా నుండి మంజూరు చేయించడానికి సహకరించాలని కోరారు. ఇందుకు డాక్టర్ రఘు మాట్లాడుతూ ఎంపీ అరవింద్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించడానికి తన వంతు సహకారాన్ని అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘ అధ్యక్షుడు వంగల మహేష్, ప్రధాన కార్యదర్శి తొగిటి విద్యాసాగర్, ఉపాధ్యక్షుడు శ్రీపాద సతీష్, సహాయ కార్యదర్శి కలికోట లక్ష్మణ్, మెట్ పల్లి బులియన్ సంఘాల అధ్యక్షులు తొగిటి రమేష్, బెజ్జారపు నవీన్, నాయకులు ఇల్లెందుల కృష్ణమాచారి, బెజ్జారపు మురళి, కోటగిరి తిరుమల్, నాంపల్లి మారుతి, బెజ్జారపు భూమేశ్వర్, బెజ్జారపు రఘు, తునికి చిన్న అంజయ్య, బెజ్జారపు సురేష్, వంగల మహేందర్, దోనోజు వెంకటేష్, ఆకోజీ శ్రీధర్, వేములవాడ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు...

# ఎస్టీ సర్పంచుల అధ్యక్షుడిగా గుడ్లవత్ రాజేందర్

**ఉపాధ్యక్షుడిగా ధరమ్ సోట్ సురేందర్ ఎన్నిక**



**నేటి సాక్షి - మెట్‌పల్లి (దామ రాజేష్):** కోరుట్ల నియోజకవర్గం ఎస్టీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా వేంపల్లి గ్రామ సర్పంచ్ గుడ్లవత్ రాజేందర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వల్గొండ గ్రామ సర్పంచ్ ధరమ్ సోట్ సురేందర్ ఎంపికయ్యారు. ఫోరం ప్రధాన కార్యదర్శిగా ఏఎస్ఆర్ తండా సర్పంచ్ సురేందర్‌ను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా కేసీఆర్ తండా సర్పంచ్ గణేష్, తిమ్మాపూర్ తండా, ఓబులాపూర్ తండా, పార్టీ మీద తండా, రాజారాం తండా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ ఎస్టీ సర్పంచుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుతామని, గ్రామాభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు.

# వాహన రిజిస్ట్రేషన్ నూతన విధానం

**జిల్లా రవాణా శాఖ అధికారి గోపికృష్ణ**

**నేటి సాక్షి మంచిర్యాల:** ప్రభుత్వ ఆదేశానుసారం వాహన రిజిస్ట్రేషన్ లో నూతన విధానాన్ని అమలు చేయడం జరుగుతుందని జిల్లా రవాణా అధికారి గోపికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన మోటార్ సైకిళ్ళు, లైట్ మోటార్ వాహనాల రిజిస్ట్రేషన్ వాహనం కొనుగోలు చేసిన డీలర్ పాయింట్ వద్ద జరిగేలా వాహనదారుల సౌలభ్యం కొరకు సాఫ్ట్ వేర్ రూపొందించి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయమై మోటార్ సైకిళ్ళు, లైట్ మోటార్ వాహనాల డీలర్లతో సమావేశం నిర్వహించి నూతన విధానంపై వివరించడంతో పాటు విధి విధానాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు

# కీర్తిని పొందడానికి డబ్బులతో పనిలేదు



- సాధనతోనే శక్తి వస్తుంది
- శివపురాణ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ భాస్కర శర్మ అభిభాషణ

**నేటి సాక్షి - జగిత్యాల(పూరెళ్ల బాపు):** కీర్తిని పొందడానికి డబ్బుతో పనిలేదని, మనం చేసే పనులవల్లే కీర్తి లభిస్తుందని భాగవత సప్తాహ ప్రవచన కర్త, అభినవ శుక, భాగవత భాస్కర భిరుద్దాన్కితులు బ్రహ్మశ్రీ బుర్రా భాష్కర శర్మ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రం గుట్ట రాజేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో భాగవత సప్తాహ ప్రవచన కర్త, అభినవ శుక, భాగవత భాస్కర, బిరుదాంకితులు బ్రహ్మశ్రీ బుర్రా భాస్కర శర్మ శ్రీ శివ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞం శుక్రవారం 5 వ రోజుకు చేరింది. సత్ కర్మల ఫలితం, సాధనతోనే శక్తి పనిచేస్తుందన్నారు. మనిషిగా పుట్టినప్పుడు ఏం వెంట తీసుకురాలేదని, మరణం పొంది వెళ్ళేటప్పుడు ఏమి తీసుకుపోలేమని చెబుతూ మనం ఉన్నంతలో దాన, ధర్మాలు చేసి పేరు సంపాధించుకోవాలని సూచించారు. కామాన్ని వ్యతిరికించిన అరుంధతి సృష్టిలో మంచి పేరు సంపాధించిందని చెబుతూ నూతనంగా పెళ్ళైన దంపతులకు అరుంధతి నక్షత్రాన్ని చూపెడుతూ ఆమె పవిత్ర ధర్మాన్ని నేటి తరానికి వివరిస్తున్నారని భాస్కర శర్మ కొనియాడారు. శివ మహా పురాణంలోని, అనేక ఘట్టాలతో బాటు మరెన్నెన్నో చాలా మందికి తెలియని విషయాలను చాలా చక్కగా అర్థమయ్యేలా వివరించారు. కార్యక్రమం అనంతరం భక్తులందరికీ మహా అన్న ప్రసాదం అందించారు. అన్న ప్రసాద సేవలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్, బట్టు రాజేందర్ సత్యసాయి సేవా సమితి సభ్యులు సేవలందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, జిల్లా ఉప వైద్య అధికారి డా.శ్రీనివాస్, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, న్యాయవాది గ్యానసూర్యం, పాంపట్టి రవీందర్, చంద్రకళ, శ్రీలత, గంగ, విజయవాని, ఉటూరి కళ్యాణి, రజిత, లక్ష్మి, కళ్యాణి, నరేందుల అమర్, ఊటూరి భాస్కర్, ఊటూరి లక్ష్మీనరసింహారావు, ఊటూరి వేణుగోపాల్, కొత్తపెల్లి శ్రీనివాస్, ఊటూరి శ్రీనివాస్, ఊటురి ప్రసాద్, ఊటూరి మహేష్, ఊటూరి పుల్లయ్య, పాంపట్టి సులోచన, దేవరశెట్టి జనార్దన్, నాగభూషణం, ఊటూరి హరీష్, భక్తులు పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం...ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు..

- మండలం ఉద్యోగస్తుల ఆధ్వర్యంలో క్రీడలు ప్రారంభం.....
- మరికల్ ఎంపీడీవో పృథ్విరాజ్, తాసిల్దార్ రామ్ కోటి....



**నేటి సాక్షి(రిపోర్టర్ ఇమామ్ సాబ్):** గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మరికల్ ఎంపీపీ కాంప్లెక్స్ లోని కార్యాలయ సిబ్బందికి ఆటపోటీలు నిర్వహించడం జరిగినది. ఇందులో క్రికెట్ ఆటలో తాసిల్దార్ రామకోటి, ఎంపీడీవో పృథ్వీరాజ్ కార్యాలసిబ్బంది తలపడగా ఎంపీడీవో సిబ్బంది జట్టు విజయం సాధించింది. అదేవిధంగా మహిళా ఉద్యోగులకు రంగవల్లి పోటీలు కూడా నిర్వహించడం జరిగినది ఇందులో మహిళా సమాఖ్య సభ్యులు తాసిల్దార్ మహిళా ఉద్యోగులు ఎంపీడీవో అభ్యర్థి మహిళా ఉద్యోగులు కూడా పాల్గొన్నారు. చాలా అద్భుతంగా వారి వారి శాఖల గురించి రంగవల్లి రూపంలో వివరించడం జరిగినది. ఇట్టే ఆట పోటీలు నిర్వహణలో మండల ప్రత్యేక అధికారి మరియు తాసిల్దారు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మండల పంచాయతీ అధికారి కాంప్లెక్స్ ఉద్యోగులు పాల్గొనడం జరిగినది. ఈ ఆట పోటీలు గెలిచిన వారికి జనవరి 26వ రోజు బహుమతులను ప్రధానం చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతలపై ఇకనైనా విమర్శలు మానుకోవాలి



- బీజేపీ విధానాలపై సిపిఎం మండిపాటు
- నేతాజీ పోరాట బాటలో ప్రజలు సంఘటితమవ్వాలి

**నేటిసాక్షి, కొత్తపల్లి:** కాంగ్రెస్ నాయకులపై మాజీ మేయర్ సునీల్‌రావు ఇకనైనా విమర్శలు మానుకోవాలని సీనియర్ నాయకుడు నందెల్లి ప్రకాష్ హితవు పలికారు. కొత్తపల్లిలో వెలిచాల ప్రజా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సొంత సామాజిక వర్గ నాయకులనే అణగదొక్కిన చరిత్ర సునీల్‌రావుది అన్నారు. మరోసారి వెలిచాల రాజేందర్ రావుపై విమర్శలు చేస్తే తీవ్రస్థాయిలో పరిణామాలుంటాయని హెచ్చరించారు. చొక్కారావు, వినోద్‌కుమార్‌లను వెన్నుపోటు పొడిచిన సునీల్‌రావుతో కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. స్మార్ట్‌సిటీ నిధుల్లో కోట్లాది రూపాయల అవినీతి, అక్రమాలకు పాల్పడిన సునీల్‌రావు జైలుకు వెళ్లడం తథ్యమని, రాజకీయ భిక్ష పెట్టిన వైనాన్ని మరిచిపోయి, తిన్నింటి వాసాలు లెక్కపెట్టిన చందంగా తయారయ్యాడని దుయ్యబట్టారు. వెలిచాల రాజేందర్‌కు వస్తున్న ఆదరణను తట్టుకోలేక మతిభ్రమించి ఏం మాట్లాడుతున్నారో సునీల్‌రావుకే తెలియడం లేదని, ఓటమి ఖాయమనే విషయం ఆయన మాటల్లోనే స్పష్టమవుతోందన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గండి గణేష్, వెలిచాల రాజేందర్రావు యువసేన జిల్లా అధ్యక్షుడు కాసారపు కిరణ్ కుమార్ మేదర్ సంఘం రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి శనిగరపు సతీష్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కుతాడి సాయి కాంగ్రెస్ నాయకుడు కట్ట సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూర్ అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

- మున్సిపాలిటీకి స్వాగత తోరణం, అభివృద్ధి పనులకు శంకుస్థాపన




**నేటి సాక్షి, మంచిర్యాల:** చెన్నూర్ మున్సిపాలిటీ ప్రవేశ ప్రాంతంలో స్వాగత తోరణం ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార-గనులు-భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. శనివారం చెన్నూర్ మున్సిపల్ పరిధిలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. 50 లక్షల రూపాయల నగరాభివృద్ధి నిధులతో ఖమాన్ నిర్మాణం, 1 కోటి రూపాయలతో వివిధ వార్డుల్లో కల్వర్టుల నిర్మాణం, 50 లక్షల రూపాయలతో పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ పట్టణంలో దాదాపు 50 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం స్మశానవాటిక ఏర్పాటు కోసం 1 ఎకరం భూమిని సేకరించి 1 కోటి 20 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో పనులు చేపడుతున్నామని తెలిపారు. అంబేద్కర్ విగ్రహం సమీపంలోని ప్రాంతాన్ని పార్క్‌గా అభివృద్ధి చేసి జిమ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు కోసం 1 కోటి రూపాయలతో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజల అభీష్టం మేరకు చెన్నూర్ పట్టణంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని చర్యలు తీసుకుంటున్నామని, చెన్నూర్-హైదరాబాద్ బస్సు సేవలు ప్రారంభించామని, ఉదయం 5 గంటల బస్సు ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2 కోట్ల రూపాయలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1 కోటి 50 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కు 50 లక్షలు, మున్నూరు కాపు కమ్యూనిటీ హాల్‌కు 30 లక్షలు మంజూరు చేశామని, 15 లక్షల సిఎస్ఆర్ నిధులతో మెరుగు సంఘ భవనం ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. త్రాగునీటి సమస్య పరిష్కారానికి 250 బోర్‌వెల్స్ ఏర్పాటు చేశామని, అమృత్ పథకంలో భాగంగా 30 కోట్ల రూపాయల పనులు 50 శాతం పూర్తయ్యాయని చెప్పారు. ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం త్రాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కొనసాగుతుండగా, చెన్నూర్ మండల కేంద్రంలో డయాలసిస్ యూనిట్ ద్వారా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా 24 కోట్ల టీఎఫ్ఐడీసీ, 4 కోట్ల డీఎంఎఫ్‌టీ, సిఎస్ఆర్ మరియు నగరాభివృద్ధి నిధులతో పనులు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, త్రాగునీటి సరఫరా కోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చెన్నూర్ పట్టణంలో 31 బోర్లు ఏర్పాటు చేశామని, అమృత్ పథకం ద్వారా నీటి ట్యాంకుల నిర్మాణం కొనసాగుతోందన్నారు. కూరగాయల వ్యాపారుల కోసం సమీకృత కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేశామని తెలిపారు. 100 పడకల ఆసుపత్రి పనులు కొనసాగుతుండగా, అవసరమైన ఫర్నిచర్, పరికరాలకు ఆర్డర్లు ఇచ్చామని చెప్పారు. 1 కోటి 50 లక్షల రూపాయలతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు తుది దశకు చేరుకున్నాయని, కోటపల్లి మండలంలో ఆశ్రమ పాఠశాల పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# వేంపెంట గ్రామంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలు





- నిర్వహించిన మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ.....
- సింగపూర్ సమాజ సేవకుడు నారా లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టేకూరి నాగేశ్వర రావు.

**నేటి సాక్షి పాములపాడు :** నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండలంలోని వేంపెంట గ్రామంలో నారా లోకేశ్ జన్మదినం వేడుకలు ఘనంగా నిర్వహించారూ . వెంపెంటలో సింగపూర్ సమాజ సేవకుడు టేకూరి.నాగేశ్వరరావు లోకేష్ వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటి మరియు లివిద్యా శాఖ మాత్యులు నారా లోకేష్ అన్నకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రామసుబ్బమ్మ మాట్లాడుతూ,విద్యా వ్యవస్థలో మంత్రి నారా లోకేశ్ గారు విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో ఐటీ సంస్థల స్థాపనకు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. 'ముస్తాబు' కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ద్వారా అనేక కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపారని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి నిరంతరం ఎంతో కృషి చేస్తున్నారని చెప్పుకొచ్చారు. అలాగే రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. రాష్ట్ర విద్యా వ్యవస్థలో భావితరాల ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు తీసుకురావడంలో, ఉపాధ్యాయులకు, పేరెంట్స్ మధ్య సహృద్భావ వాతావరణం కల్పిస్తూ, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో లోకేశ్ ముందడుగు వేస్తున్నారాని అన్నారు. రాష్ట్రంలో ఐటీ సంస్థల స్థాపనకు కృషి చేస్తూ, యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశారు. లోకేష్అన్న వారు రాష్ట్ర అభివృద్ధి కి ఎంతో కృషి తపన పడుతున్నారు.ఈరోజు తనకు ఎంతో ఇష్టమైన పుట్టినరోజు వేడుకలకు దూరంగా దావోస్ పర్యటనలో మన రాష్ట్ర ప్రజలు బాగుండాలని నిరంతరం కృషి పడుతున్న నారా లోకేష్ అన్న ఎప్పుడూ దేవుడు దీవెనలు ఆశీస్సులు ఉండాలని ప్రజలకు సేవ చేస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్ళేందుకు మరింత శక్తిని, సుఖసంతోషాలను అందించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను అని టేకూరి . రామసుబ్బమ్మ వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో వెంపెంట తెలుగుదేశం కార్యకర్తలు , నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ డి.సీ.అల్ఫ్రేడ్ మాజీ ఉప సర్పంచ్, సత్యరాజు, మాజీ ఎంపీటీసీ, శివ కుమార్, బూత్ కన్వీనర్ బోనంపల్లె.వినయ్ కుమార్, బొమ్మా.రాజేష్ గాండ్ల.భాస్కర్, ప్రసాద్, నెంబర్ లక్ష్మన్న, చిన్నస్వామి ఆచారి, వేమా రెడ్డి, యువరాజు శ్రీధర్, జనసేనా శేషు, రమేష్ రెడ్డి, జీవన్న, శేషి రెడ్డి, గోవిందయ్య ఆచారి, రమణా చారి, రత్నాకర్, యర్రసాని.రాము, సుబ్బారావు పాల్గొన్నారు . యువ నాయకులకు గ్రామ ప్రజలు కార్యకర్తలు, విజయవంతం చేయడమైనది.

# మ్యాతమెటిక్స్ మెటీరియల్ ఎంతో ఉపయోగకరం



- జగిత్యాల జిల్లా విద్యాధికారి రాము

**నేటి సాక్షి - జగిత్యాల (పూరెల్ల బాపు):** విద్యార్థుల భవిష్యత్తుకు తెలంగాణ మ్యాతమెటిక్స్ ఫోరం జగిత్యాల జిల్లా రిసోర్స్ టీమ్ రూపొందించిన మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని జగిత్యాల జిల్లా విద్యాశాఖ అధికారి కే. రాము అన్నారు. జగిత్యాల జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎస్సెసి 2025-26 పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం (టీఫ్) జగిత్యాల జిల్లా రిసోర్స్ టీం రూపొందించిన మ్యాతమెటిక్స్ టీచర్స్ సపోర్ట్ గ్రూప్ స్టూడెంట్ మెటీరియల్ ను శనివారం డీ ఈ ఓ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము , ఏ ఏం ఓ చంద్రశేఖర్ రెడ్డి గారు, డీసీఈబీ కార్యదర్శి మురళీమనోహర చారి, డిసిఈబీ అసిస్టెంట్ సెక్రటరీ హాజరయ్యారు. టీచర్ సపోర్ట్ గ్రూప్ విద్యార్థులు గణితంలో భయాన్ని తొలగించి ధైర్యంగా పరీక్షలు రాయడానికి ఈ మెటీరియల్ దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ అధ్యయన సామగ్రి ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా, విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని పెంచే విధంగా రూపొందించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో టీ ఎం ఎఫ్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు వి. శ్రీకాంత్ , ప్రధాన కార్యదర్శి బస రాజగోపాల్ , ఆర్థిక కార్యదర్శి ఎం. లక్ష్మీకాంత్ , వి వి.వెంకటస్వామి , అశోక్ ఎర్రబెల్లి సభ్యులు టి. శ్రీనివాస్, ప్రవీణ్, వేణు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈ మెటీరియల్‌ను సమర్థవంతంగా అమలు చేసి వంద శాతం ఫలితాలు సాధించాలని వక్తలు పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లాలో గణిత ఫలితాల మెరుగుదలకు ఒక మైలురాయిగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# బాలికలు అన్ని రంగాలలో ఉన్నత స్థాయిలో నిలువాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నేటి సాక్షి,మంచిర్యాల జిల్లా:** మంచిర్యాల బాలికలు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, అందరికీ ఆదర్శంగా నిలువాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్, జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. బాలికలను రక్షిద్దాం - బాలికలను చదివిద్దాం కార్యక్రమంలో భాగంగా బాలికల సంరక్షణ కొరకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని, బాలికలకు అవకాశం ఇస్తే అన్ని రంగాలలో అద్భుతంగా ఆకాశాన్ని అందుకుంటారని అన్నారు. భ్రూణహత్యల నివారణ, బాల్యవివాహాల నియంత్రణ చర్యల ద్వారా బాలికలను రక్షించుకొని అణిచివేతకు గురి కాకుండా ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని, బాలికలకు జీవించే హక్కు, రక్షణ హక్కు, అభివృద్ధి హక్కు, భాగస్వామ్య హక్కు లాంటి ఎన్నో హక్కులను కల్పించడం జరిగిందని తెలిపారు. బాలికల రక్షణ కొరకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు వెళ్ళాలని తెలిపారు. బేటి బచావో - బేటి పడావో ద్వారా భ్రూణహత్యలను నియంత్రించి ఆడపిల్లల లింగ నిష్పత్తిని పెంచడం జరిగిందని, కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాల ద్వారా తెలంగాణలో బాలిక విద్యను ప్రోత్సహించడంతో పాటు పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా క్యాంటీన్లు, వివిధ వ్యాపారాలలో మహిళ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. బాలికలు సమాజంలో జరుగుతున్న ప్రతి అంశాన్ని తెలుసుకోవాలని, ప్రతి విషయంలో నైపుణ్యం పెంపొందించుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం జాతీయ బాలిక దినోత్సవం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. బేటి బచావో- భేటీ పడావో ప్రతిజ్ఞ చేశారు. చదువుతో పాటు క్రీడలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన బాలికలకు జ్ఞాపికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరం మండల కేంద్రంలో విబి జిరామ్‌జి చట్టం



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో శనివారం రోజున వికసిత్ భారత్ గన్నేరువరం మండల కన్వీనర్ పుల్లెల రాము ఆధ్వర్యంలో బిజెపి మండల అధ్యక్షులు తిప్పర్తి నికేష్ అధ్యక్షతన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ మరియు అజీవిక మిషన్ గ్రామీణ్ (విబి-జి రామ్‌జి) చట్టం 2025 మండల కార్యశాల నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వికసిత్ భారత్ జిల్లా కన్వీనర్ మరియు బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి హాజరై మాట్లాడుతూ గ్రామీణ కుటుంబాల ఉపాధి మరియు ఆర్థిక భరోసా కోసం చేసిన విబి-జి రామ్ జి కొత్త చట్టం గురించి కాంగ్రెస్ ప్రభుత్వం బిజెపి మీద దుష్ప్రచారం చేస్తుందని అన్నారు. కన్వీనర్ పుల్లెల రాము మాట్లాడుతూ గతంలో ఉన్న 100 రోజుల పనిని ఇప్పుడు 125 రోజులకు పెంచారని సంవత్సరంలో 60 రోజులు సెలవు దినాలు ప్రకటించుకునే వెసులుబాటు ఉందని గతంలో 15 రోజులు దాటిన రాని వేతనం డబ్బులు ఇప్పుడు పని చేసిన వారం రోజుల లోపు డబ్బులు వేయడం జరుగుతుందని ఈ చట్టం గురించి బిజెపి కార్యకర్తలు అందరూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికసిత్ భారత్ కొ-కన్వీనర్ పుల్లెల జగన్ మోహన్ ఏలేటి చంద్రా రెడ్డి బండ తిరుపతి గాదె వెంకన్న కాంతల రాజిరెడ్డి చొక్కాల లక్ష్మయ్య మునిగంటి సత్తయ్య రాముడి కృష్ణమూర్తి బొమ్మాడి సురేందర్ సందవేణి ప్రశాంత్ యాదవ్ తాడూరి రమణారెడ్డి మచ్చ మురళి టేకు అనిల్ కుంభం విష్ణు దానవేని ప్రశాంత్ జీల ఎల్లయ్య గూడూరు జగన్ మరియు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశాల తెలుగు దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరన

సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ప్రజా సమస్యలే అజెండాగా, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న 'విశాల తెలంగాణ' తెలుగు దినపత్రిక నూతన సంవత్సరం-2026 క్యాలెండర్ ను శనివారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ హమీద్, విశాల తెలంగాణ డివిజన్ ఇంచార్జి కందుకూరి సుదర్శన్, నేటిసాక్షి డివిజన్ ఇంచార్జి, సీనియర్ జర్నలిస్ట్ మంద.లక్ష్మణ్, నవజ్యోతి డివిజన్ ఇంచార్జి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి అవకాశాలు కల్పించాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు డిమాండ్...



**నేటి సాక్షి పాములపాడు :** పాములపాడు మండలం రుద్రవరం టోల్గేట్ లో స్థానిక యువకులకు ఉపాధి లభిస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకొని ఉన్నారని, అనేక ఎకరాలు భూములు నేషనల్ హైవేకు త్యాగం చేశారని అలాంటి వారికి అన్యాయం చేయడం తగదని యువత ఆశలు నిరాశలయ్యాయని ఇతర రాష్ట్రాల వారిని స్థానిక టోల్ గేట్ లో నియమించడం సమంజసం కాదని తక్షణమే ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని లేనిపక్షంలో టోల్గేట్ ను ముట్టడిస్తామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు హెచ్చరించారు.. శనివారం స్థానిక మండల కేంద్రంలో వారు మాట్లాడారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ పనులకు ఈ ప్రాంత ప్రజలు రైతులు తక్కువ ధరలకే భూములు ఇచ్చారని ఎంతోమందికింతవరకు నష్టపరిహారం కూడా చెల్లించలేదని అయితే టోల్గేట్ ఈ ప్రాంతంలో ఏర్పాటు అయితే అభివృద్ధి జరుగుతుందని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశిస్తే తీరా టోల్గేట్ ఏర్పాటు చేసిన తర్వాత ఈ ప్రాంత యువతను పట్టించుకోవడంలేదని ఇతర రాష్ట్రాల వారికి ఎలా అవకాశం కల్పిస్తారని వారు అన్నారు. ఇంతకుమునుపే ఈ ప్రాంతం శ్రీశైలం నీటిమనకల్లో సర్వస్వం కోల్పోయి నిరుద్యోగ పెరిగిందని ఎక్కడ ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆశతో ఎదురుచూస్తున్నారని ఉన్న పది ఉద్యోగాలు ఇతర రాష్ట్రాల వారికి ఇస్తే ఈ ప్రాంత నిరుద్యోగులు ఏమి కావాలని వారు ప్రశ్నించారు తక్షణమే టోల్గేట్ లో ఉపాధి కల్పించకపోతే ఆందోళన తప్పదని వారు హెచ్చరించారు..ఈ కార్యక్రమంలో మండల నాయకులు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు..

# నమ్మించి మోసం చేసిన వ్యక్తి అరెస్ట్




**నేటి సాక్షి-మంచిర్యాల్( శ్రీధర్ దమ్మ ):** మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్ గోదావరి రోడ్డుకు చెందిన చిక్రంసాయి కిరణ్ (27) అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు. ఎస్సై గోపతి సురేష్ తెలిపారు స్థానిక ఒక మహిళకు తన భర్తతో విడాకులు కావడంతో కొద్ది రోజులుగా ఇంట్లో ఉండటాన్ని గమనించిన నిందితుడు తనకు తరచూ ఫోన్ చేస్తూ మాయ మాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని ప్రేమిస్తున్నానని శారీరకంగా వాడుకొని బాధితురాలు పెళ్లి చేసుకోవాలని కోరడంతో పెళ్లికి నిరాకరించగా వాయిదాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది అని లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్ అన్నారు లక్షట్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా మహిళల పట్ల బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఇబ్బందులకు గురిచేసిన వదిలేది లేదు అని చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ

జిల్లా వైద్యాధికారి డా.సుజాత



**నేటి సాక్షి - జగిత్యాల(పూరెల్ల బాపు):** జగిత్యాల పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులను, ల్యాబ్ లను జిల్లా వైద్యాధికారి డా.సుజాత సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది, రిజిస్ట్రేషన్ లో నమోదైన సిబ్బంది పోల్చి చూశారు. రిజిస్ట్రేషన్ లో ఉన్న అర్హత గల సిబ్బంది మాత్రమే ఆసుపత్రిలో పనిచేయాలని, ఒకవేళ సిబ్బంది ఎవరైనా మారినచో వెంటనే అనుమతి పొందిన తర్వాత మాత్రమే వారిని పనిలోకి తీసుకోవాలని,ఆస్పత్రులు ల్యాబ్ వ్యర్థాలను బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ ద్వారా మాత్రమే నిర్మూలించాలని, ఎట్టి పరిస్థితుల్లో మున్సిపల్ వాహనాలకు ఇవ్వరాదని,ఆస్పత్రి స్థాపన నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఒకవేళ నిబంధన ఉల్లంగించిచో,ఆసుపత్రి పై వెంటనే కఠిన చర్యలు తీసుకోబడతాయని, ఆసుపత్రి అనుమతి రద్దు చేయబడుతుంది అని జిల్లా వైద్యాధికారి డా.సుజాత ఈ సందర్భంగా తెలియజేశారు.

# ఆడపిల్ల చదువులో సరస్వతి

**బిజెపి మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్**

**బాలికల హక్కులు, ఆరోగ్యం, విద్య,**

**సామాజిక ఎదుగుదల అంశాలపై అవగాహన సదస్సు**



**నేటి సాక్షి పాములపాడు:** ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మీ చదువులో సరస్వతి.. ఆదరించడంలో అన్నపూర్ణాదేవి అని బిజెపి మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ అన్నారు. మండల కేంద్రమైన పాములపాడులోని, ఎంపీయూపీఎస్ ఉర్దూ పాఠశాలలో బిజెపి ఆధ్వర్యంలో "జాతీయ బాలికా దినోత్సవం" ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు రాయపాటి మురళీ మోహన్, హెచ్ఎం బద్రునిసా బేగం, ఉపాధ్యాయులు ఎస్.నిజాముద్దీన్, తదితర టీచర్లతో కలిసి ఉర్దూ పాఠశాలలో చదువుతున్న బాలికలకు ఆకర్షణీయమైన బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు రాయపాటి మురళీమోహన్, ఎంపీయుపి ఉర్దూ స్కూల్ హెచ్ఎం బద్రునిసా బేగం, ఉపాధ్యాయులు ఎస్.నిజాముద్దీన్, తదితర ఉపాధ్యాయులు మాట్లాడుతూ సమాజంలో బాలికల సంరక్షణపై అవగాహన కల్పించడానికి బాలికల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల, అంశాలపై అవగాహన కల్పించడానికి 2008 నుంచి ఏటా జనవరి-24న జాతీయ బాలికా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఆడపిల్లలపై ఇప్పటికి వివక్ష ఉందన్నారు. వారిని చదువులో, ఉద్యోగంలో, పెళ్లిలో వెనక్కి లాగే వారు ఇంకా ఉన్నారు. ముఖ్యంగా, లింగ వివక్ష, బాల్య వివాహాలు వంటి సమస్యలను పరిష్కరించడానికి, బాలికలకు అవసరమైన మద్దతు ఇవ్వడం ఈ రోజుని జరుపుకునే ప్రధాన ఉద్దేశ్యం. కుటుంబాలు, సమాజం, దేశాన్ని నిర్మించడంలో ఆడపిల్లలు ముఖ్యమన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రభుత్వంతో పాటు, పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తాయనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాల గోపాల కృష్ణ, షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

# ఆలయంలో ఓం శక్తి మాలదారణ



**నేటి సాక్షి తిరుపతి, తిరుపతి:** తిరుపతి రూరల్ మండలం దుర్గ సముద్రం జగనన్న కాలనీలోని గుండాల గంగమ్మ ఆలయం వద్ద శనివారం మహిళలు పెద్ద ఎత్తున ఓం శక్తి మాలదారణ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కామసాని నరసింహా రెడ్డి ఆధ్వర్యంలో గురుశక్తులు మునీశ్వరమ్మ, బాలాజీ రెడ్డి, మహేశ్వరి, రత్నమ్మచే స్థానిక మహిళలు ఓంశక్తి మాలలు ధరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మౌనిక, టీడీపీ నేత మునిశేఖర్‌లు పాల్గొన్నారు. ఓం శక్తి మాల దారణ చేసిన మహిళలు ఈనెల 26 వతేది సాయంత్రం గ్రామంలో గెరిగ ఊరిగింపు చేసి ఇరుముడి కట్టుకుని తమిళనాడులోని మేల్ మరవత్తూర్ అమ్మవారికి ముదుపు చెల్లించేందుకు వెళతారు.

# నిర్వాసితులకు తీవ్ర అన్యాయం

**మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి : రాములు గౌడ్**



**నేటి సాక్షి గజ్వేల్.:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఏడవ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాములు గౌడ్ ప్రజలను కోరారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ ఏడవ వార్డులో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత టీఆర్ ఎస్ ప్రభుత్వం మల్లన్న సాగర్ భూ నిర్వాసితులను నమ్మించి మోసం చేసిందని తీవ్రంగా విమర్శించారు. నష్టపరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తూ నిర్వాసితులను అనేక ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాను రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఏడవ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యలను తీసుకెళ్లి న్యాయం చేయడానికి కృషి చేస్తానని రాములు గౌడ్ స్పష్టం చేశారు. టీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే న్యాయం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలపై స్పందించే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో గెలిపించాల్సిన బాధ్యత ప్రజలదేనని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏడవ వార్డు ప్రజలు తనపై నమ్మకం ఉంచి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రవల్లి, సింగారం గ్రామాలకు చెందిన పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# తంగడపల్లి గ్రామ పాఠశాలలకు ఊరట



- మరుగుదొడ్ల సమస్యకు పరిష్కారం
- విద్యార్థుల ఇబ్బందులు విన్న వెంటనే స్పందించిన కాంటెస్ట్ సర్పంచ్ ఎలిగేటి శ్రీకాంత్ రెడ్డిలి
- 81,000 స్వంత నిధులతో వాష్‌రూమ్ మరమ్మత్తులు పూర్తి
- విద్యార్థుల ఆరోగ్యం, గౌరవానికి పెద్ద పీట వేసిన ప్రజాసేవ

**నేటి సాక్షి రంగారెడ్డి సుధాకర్ గౌడ్ చేవెళ్ల న్యూస్:** తంగడపల్లి గ్రామంలోని ఉభయ పాఠశాలలకు సంబంధించిన మరుగుదొడ్లు (వాష్‌రూమ్స్) శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బాలికలు, చిన్న తరగతుల విద్యార్థులు మరింత సమస్యను ఎదుర్కోనాల్సి వస్తుండగా, ఈ పరిస్థితి పాఠశాల వాతావరణంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ విషయాన్ని పాఠశాల యాజమాన్యం గమనించి గ్రామ కాంటెస్ట్ సర్పంచ్ శ్రీ ఎలిగేటి శ్రీకాంత్‌రెడ్డికి తమ బాధను తెలియజేశారు. విద్యార్థుల సమస్యను విన్న వెంటనే స్పందించిన శ్రీ ఎలిగేటి శ్రీకాంత్ రెడ్డి గారు, "ఇది చిన్న విషయం కాదౌ పిల్లల ఆరోగ్యం, గౌరవం, భద్రతకు సంబంధించిన అంశం" అంటూ తక్షణమే చర్యలకు ఉపక్రమించారు. ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడకుండా, తన సొంత నిధులతోనే ఈ సమస్యను పరిష్కరిస్తానని ముందుకు వచ్చారు. తదనంతరం ఆయన స్వంతంగా 81,000 ఖర్చు చేసి పాఠశాలలకు సంబంధించిన మరుగుదొడ్ల మరమ్మత్తులను పూర్తిస్థాయిలో చేపట్టించారు. వాష్‌రూమ్స్ శుభ్రంగా, ఉపయోగించుకునేలా మరమ్మత్తులు చేయడంతో పాటు, నీటి సదుపాయం, భద్రత అంశాలపైనా ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో విద్యార్థులు ఇకపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాష్‌రూమ్స్ వినియోగించుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ సేవా కార్యక్రమంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా బాలిక విద్యార్థులకు ఇది ఎంతో ఊరట కలిగించే అంశమని వారు తెలిపారు. సమస్యను విన్న వెంటనే స్పందించి, స్వంత నిధులతో పరిష్కారం చూపిన శ్రీకాంత్ రెడ్డి గారి సేవాభావాన్ని వారు కొనియాడారు. గ్రామస్తులు కూడా ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇలాంటి ప్రజాప్రతినిధులు గ్రామానికి ఆశీర్వాదమని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా, ప్రజల అవసరాల కోసం ఎప్పుడూ ముందుండే నాయకత్వమే నిజమైన సేవ అని వారు పేర్కొన్నారు. మొత్తంగా తంగడపల్లి గ్రామ పాఠశాలల్లో జరిగిన ఈ మరుగుదొడ్ల మరమ్మత్తుల కార్యక్రమం విద్యార్థుల ఆరోగ్యం, గౌరవం, భద్రతకు పెద్ద భరోసాగా నిలిచింది. విద్యాభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాలపై దృష్టి సారించిన ఈ చర్య గ్రామంలో విశేష ప్రశంసలు పొందుతోంది.

# పరికరాలతో రైతులకు సాగు సులభతరం

- మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



**నేటి సాక్షి మంచిర్యాల:** వ్యవసాయ సాగులో రైతులకు ఉపయోగకరమైన వ్యవసాయ పరికరాలతో సాగు సులభతరం అవుతుందని మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల పద్మనాయక ఫంక్షన్ హాల్ లో జిల్లా వ్యవసాయ అధికారిని సురేఖ, మంచిర్యాల ఏఎంసి చైర్మన్ పయ్యావుల పద్మ ముని, ఆత్మ బిఎఫ్ఏసి ఛైర్మన్ సింగటి మురళి, సహాయ వ్యవసాయ సంచాలకులు మంచిర్యాల డివిజన్ ఎం.కృష్ణ లతో కలిసి అర్హులైన రైతులకు వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గాను సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజెషన్ లో భాగంగా ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై రైతులకు వ్యవసాయ పరికరాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా పథకాలను అమలు చేయడంతో పాటు వరి ధాన్యం, పత్తి, మొక్కజొన్న పంటలను కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి కొనుగోలు చేస్తూ రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో 35 లక్షల 31 వేల రూపాయల విలువైన 6 పవర్ టిల్లర్లు, 6 రోటవేటర్లు, 52 పవర్ స్ప్రేయర్లు, 16 బ్రష్ కట్టర్లను జిల్లాలోని దండేపల్లి, హాజీపూర్, లక్షెట్టిపేట మండలాలకు చెందిన 81 మంది అర్హులైన రైతులకు 16లక్షల 24 వేల రూపాయల రాయితీతో పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# పదవి ఆశించి కాదు, వార్డు అభివృద్ధికై ముందు అడుగు

- మున్సిపల్ ఎన్నికల్లో 8వ వార్డు నుండి పోటీ చేయడం పక్కా....
- ఎలాంటి ప్రలోభాలకు లొంగే ప్రసక్తి లేదు....
- బిజెపి యువ నేత గుండ్ర మధు మోహన్ రెడ్డిరావు

**నేటి సాక్షి రంగారెడ్డి(సుధాకర్ గౌడ్)శంకర్పల్లి :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడం పక్కా అని గుండ్ర మధుమోహన్ రెడ్డి తెలిపారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ఎనిమిదో వార్డు నుండి పోటీ చేసే తీరుతానని, ఎవరు ఎన్ని ప్రలోభాలకు గురి చేసిన లొంగే ప్రసక్తే లేదని అన్నారు. గిట్టని వారు తమపై ఎన్ని వదంతులు సృష్టించిన వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. నిరంతరం ప్రజల్లో ఉండి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకే కౌన్సిలర్ గా పోటీ చేయడం జరుగుతుందని అన్నారు. మనలో పని చేయాలనే తపనతో పాటు, ఆ తపనకు పదవి తోడైతే ప్రజా సమస్యలు మరింత త్వరితగతిన పరిష్కరించగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని మరింత బాధ్యతతో కౌన్సిలర్ ఎన్నికల్లో పోటీచేసి విజయ దంక మోగియడం ఖాయమన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆలోచతో తాము ముందడుగు వేస్తున్నామని, తమ ముందడుగుకు వార్డు ప్రజానీకం తమ మద్దతు తెలిపి, తమను ఆశీర్వదిస్తారని అలాగే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 8వ వార్డు కౌన్సిలర్ గా తమను గెలిపిస్తారని వారు ధీమా వ్యక్తం చేశారు. ఆలోంచంచడి, ఆశీర్వదించండి, తనను గెలిపించి అభివృద్ధికి బాటలు వేయడంలో పాలుపంచుకోండి అని ఆయన వార్డు ప్రజలను కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధులను ఎలాంటి అవకతవక లకు చోటు లేకుండా నేరుగా వార్డు ప్రజలకు చేరే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను నమ్మిన తాను, అదే సిద్ధాంతాలతో రాబోయే ఎన్నికల్లో ముందుకు సాగుతానని, గెలుపే ధ్యేయంగా, వార్డు అభివృద్ధి ప్రధానా ఎజెండాగా మున్సిపల్ ఎన్నికల్లో ముందుకు సాగుతానని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికై అను నిత్యం పోరాడుతామని తెలిపారు. యువత రాజకీయాల్లోకి రావడం వలన, ప్రజా సమస్యలపై అవగాహన పెరుగుతుందని, రాజకీయ అనుభవంతో జీవితంలో ముందడగు వేస్తారని తెలిపారు. ఇటీవల భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన యువ నేత నితిన్ నబీన్ ను ఆదర్శంగా తీసుకొని యువత రాజకీయాల్లోకి రావాలని ఈ సందర్భంగా



ఆయన సూచించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తమను ఎనిమిదవ వార్డు నుండి భారీ మెజారిటీతో గెలిపించి, వార్డు అభివృద్ధిలో భాగస్వాములు కావలసిందిగా వార్డు ప్రజలను మధు మోహన్ రెడ్డి కోరారు.

# ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి కేసి కెనాల్‌కు సాగునీరు



- ఎంపీ.బైరెడ్డి శబరికి కృతజ్ఞతలు తెలిపిన టెలికాం సలహా దారులు.. కురువ రమేష్

**నేటి సాక్షి నంద్యాల:** నంద్యాల జిల్లా, నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నాలుగు గేట్ల ద్వారా 1000 క్యూసెక్కులు, మల్యాల పంపు హౌస్ రెండు మోటార్ల ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం 1600 క్యూసెక్కుల నీరు కేసీ కెనాల్ ఆయకట్టు రైతులకు నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రత్యేక చొరవతో శనివారం సాగునీరు విడుదల చేయడం జరిగిందనీ నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత డిసెంబర్ 2వ తేదీ నంద్యాల జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించినఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశంలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, వివిధ ప్రాజెక్టుల నిర్వహణ పరిస్థితి, ఈ రబీ సాగుకు అవసరమైన నీటి లభ్యతపై సమగ్రంగా చర్చించి,హాఈ జనవరి 15 తరువాత కే.సి. కెనాల్‌కు నీరు అందుబాటులో ఉండదని స్పష్టమైన నిర్ణయం ప్రభుత్వం తీసుకోవడం జరిగిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. తుంగభద్ర డ్యాంలో గేట్లకు చేపట్టిన అత్యవసర మరమ్మత్తుల కారణంగా డ్యాం నుండి నీటి విడుదల పరిమితమై, అందుబాటులో ఉన్న నీటి పరిమాణం గణనీయంగా తగ్గిపోయిందనీ, ఈ సాంకేతిక పరిస్థితుల నేపథ్యంలోనే నీటి సరఫరా విషయంలో కొంత జాప్యం జరిగిందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో కే.సి. కెనాల్ పరిధిలోని మొత్తం ఆయకట్టు ఒక పంటకు పూర్తి సాగు నీరు అందించడం జరిగిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. రబీ పంటను కాపాడుకునేందుకు ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, అవాస్తవ ప్రచారం రైతులు నమ్మవద్దని ఎంపీ బైరెడ్డి శబరి విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యను గమనించి, ఇరిగేషన్ అధికారులతో నేరుగా మాట్లాడి తన చొరవతో కేసి కెనాల్ కు నీళ్ళు విడుదల చేయించిన నంద్యాల ఎంపీ. బైరెడ్డి శబరి వారికి రైతాంగం తరుపున అపారమైన కృతజ్ఞతలు అని టెలికాం సలహా దారులు కురువ రమేష్ వారు ఎంపీ. శబరి వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశాడు.

# ఇందిరమ్మ చీరలు కాదు మహిళల మెడకు అప్పుల ఉచ్చు



- చీర పేరుతో రూ.1,200 బాదుడు ఆధార్, వేలు ముద్రల వెనుక రహస్యం ఇదేనా?
- ఈ రోజు చీర రేపు నోటీసు? కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎర్రబెల్లి దయాకర్ రావు సంచలన ఆరోపణలు

**నేటి సాక్షి మహబూబాబాద్(భూక్యా రవినాయక్):** ఇందిరమ్మ చీరల పంపిణీ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. మహిళలకు ఉచితంగా చీరలు ఇస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, వాస్తవానికి ప్రతి మహిళ పేరు మీదే రూ.1,200 అప్పు నమోదు చేస్తూ మోసం చేస్తోంది అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఘాటు ఆరోపణలు చేశారు. ఇది సంక్షేమం పేరుతో జరుగుతున్న ఆర్థిక మోసం అని ఆయన వ్యాఖ్యానించారు. చీరలు ఇస్తున్న సందర్భంలో మహిళల నుంచి ఆధార్ కార్డులు, వేలు ముద్రలు ఎందుకు తీసుకుంటున్నారు? అని ఎర్రబెల్లి ప్రశ్నించారు. కేవలం గుర్తింపు కోసమే అయితే, మహిళల పేరు మీద అప్పులు ఎలా పుట్టుకొస్తున్నాయి అని నిలదీశారు. "ఈ రోజు ఉచితంగా ఇచ్చినట్లు ప్రచారం చేసి, రేపు ఒక రోజు మీరు తీసుకున్న చీరలకు డబ్బులు కట్టాలంటూ నోటీసులు పంపే ప్రమాదం ఉంది" అంటూ ఆయన మహిళలను అప్రమత్తం చేశారు. ఇందిరమ్మ చీరల పథకం పూర్తిగా అస్పష్టత, గోప్యత మధ్య నడుస్తోందని, లబ్ధిదారులకు ముందుగానే నిబంధనలు చెప్పకుండా వివరాలు సేకరిస్తున్నారని విమర్శించారు. నిజంగా మహిళల సంక్షేమమే లక్ష్యమైతే, ప్రభుత్వం ముందుకొచ్చి ఈ చీరలకు ఎలాంటి అప్పులు లేవని లిఖితపూర్వక హామీ ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. పేద మహిళల భావోద్వేగాలను ఆసరాగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుల రాజకీయాలు చేస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని ఎర్రబెల్లి ఆరోపించారు. సంక్షేమ పథకాలు ప్రజలకు ఉపశమనంగా ఉండాలి కానీ, భవిష్యత్తులో భారంగా మారకూడదని ఆయన అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరిస్తూ, ఇందిరమ్మ చీరల పంపిణీపై సమగ్ర విచారణ జరిపించాలి అని ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు.

# శంకర్‌పల్లి మణి గార్డెన్స్‌లో మెప్మా, ఎస్ఈఆర్‌పి అవగాహన

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న చేవెళ్ల ఏసిపి కిషన్..





**నేటి సాక్షి,రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి:** రోడ్డు భద్రత పై శుక్రవారం స్థానిక సీఐ శ్రీనివాస్ 10వ రోజు ArriveAliveలో భాగంగా శంకర్ పల్లి లోని మణి గార్డెన్స్‌లో మెప్మా, ఎస్ ఈ ఆర్ పి వారికి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఏసిపి కిషన్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు మద్యం సేవించకూడదని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం 100% ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ నియమాలకు లోబడి వాహనాలు నడపాలన్నారు. బైక్పై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే కారు నడిపే వారు కూడా సీట్ బెల్ట్ ను పెట్టుకోవాలన్నారు. కారులో డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న వారు కూడా సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉండాలని తెలిపారు. వాహనాలు నడిపేవారు లైసెన్సులు కలిగి ఉండాలని చెప్పారు. మైనర్ పిల్లలకు బైకులు నడపడానికి ఇవ్వకూడదని తెలిపారు. అలా ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేయవలసి ఉంటుందని చెప్పారు. వాహనాలను అతివేగంగా నడపకూడదని సూచించారు. అలాగే రాంగ్ రూట్లో కూడా వాహనాలు నడపకూడదు అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్, మోకిల సిఐ వీరబాబు, స్థానిక ఎంపీడీవో వెంకయ్య గౌడ్, శంకర్ పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్, ఎస్ఐలు కె. సురేష్, శ్రీశైలం, ట్రాఫిక్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది మహిళలు పాల్గొన్నారు. రోడ్డు భద్రత విషయంలో వారితో ప్రమాణం చేయించారు.

# టిఆర్ఎస్ పాలనలోనే నిజమైన అభివృద్ధి


- కాంగ్రెస్ అబద్ధపు హామీలూ బీజేపీ చిచ్చురాజకీయం

మాజీ బీఆర్ఎస్ కౌన్సిలర్ బాలమని శ్రీనివాసరెడ్డి ఘాటు విమర్శలు



**నేటి సాక్షి గజ్వేల్:** గత టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి జరిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ మాటలకే పరిమితమైందని, బీజేపీ కులమతాల మధ్య చిచ్చు రేపి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని మాజీ బీఆర్ఎస్ కౌన్సిలర్ బాలమని శ్రీనివాసరెడ్డి ఘాటు విమర్శలు చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ "తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని కాంగ్రెస్ నేతలు మాట్లాడడం హాస్యాస్పదం. టిఆర్ఎస్ పాలనలో చేసిన ప్రతి అభివృద్ధి పని ప్రజల కళ్ల ముందు సాక్ష్యంగా ఉంది" అని మండిపడ్డారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పాలకవర్గం హయాంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి చేపట్టామని తెలిపారు. ముఖ్యంగా రూ.180 కోట్లతో అంతర్గత మురుగు కాలువల నిర్మాణం చేసి పట్టణ ప్రజలను ఏళ్ల తరబడి వేధించిన మురికి సమస్య నుంచి విముక్తి కల్పించామని గుర్తు చేశారు. తన వార్డులో ప్రతి గల్లీకి సీసీ రోడ్లు, వీధిలైట్లు ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించామని, ఇవన్నీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి పాలనకు నిదర్శనమని అన్నారు. కేసీఆర్ సహకారంతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులకు, పేదలకు, మహిళలకు ఇచ్చిన హామీలన్నీ గాలిలో కలిసిపోయాయని ఆరోపించారు. మరోవైపు బీజేపీ అభివృద్ధి గురించి మాట్లాడకుండా కులమతాల మధ్య చిచ్చు రేపుతూ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. "బీఆర్ఎస్ పాలనలో కులమత భేదాలు లేకుండా ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలు అందాయి. పేదల బతుకుల్లో మార్పు తీసుకొచ్చిన ఏకైక ప్రభుత్వం టిఆర్ఎస్ ప్రభుత్వమే" అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. మరోసారి అవకాశం ఇస్తే తన వార్డును మరింత అభివృద్ధి చేసి ప్రజలకు సేవ చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి సహకారంతో ప్రజాసేవకు అవకాశం కల్పించాలని కోరారు.

# పేదల హక్కులు తుంగలో తొక్కిన టీఆర్ఎస్ పాలన



- కమిషన్లకే పరిమితమైన పది ళ్ల పాలన

సారిక శ్రీనివాస్ రెడ్డి

**నేటి సాక్షి గజ్వేల్..:** సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో ఐదవ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సారిక శ్రీనివాస్ రెడ్డి గత టీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత పదేళ్ల టీఆర్ఎస్ పాలనలో పేద ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని, ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ప్రజల అవసరాలకన్నా కమిషన్లకే అధిక ప్రాధాన్యం ఇచ్చి, అనవసర నిర్మాణాలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ పేద ప్రజల ప్రాణాలను కాపాడుతోందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించి గూడు కల్పిస్తున్నామని తెలిపారు. పేద ప్రజల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి పాలన యొక్క ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహకారంతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. మాజీ మంత్రి గీతారెడ్డి హయాంలో ప్రజ్ఞాపూర్‌లో ఉన్నత పాఠశాల, కొడకండ్లలో 400 కేవీ సబ్‌స్టేషన్, గజ్వేల్ పట్టణంలో మార్కెట్ యార్డ్, ఇండోర్ స్టేడియం, పేదలకు ఇండ్ల పట్టాలు, ప్రజ్ఞాపూర్‌కు ఆర్టీసీ బస్సు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల సంక్షేమం కోసం నిజాయితీగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను మున్సిపాలిటీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

# అనుమానాస్పద మృతిని సేదించి పోలీసులు.



- సిఐ సురేష్ కుమార్ మీడియా సమావేశం

**నేటి సాక్షి తిరుపతి రామచంద్రాపురం:** తిరుపతి జిల్లా, రామచంద్రాపురం మండలం, బలిజపల్లిలో జరిగిన మునేశ్వరి మృతి కేసులో పోలీసులు కీలక విషయాలను మీడియాతో చంద్రగిరి సిఐ సురేష్ కుమార్ వెల్లడించారు ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ తొలుత అనుమానాస్పద మృతిగా భావించిన ఈ కేసును, విచారణ అనంతరం హత్యగా నిర్ధారించారించామన్నారు పాత నేరస్తుడైన విశ్వనాథ్ అలియాస్ ప్రశాంత్ అనే వ్యక్తి, దొంగతనం చేసే ఉద్దేశంతో గోడ దూకి మునేశ్వరి ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ సమయంలో ఆమె అడ్డుకోవడంతో, నిందితుడు ఆమె గొంతు నొక్కి బలంగా కిందకు నెట్టాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన మునేశ్వరి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, నిందితుడు ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, ఇంట్లోని నగదుతో పరారయ్యాడని తెలిపారు సాంకేతిక ఆధారాలు, పక్కా సమాచారంతో ఎస్ ఐ భక్తవత్సలం తన సిబ్బందితో గాలించిన నిందితుడు విశ్వనాథ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజం బయటపెట్టినట్లు తెలిపారు నిందితుడిపై గతంలోనే తిరుపతి పరిసర ప్రాంతాల్లో నాలుగుకు పైగా దొంగతనం కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు తన నేరాన్ని అంగీకరించడంతో, అతని వద్ద నుండి అపహరించిన సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని సిఐ తెలిపారు

# బేటీ బచావో.. బేటీ పడావో..

జగిత్యాల జిల్లాలో ఘనంగా 'జాతీయ బాలికల దినోత్సవం'

బాలికలు అన్ని రంగాల్లో రాణించి సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత




**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య ):** జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. జిల్లాలోని భవానీనగర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం KGBV), సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, రాయికల్, కథలాపూర్ KGBV పాఠశాలలలో నిర్వహించిన కార్యక్రమాల్లో బాలికల సాధికారతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత మాట్లాడుతూ.. బాలికల విద్య, భద్రత, సాధికారతపై కీలక సందేశం ఇచ్చారు. బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచి సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. చదువు ద్వారానే డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, కలెక్టర్లు, పోలీస్ అధికారులు వంటి ఉన్నత హోదాల్లోకి ఎదగవచ్చని పేర్కొన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఇవి బాలికల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. సరైన విద్య లభించకపోతే తల్లిదండ్రులు చిన్న వయసులోనే వివాహం చేసే ప్రమాదం ఉంటుందని, అందుకే బాలికలు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు, వివరాలు షేర్ చేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. దుండగుల చేతికి సమాచారం చేరితే అనర్థాలు జరిగే అవకాశముందని తెలిపారు. అలాగే ఆస్తిలో బాలికలకు సమాన హక్కు ఉందని గుర్తుచేస్తూ, ప్రతి బాలిక ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవాలని పిలుపునిచ్చారు.జిల్లా సంక్షేమ అధికారి కె. రాజ్‌కుమార్ మాట్లాడుతూ బాలికలు తమలోని అంతర్లీన శక్తిని గుర్తించి ముందడుగు వేయాలని, సమాజంలో సమాన హక్కులతో ముందుకు సాగాలని సూచించారు. జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ విద్యే బాలికలకు అసలైన బలం అని, విద్యావంతులైన బాలికలే సమాజాన్ని ముందుకు నడిపిస్తారని పేర్కొన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన నాటకాలు, నృత్యాలు, పాటలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బాలికలపై జరుగుతున్న అగాథ్యాలు, వివక్షను చిత్రలేఖనాల ద్వారా అద్దం పట్టి అవగాహన కల్పించారు. బాలికల అభివృద్ధి, రక్షణ కోసం విద్యార్థినులు, ఉపాధ్యాయులు, అధికారులు కలిసి 'బేటీ బచావో - బేటీ పడావో' ప్రతిజ్ఞ చేశారు. బాలికల భద్రత, విద్య, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ అధికారి హరీష్, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ కొండయ్య, పీ.వో. సురేష్, జెండర్ స్పెషలిస్టులు స్వప్న, గౌతమి, హేమ, శారద, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ముదిరాజులకు అవకాశం ఇవ్వండి

ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ని కలిసిన ముదిరాజు నాయకులు



**నేటిసాక్షి, నల్లగొండ :** జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో అనుముల గ్రామంలోని 10వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గా ముదిరాజులకు కాంగ్రెస్ పార్టీ నుండి బిఫామ్ ఇవ్వాలని శనివారం కాంగ్రెస్ పార్టీ ముదిరాజు నాయకులు నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బీసీ మహిళ రిజర్వేషన్ లో భాగంగా అత్యధికంగా ఉన్న ముదిరాజులకే 10వ వార్డు టికెట్ కేటాయించాలని, రాజకీయ రంగంలో వారికి ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించాలని, ముదిరాజ్ సంఘం పెద్దలు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు సంఘం నాయకులు గంపల సత్యనారాయణ, తోటిపల్లి శివ, పిట్టల ఏడుకొండలు, తోటిపెల్లి బాలకృష్ణ, హరి, సాయి, శివాజీ, మల్లయ్య, ఇతరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా గొబ్బెమ్మ దేవర





**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** అన్నమయ్య జిల్లా, పుంగనూరు నియోజకవర్గం, చౌడేపల్లి మండలం, పందిలపల్లి పంచాయతీలోని నడుమూరు గ్రామస్తులచే పూర్వీకుల నుంచి ఆనవాయితీగా వస్తున్న గొబ్బెమ్మ దేవరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ దేవరను సంక్రాంతి మరసటి రోజు చేస్తారు. గౌరీదేవికి పూజలు చేసి, పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చారు. రంగులు వేసుకుంటూ, అమ్మవారిని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో చౌడేపల్లి మండల వైస్ ఎంపీపీ ఆర్. సుధాకర్ రెడ్డి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముగిసినమోకిల బ్రహ్మోత్సవాలు

వైభోగంగా ముగింపు వేడుకలు




**నేటి సాక్షి రంగారెడ్డి జిల్లాశంకర్పల్లి:** రంగారెడ్డి జిల్లా శంకర్పల్లి మండలం మోకిల గ్రామంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న శ్రీ మోకిలా లక్ష్మీ నరసింహ స్వామి వారి ద్వితీయ వార్షికోత్సవాలు శుక్రవారం వసంత పంచమి పర్వదినాన అత్యంత వైభవంగా ముగిశాయి కన్నుల పండుగ తిరు కళ్యాణం మహోత్సవం బ్రహ్మోత్సవాలు ముగింపు రోజైనా శుక్రవారం నాడు ఉదయం ఆరు గంటల నుండే ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి స్వామివారి మూలమూర్తికి ఏ ఏక విశ్రాంతి కుంకుమలతో విశేష అభిషేకాలు అలంకరణలు నిర్వహించారు అనంతరం యాగశాలలో మహాపూర్ణ హంతిని శాశ్వతంగా పూర్తి చేశారు ముగింపు వేడుకల్లో భాగంగా ఆలయంలో ముందు ఏర్పాట్లు చేసిన ప్రత్యేక వేదికపై శ్రీ స్వామివారి తిరుకళ్యాణం మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది వేలాదిమంది భక్తులు ఈ కళ్యాణం వేడుకలు ఉత్సవాలు వీక్షించే ధరించారు అనంతరం ధ్వజపట ఆరోహణం కుంభ శోక్షన కార్యక్రమం తో పరిసప్తమయ్యాయి భక్తులతో పోటెత్తిన ఆలయ ప్రాంగణం ఉత్సవాలు సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు వడ్డే భూదేవి లక్ష్మయ్య వారి కుమారుడు వడ్డే గిరి ప్రసాద్ యాదగిరి గుట్ట ప్రధాన అర్చకులు చలమయ్య మారయ్య మోకిల గ్రామ మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి గ్రామ భక్తబృందం అన్ని ఏర్పాట్లు చేశారు బ్రహ్మోత్సవాలు చివరి రోజున భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు స్థానిక బృందాల సంకీర్తనలతో మోకిల గ్రామం ఆధ్యాత్మిక శోభతో విరజిల్లింది చివరగా పండిత సన్మానం మరియు భక్తులకు ఆశీర్వచక కార్యక్రమంతో ఈ వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయని నిర్వాహకులు వడ్డే శేఖర్ వడ్డే శ్రీనివాస్ నర్సంపేట సాయి కుమార్ వడ్డే మల్లికార్జున్ వడ్డే శ్రీకాంత్ అలంకార్ గూడ గ్రామానికి చెందిన కొత్తపల్లి కుమార్ గ్రామ మహిళలు యువకులు ఇతర గ్రామాల నుండి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసినందుకు వడ్డే భూదేవి లక్ష్మయ్య కృతజ్ఞతలు తెలిపారు

# బాలికల శ్రేయస్సే భవితకు మార్గం



**నేటిసాక్షి : జగదేవపూర్ :** జాతీయ బాలికల దినోత్సవం సందర్బంగా ఇటిక్యాల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన బాలికల విద్యా చైతన్య కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిధిగా దీనా రాజలింగం మాట్లాడుతూ బాలికల శ్రేయస్సే భవితకు మార్గమని ప్రతి ఆడబిడ్డ చదివి అన్ని రంగాల్లో రాణించినపుడే ఈ దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఉపసర్పంచ్ నరేష్ మాట్లాడుతూ పాఠశాలలో చిన్నారి బాలికలు భారత దేశవీర నారీమణులు, ప్రముఖ మహిళామనుల వేషాధారణలో వారి సేవలను జ్ఞప్తికి తెచ్చారని అభినందించారు. మాజీ సర్పంచ్ శేఖర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం ఉపాధ్యాయ బృందం కృషి చేస్తుందని వారికి మేము తోడ్పాటుగా ఉంటామని పాఠశాలకు సౌండ్ సిస్టం మరియు షూస్, యూనిఫామ్ ఇప్పిస్తామని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ మాట్లాడుతూ దాతల సహకారం ఉంటే పాఠశాల విద్యార్థులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ సందర్బంగా పాఠశాలకు స్కూల్ బ్యాండ్‌ను డొనేట్ చేసిన పాఠశాల ఉపాధ్యాయని మంజులను గ్రామ సర్పంచ్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఐలయ్య, నాయకులు రాజలింగం, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్యామయ్య, పాఠశాల ఉపాధ్యాయులు నరేందర్, శ్రీనివాస్ రెడ్డి, మంజుల, భవాని, కమృద్దీన్, అనురాధ, సుశీల, మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చదువుతోపాటు ఆరోగ్యం ముఖ్యమే

తిగుల్ గ్రామ సర్పంచ్ రజిత



**నేటిసాక్షి : జగదేవపూర్ :** విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని గ్రామ సర్పంచ్ రజిత పరుశురాం పేర్కొన్నారు. శనివారం జగదేవపూర్ మండలం తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐకేఏస్ కెరీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పాఠశాలలో ఉన్న ప్రతి విద్యార్థికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎంతో మంది విద్యార్థులు ఉపవాసంతో పాఠశాలలకు వచ్చి అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యమే ముఖ్యంగా పాఠశాలకు రావడం మంచిదన్నారు. ఉదయం తప్పకుండా విద్యార్థులు భోజనంచేసి పాఠశాలకు రావాలని కోరారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని వివరించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రతిభకు పదును పెట్టి పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందుతుందని విద్యార్థులు ఇటు పాఠశాల అటు ఇంటి భోజనాన్ని కాకుండా ఆరు బయట లభించే భోజనాన్ని తీసుకోవడం వలన అనారోగ్యం పాడిన పడతారని వివరించారు. ఫౌండేషన్ ద్వారా ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టడం హర్ష నియమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు, వైద్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గజ్వేల్,ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో రాజకీయ సమరం






- బీసీ మహిళ రిజర్వేషన్‌తో మారిన సమీకరణాలు
- టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య హోరాహోరీ పోటీ

**నేటి సాక్షి గజ్వేల్..:** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ఈసారి రాజకీయంగా అత్యంత కీలకంగా మారాయి. మొత్తం 20 వార్డులు ఉన్న ఈ మున్సిపాలిటీలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య గట్టి పోటీకి వేదిక సిద్ధమైంది. గతంలో రెండు పర్యాయాలు టీఆర్ ఎస్ పార్టీ చైర్మన్ పదవిని దక్కించుకోగా, ఈసారి పరిస్థితులు పూర్తిగా మారినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ ఎన్నికలకు ముందు మల్లన్నసాగర్ ప్రాజెక్టు భూ నిర్వాసితుల 14 గ్రామాలకు కేటాయించిన ఆర్ అండ్ ఆర్ కాలనీలను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేయడం ఎన్నికల రాజకీయాన్ని మరింత ఆసక్తికరంగా మార్చింది. ఈ విలీనంతో మున్సిపాలిటీలో మొత్తం ఓటర్ల సంఖ్య 46,724కు పెరిగింది. కొత్తగా చేరిన ఓటర్లు ఏ పార్టీకి మొగ్గు చూపుతారన్న అంశం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. రిజర్వేషన్ల విషయంలోనూ ఈ ఎన్నికలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. మొదటిసారి బీసీ జనరల్‌గా, రెండోసారి ఓసీ జనరల్‌గా చైర్మన్ పదవిని కేటాయించగా, ఈసారి బీసీ మహిళగా రిజర్వేషన్ ఖరారవడం రాజకీయ పార్టీల వ్యూహాలను పూర్తిగా మార్చేసింది. బీసీ వర్గాలు, మహిళా ఓటర్లను ఆకట్టుకునే దిశగా అన్ని పార్టీలు ప్రత్యేక కార్యాచరణకు దిగినట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ (బీఆర్ఎస్), కాంగ్రెస్, బీజేపీ ప్రధానంగా పోటీ పడుతున్నాయి. అధికారంలో ఉన్న టీఆర్ఎస్ గత విజయాలను ముందుంచుతూ అభివృద్ధి పేరుతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలు, భూ నిర్వాసితుల ఆవేదనలను అస్త్రంగా చేసుకొని బలమైన ప్రచారానికి సిద్ధమవుతోంది. బీజేపీ కూడా రాష్ట్ర రాజకీయాల్లో బలం పెంచుకునే లక్ష్యంతో ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం ముమ్మరం చేసింది. ప్రతి పార్టీ తమ గెలుపు గుర్రాలనే బరిలోకి దింపుతూ విజయం తమదేనన్న ధీమా వ్యక్తం చేస్తోంది. వార్డుల వారీగా స్థానిక సమీకరణాలు, కుల గణితం, అభ్యర్థుల వ్యక్తిగత ఇమేజ్ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అంశాలుగా మారాయి. మొత్తానికి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికలు ఈసారి కేవలం స్థానిక పాలనకే కాకుండా రాష్ట్ర రాజకీయాలపై కూడా ప్రభావం చూపే స్థాయిలో మారాయి. చివరకు ఏ పార్టీ జెండా ఎగరేస్తుందో, ఎవరి వ్యూహం ఫలిస్తుందో అన్నది మరికొద్ది రోజుల్లో తేలనుంది.

# రోడ్డు ప్రమాదాల నివారణకు అరైవ్ అలైవ్' కార్యక్రమం.




- కాగజ్‌నగర్ పేపర్ మిల్లులో నిర్వహణ ముఖ్య అతిథి గా పాల్గొన్న ఎస్పీ నితికా పంత్
- హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం జిల్లా ఎస్పీ నితికా పంత్
- మద్యం సేవించి డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు అరైవ్ అలైవ్' వేదికగా హెచ్చరిక

**నేటి.సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్:** రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ అలైవ్.కార్యక్రమం ఈ రోజు కాగజ్ నగర్ పట్టణం లోని పేపర్ మిల్లు నందు కాగజ్ నగర్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ నితికాపంత్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల గారితో కలిసి హాజరయ్యారు. పేపర్ మిల్లు కార్మికులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ... వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని అన్నారు. దేశంలో గత సంవత్సరం రోడ్డు ప్రమాదాల్లో 1,07,000 మరణించగా, తెలంగాణ రాష్ట్రం నుండి సుమారు 8,000 మంది మరణించడం బాధాకరమైన విషయమని అన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, రాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించక వాహనాలు నడపడం లాంటి నిర్లక్ష్యాల వల్ల రోడ్డు ప్రమాదాలు మరింత ఎక్కువ అవుతున్నాయని తెలిపారు. సోషల్ మీడియాలో రీల్స్ కోసం బైక్స్ పై సాహస కృత్యాలు చేసే వారిని పెట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదని, అలాంటివి ప్రజలు చూసిన ఎడల పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ప్రస్తుతం దేశంలో రోడ్డు భద్రత చట్టాలు మరింత కఠినతరంగా ఉన్నాయని, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురి అయ్యి జీవితాలను చిన్నభిన్నం చేసుకోవద్దని అన్నారు. కార్మికులు, ప్రజలు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, వ్యక్తిగత భద్రతతోనే రోడ్డు ప్రమాదాలను నివారించడం సులువైన మార్గమని అన్నారు. ఓవర్ లోడ్ తో ప్రయాణించే వాహనాలు లోడ్ ను తగ్గించుకోవాలని, పేపర్ మిల్ కార్మికులందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాగజనగర్ డిఎస్పీ వాహిదుద్దీన్, ఎస్.పి.ఎం ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ అమరేంద్ర కుమార్ , జి.ఎం గిరి, ఎం.ఆర్.ఓ మధుకర్, ఎ.ఎం.వి.ఐ చంద్రశేఖర్, కాగజనగర్ పురపాలక కమిషనర్ తిరుపతి, సిఐ లు ప్రేమ్ కుమార్, కుమారస్వామి, ఎస్ ఐ సుధాకర్,ఫ్యాక్టరీ కార్మికులు పాల్గొన్నారు.

# జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

**నేటి సాక్షి వికారాబాద్:** జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ కొత్తగాడి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ & కాలేజీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడిన జిల్లా ఎస్పీ నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతూ ముందంజలో ఉన్నారని, ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కేవలం ప్రతిభ మాత్రమే కాకుండా ఆత్మవిశ్వాసం, నిరంతర కృషి, పట్టుదల ఎంతో అవసరమని పేర్కొన్నారు."విద్య అనేది మీరు ధరించే అత్యంత శక్తివంతమైన ఆభరణం ఆయుధం. అది మీ భవిష్యత్తును మార్చడమే కాకుండా సమాజంలో మీకు గౌరవప్రదమైన స్థానాన్ని కల్పిస్తుంది" అని ఆమె తెలిపారు. ప్రతి బాలిక తనకు తాను ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఎదురయ్యే అడ్డంకులను ధైర్యంగా అధిగమిస్తూ విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. బాలికలు తమపై తాము నమ్మకం పెంచుకోవాలని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా వెనకడుగు వేయకుండా ముందుకు సాగాలని సూచించారు. అదేవిధంగా బాలికల రక్షణ మరియు భద్రత అంశాలపై జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అన్యాయం జరిగినప్పుడు భయపడి మౌనంగా ఉండటం నేరస్తులకు మరింత ధైర్యాన్ని



ఇస్తుందని, కాబట్టి ప్రతి బాలిక తన గళాన్ని విప్పి ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో షీ టీమ్స్ (షీ టీమ్స్) నిరంతరం నిఘా ఉంచుతూ బాలికలు, మహిళల భద్రత కోసం పనిచేస్తున్నాయని తెలిపారు. ఎలాంటి ఆపదలో ఉన్నా లేదా వేధింపులకు గురైన సందర్భాల్లో సంకోచించకుండా వెంటనే 100 డయల్ చేయాలని లేదా షీ టీమ్ వాట్సాప్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థినులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షీ టీమ్ అధికారులు కళాజాత బృందం వారు తమ ఆటపాటలు, ప్రదర్శనల ద్వారా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళా భద్రతకు సంబంధించిన చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలి అనే అంశాలపై విద్యార్థినులకు ఎంతో ఆకట్టుకునే విధంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సరోజా, ~~ఇన్స్పెక్టర్ అన్వార్ పాషా, పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఎం.వి.ఎఫ్ ఫౌండేషన్ అధికారులు, జిల్లా షీ టీమ్ సిబ్బంది, కళాజాత బృందం అధికారులు విద్యార్థినులు పాల్గొన్నారు.

# యువ ఓటర్లతోనే బలమైన ప్రజాస్వామ్యం

- ఓటు వినియోగమే బాధ్యతాయుత పౌరత్వం

**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ ఓటర్ దినోత్సవంగజ్వేల్: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 16వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల మరియు గజ్వేల్ మండల రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాస రచన, ప్రసంగం తదితర పలు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ శ్రీమతి కమల క్రిస్టియాన అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి విద్యార్థి ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ముఖ్య అతిథిగా హాజరైన గజ్వేల్ మండల రెవెన్యూ అధికారి శ్రీ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, నేటి యువత ఓటు హక్కు వినియోగంపై నిర్లక్ష్యం చూపడం ఆందోళనకరమని, దీని వల్ల మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం కోల్పోతామని అన్నారు. "ఒకే వ్యక్తి - ఒకే ఓటు - ఒకే విలువ" అనే నినాదం సార్వత్రిక ఓటు హక్కు ప్రాధాన్యతను చాటుతుందని పేర్కొన్నారు. పోటీలలో విజేతలైన విద్యార్థులకు ఎన్నికల సంఘం తరఫున సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని రాజకీయ శాస్త్రం, ప్రభుత్వ పాలన విభాగాల అధ్యాపకులు డాక్టర్ డి. సుజాత, డాక్టర్ బి. మురళీధర్ మరియు ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 అధ్యాపకురాళ్లు డాక్టర్ పి. సౌజన్య, డాక్టర్ సరోజ సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు భాస్కర్, కృష్ణ, కళాశాల ఐక్యుఏసీ కోఆర్డినేటర్ ఎం.ఎం. లక్ష్మి, అకాడమిక్




కోఆర్డినేటర్ డాక్టర్ జే. ఉమారాణి, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ సిహెచ్. శోభారాణి, డాక్టర్ ఏ. బాలచంద్రం, డాక్టర్ పి. జయరాజు, శ్రీమతి కస్తూరిబాయి, శ్రీమతి అర్చన, డాక్టర్ సునీత, దేవదాస్, స్వర్ణతో పాటు అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.